

మొల్ల పురస్కార గ్రహీత

నిడదవోలు మాలతి
సాహిత్యావలోకనం



మార్చి 11, 2023

మొల్ల సత్కారసభలో ప్రసంగ వ్యాసాలు

మార్చి 11, 2023
మొల్ల సత్కారసభలో ప్రసంగ వ్యాసాలు
సారంగ పబ్లికేషన్స్

కవర్ & బుక్ డిజైన్
అక్షర క్రియేటర్స్
హైదరాబాద్
ఫోన్: 99496 56668

ఇవీ వ్యాసాలు...

మొల్ల పేరుతో సత్కారం ఎందుకంటే...

కల్పనా రెంటాల

ఏడు శతాబ్దాలనాటి రచయిత్రి మొల్ల. ఏడు వసంతాల సాహిత్యసౌరభం మాలతిగారు. ఈ ఇద్దరినీ, మరెందరో సాహిత్య విమర్శకులను, అభిమానులను కలుపుతున్న సాంకేతిక జూమ్ సమావేశం. నిజంగా స్త్రీల సాహిత్యచరిత్రలో నావరకు ఇదొక శుభ సందర్భం. చారిత్రక సన్నివేశం.

ఆరేడు వందల ఏళ్ల క్రితం తాను తెలుగీకరిస్తున్న రామాయణం గురించి, తన గురించి ఎందరో స్త్రీలు ఇలా తలుచుకుంటారని మొల్ల ఊహించి ఉండదు. మాలతిగారి సాహిత్యకృషి గురించి కూడా కేవలం ఈరోజే కాకుండా ముందు తరాలవాళ్లు కూడా ఆమె కృషిని గుర్తించి గౌరవించి చర్చించుకొని మాట్లాడుకునే సందర్భాలు రాబోయే తరాల్లో ఎన్ని ఉన్నాయో, ఎన్ని ఉంటాయో మనం ఊహించుకోవచ్చు.

చారిత్రక మొల్లకు, భవిష్యత్తు మాలతిగారికి మధ్య వారధి ఈ సమావేశం.

మొల్ల పేరుతోనే ఎందుకీ సత్కారం? అంటే 80ల నుంచి స్త్రీల సాహిత్యకృషిని ప్రత్యేక చారిత్రక దృక్పథంతో విమర్శకు పెట్టే సాధనాలు సమకూర్చుకున్న తర్వాత గార్గి గురించి, మైత్రేయి గురించి కూడా మాట్లాడుకోగలిగాము. మొల్ల తొలి తెలుగు కవయిత్రి. ఆమె కాలం గురించి, కులం గురించి, చివరకు ఆమె శీలం గురించి కూడా ఏవేవో పుక్కిట పురాణపు కథలు ప్రచారంలో ఉన్నాయి. అవి మనం లెక్కలోకి తీసుకోనక్కరలేదు. స్పష్టంగా కంటికి కనిపించే ఆధారం

జాను తెలుగులో, అప్పటి వ్యావహారికంలో సంస్కృత రామాయణాన్ని ధైర్యంగా తెలుగులో తనదైన శైలిలో రాసిన రచయిత్రి మొల్ల. ఈ కాలంలోనే స్త్రీల రచనలను ఎలా అంచనా వేస్తున్నారో చూశాక, ఆ కాలంలో ఆమె ఎదుర్కొన్న సమాజాన్ని కొంత ఊహించవచ్చు. అందుకు మొల్లను మనం గుర్తుంచుకోవాలి, గుర్తు తెచ్చుకోవాలి ఎప్పటికప్పుడు.

స్వాతంత్ర్యానంతరం రచయిత్రులు ఎంతోమంది ఎన్నో రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ఇందులో ఎంతమందిని మళ్లీ మళ్లీ మనం రీరీడింగ్ అంటే పునర్ మూల్యంకనం ఎప్పటికప్పుడు చేసుకోగలుగుతున్నాము? ఆ దిశగా ఆలోచించినప్పుడు ముందు మనకు గుర్తొచ్చే పేరు నిడదవోలు మాలతిగారు. 60ల నాటి స్త్రీల సాహిత్యకృషిని గురించి ఆమె విశ్లేషణాత్మక మైన రచనలు చేశారు. అవి తెలుగులోనే రాసి ఉంటే వాటి ప్రయోజనం కొంతమేరకే అయి ఉండేది. అయితే ఆమె ఈ కృషిని ఇంగ్లీష్‌లో చేశారు. తెలుగు సాహిత్యం గురించి ఇంగ్లీష్‌లో ఎంత మేరకు కృషి జరుగుతోందీ, అదీ ముఖ్యంగా స్త్రీల సాహిత్యం గురించి అన్న విషయం నేను ప్రత్యేకంగా మరోసారి గుర్తు చేయక్కరలేదు. నిడదవోలు మాలతిగారి కలం నుంచి వచ్చిన విశిష్ట రచనలలో ఆ వ్యాసాల సంకలనం ముందుంటుంది. ఆ రకంగా తెలుగులో వచ్చిన స్త్రీల సాహిత్యాన్ని ముందు తరాల వారికి పదిలం చేశారు. అందువల్ల మొల్ల పేరుతో సాహిత్య సత్కారం అనుకోగానే నాకు మొదట మెదిలిన పేరు మాలతిగారు మాత్రమే.

ఆమె బయోడేటా చదవటానికే నాకు పది నిముషాలు పడుతుంది. అన్ని రచనలు చేశారు. దాదాపు అన్నీ ప్రక్రియలలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఆమె రాసిన కథలు పదకొండు సంకలనాలు. ఏడు కథామాలతీయాలు అయితే మరో నాలుగు ఎన్నెమ్మ కథాసంకలనాలు. వ్యాసాల సంకలనాలు మరో నాలుగు. ఇవి కాక చాతకపక్షులు, మార్పు– రెండు నవలలు. అచ్చుమైన దయాస్పోరా నవలను రాసింది మొదట మాలతిగారే. ఇవికాక ఆమె అనువాదాలు, ఇంగ్లీష్ తెలుగు తూలిక వెబ్‌సైట్లు. చాలామంది అనువాదకులు సృజనాత్మక రచనలు తక్కువ చేస్తారు. లేదా వైస్ వర్సా. అయితే మాలతిగారు ఎన్ని చేతులతో ఇన్ని రచనలు చేశారో ఊహించటం కూడా కష్టం. తెలుగు సాహిత్యం గురించి ఇంగ్లీష్‌లో చదవాలంటే రీసెర్చ్ స్కాలర్స్‌కైనా, మామూలు చదువరులకైనా authentic వెబ్‌సైట్ ఇంగ్లీష్ తూలిక. ఇంకా ఎన్నో ఉన్నాయి ఆమె సాహిత్యకృషిని గురించి చెప్పుకుంటూ పోతే.

నాకు మాలతిగారు రెండు దశాబ్దాల నుంచి తెలుసు. ఎన్నో సాహిత్యచర్చలు ఫోన్‌లోను, వీడియో, ఆడియోల రూపంలో నిర్వహించాము.

మాలతిగారిలాంటి రచయిత్రి కన్నడంలోనో, మలయాళంలోనో ఉంటే నెత్తిన పెట్టుకొని పూజించేవారు. దురదృష్టవశాత్తూ ఆమె తెలుగువారయ్యారు. అందులోనూ అమెరికా తెలుగువారయ్యారు. అందుకే ఆమెకు రావలసిన గుర్తింపు రాలేదేమో అనిపిస్తుంటుంది.

ఈ మొల్ల సత్కారం గురించి కూడా రెండు మాటలు చెప్తాను.

ఇది నగదు సత్కారం కాదు. దుశ్శాలువాలు లేవు. వక్తలలో ఒకరు ముఖ్యులు, మరొకరు విశిష్టులు లేరు. అందరం సమానం. ఒక రచయిత్రి రచనల గురించి చదివి చర్చించుకోవటం ఒక్కటే పరమ ప్రయోజనం ఈ కార్యక్రమానికి. సత్కార గ్రహీతల విషయంలో కేవలం సాహిత్యం తప్ప, ప్రాంతీయ, కుల,అజెండాలకు మార్కులు లేవు. ఈ సత్కారం ఏడాదికోకసారి అనుకుంటున్నా. సమయం, సహకారం ఉంటే ఏడాదికి రెండుసార్లు కూడా హాయిగా జరుపుకోవచ్చు. ఇతరుల సాహిత్యం గురించి మాట్లాడదాము. మన సాహిత్యం గురించి మరొకరు మాట్లాడటానికి దారి వేద్దాము.

మొల్ల సత్కారం గురించి నా ఆలోచనలు ఇవి. మీరందరూ ఈ సత్కారానికి ఎవరు అర్హులు అనుకుంటున్నారో తెలియచేయండి. పరస్పరం మాట్లాడుకొని ఈ కార్యక్రమం ద్వారా తెలుగు సాహిత్యంలో ఆదరణకు నోచుకోని రచయిత్రుల రచనల గురించి మాట్లాడుకుందాము.

మార్చి 12, 2023



నా సాహిత్య ప్రస్థానం

నిడదవోలు మాలతి

మార్చి 11, 2023 శనివారంనాడు జరిగిన మొల్ల పురస్కారం సభ నా సాహిత్యప్రస్థానంలో అనేకవిధాల చిరస్మరణీయమైనది. నాకు గొప్ప ఆనందాన్నీ సంతృప్తినీ కలిగించినది. ఒకవిధంగా ఆలోచిస్తే తెలుగు కథాసాహిత్యచరిత్రలో నా స్థానాన్ని నిర్వచించిందేమో కూడా. ఆరోజు సభలో వక్తలు చేసిన ప్రసంగాలు ప్రాతిపదికగా, నా సాహిత్యప్రస్థానం, ఎక్కడినించి ఎక్కడికి వచ్చేనో సూక్ష్మంగా వివరిస్తాను.

నా వ్యాసం కొనసాగించే ముందు, కల్పన పరామర్శించిన అంశాలలో ఒకటి మొల్ల సత్కారసభ చారిత్రక సమావేశం అన్నది. అది నా సాహిత్య ప్రస్థానానికి కూడా అన్వయిస్తుంది. నా సాహిత్య ప్రస్థానంలో చారిత్రకమే. రెండోది తగిన గుర్తింపు రాలేదన్నది. అసలు గుర్తింపు అంటే అకాడెమీలు, సాహిత్యసంస్థలూ ఇచ్చే పురస్కారాలా? లేక, పాఠకులు ఆసక్తితో చదివి, ఆనందించి, స్పందించేవా? నా అభిప్రాయంలో రెండోదే. అది నాకు చాలాకాలంగానే ఉందని ఈ మొల్ల సత్కారసభతో ఋజువైంది. మీరు గుర్తించేరు కనుక, మీరూ కల్పనా అందించిన గుర్తింపే గుర్తింపు. నాకు గర్వకారణం.

మొల్ల పురస్కారసభలో ప్రసంగాలు స్థూలంగా నాలుగు అంశాల మీద జరిగాయి. వ్యాసాలు, కథలు, నవలలు, అనువాదాలు. సభ వ్యాసాలతో మొదలయింది కనక మొదట వ్యాసాలు తీసుకుందాం.

ఈ వ్యాసం కోసం ఏది నా మొదటి వ్యాసం అన్నది వెతికేను కానీ సరిగ్గా తెలియడంలేదు. నేను ఇండియాలో ఉన్నప్పుడు, తిరుపతిలో లైబ్రరీలో పని

చేస్తున్నప్పుడు లైబ్రరీ సైన్సుకి సంబంధించిన వ్యాసాలు ఇంగ్లీషులో రాసేను. కిందటేడు ఏవో పాత కాగితాల మధ్య అవి కనిపించే వరకూ నాకు రాసినట్టే గుర్తులేదు. ఏదో కాన్ఫరెన్సు కోసమో, ఏదో జర్నల్ అడిగితేనో రాసినవి అవి. ఈ వ్యాసాలు స్కాన్ చేసి తెలుగు తూలిక బ్లాగులో ప్రచురిస్తే, ప్రొఫెసర్ ఉషా దేవి అయినవోలు ఆ వ్యాసాలలో నేను ప్రతిపాదించిన అంశాలు ఈనాటికీ పాఠ్యగ్రంథంలా ఉపయోగిస్తాయన్న వ్యాఖ్యానం చదువుతుంటే ఆర్. వసుంధరా దేవి నాతో అన్న మాట గుర్తొచ్చింది. 'మీరు రాసిన వాటిలో ఒక పాయింటు ఉంటుంది,' అన్నారు వసుంధరాదేవి. ఏ రచయితకైనా ఇది మంచి ఆమోదముద్రే కదా.

నా లైబ్రేరియన్ అవతారంలో 9 ఏళ్లు గడిపేను. ఆరోజుల్లో తెలుగు కథలు రాసేదాన్ని కానీ లైబ్రరీ సైన్సుకి సంబంధించిన వ్యాసాలు కూడా రాసేనని మాత్రం ఈమధ్యనే కనిపెట్టేను. ఏవో పాతకాయితాలు వెతుకుతుంటే కనిపించేయి. మా అల్లుడు వాటిని స్కాన్ చేసి యిచ్చేడు. నా బ్లాగులో ప్రచురించేను. అప్పుడు కూడా నేను వాటిని సీరియస్‌గా తీసుకోలేదు. కానీ అయినవోలు ఉషాదేవి వాటిని చదివి, ఆ వ్యాసాలలో నేను పరామర్శించిన అంశాలు, వెలిబుచ్చిన అభిప్రాయాలు ప్రత్యేకంగా ఉన్నాయని చెప్పి, వాటిమీద ఒక వ్యాసం రాసేరు. సారంగ మేగజైనులో ప్రచురించబడింది. ఇది నాకు ప్రత్యేకంగా ఆనందదాయకమైన కారణం. నేను ఏ అంశం తీసుకున్నా ఏదో చెప్పడానికి ఉన్నప్పుడే చెప్తానని మరొకమారు ఋజువవడం. ఇది స్వోత్కర్షలా ఉంది కానీ చెప్పుకోకుండా ఉండలేను.

తెలుగులో ఇంటింట గ్రంథాలయం అన్న వ్యాసం ఆంధ్రప్రభలో ప్రచురించింది కనిపించింది. అంతేకానీ సాహిత్యానికి సంబంధించినవేమీ లేవు. అమెరికా వచ్చేక, తూలిక.నెట్ మొదలుపెట్టేక, నేను ఇంగ్లీషులో రాసిన వ్యాసాలు ప్రధానంగా తెలుగు సాహిత్యాన్ని, రచయితలను విదేశీ పాఠకులకు పరిచయం చేయడం కోసం రాసినవి. దయచేసి రచయిత్రుల కోసం మాత్రమే కాదని గమనించండి. ఇది ప్రత్యేకంగా ఎందుకు చెప్తున్నానంటే, నా సైటుని నేను స్త్రీల కోసమే పెట్టేనని కొందరు ప్రముఖ రచయితలు, పండితులు నా ముందే అనడం విన్నాను కనక. కాదండి, అది స్త్రీల కోసమే కాదని చెప్పుకోవలసి వచ్చింది. ఇంతకీ, నా ఇంగ్లీష్ వ్యాసాలలో విశేష ఆదరణ పొందినవి What is A Good Story, మొల్ల రామాయణం. మొల్ల రామాయణం అమెరికాలో ఒక ప్రొఫెసరు తమ బ్లాగులో పునః ప్రచురించుకున్నారు, నాతో సంప్రదించే. What is a Good

Story చదివిన ఒక కెనేడియన్ ప్రొఫెసరు తన కథని విశ్లేషించమని అడిగారు. మరొక అమెరికన్ ట్వీట్ చేసేరు. సౌమ్య చెప్పినట్టు, తూలిక.నెట్ తెలుగేతరవారి దృష్టిని బాగానే ఆకట్టుకుంది.

నేను ఇంగ్లీషులో రాసిన వ్యాసాలలో నా అనుభూతి లేదు. పూర్తిగా వస్తునిష్ఠతో రాసినవే అన్నీ. నిజానికి చాలావరకూ ఇతర విమర్శకుల అభిప్రాయాలు చేర్చి ఒకచోట పెట్టడమే చేసేను ఆ వ్యాసాలలో, నేను సంప్రదించిన పుస్తకాల వివరాలతో సహా. నా ఇంగ్లీషు వ్యాసాలకీ తెలుగు వ్యాసాలకీ ఇది చెప్పుకోదగ్గ వ్యత్యాసం అనుకోవాలి.

నా తెలుగు వ్యాసాలలో కూడా నా అనుభూతులూ, అనుభవాలు లేనివి ఉన్నాయి. ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ, బుజ్జా కమలాదేవి వంటి రచయిత్రుల గురించిన వ్యాసాలలో నా అభిప్రాయాలు చాలా తక్కువే. సిహెచ్. సుశీల రచయిత్రుల మీద రాసిన వ్యాసాల గురించి మాట్లాడుతూ, ఆ వ్యాసాలలో నా అభిప్రాయాలు కొన్ని స్థాలీపులాకన్యాయంగా ఉదహరించి, వాటిలో తనకి నచ్చిన అంశాలు చెప్పేరు. నిజానికి ఈనాడు వస్తున్న వ్యాసాలు చాలామటుకు ఇలాగే ఉంటున్నాయి. ఇంచుమించు అదే ధోరణిలో, కేవలం నా రచనలు సిరికోన వాక్‌స్థలిలో తనని ఎంతగా ఆకట్టుకున్నాయో దివాకర్ల రాజేశ్వరి ఎత్తి చూపేరు. వీరిద్దరి ప్రసంగాలూ నేను కవయిత్రుల గురించి రాసిన వ్యాసాలలాగే ఉన్నాయి. నేను నా వ్యాసాలు ఎలా రాయాలి అన్నది మరోసారి పరిశీలించి చూసుకోవాలేమో అనిపిస్తోంది ఇప్పుడు.

ప్రసంగాలకి భిన్నంగా వ్యాసం రాస్తున్నప్పుడు ఆలోచించుకోడానికీ, విషయాన్ని జాగ్రత్తగా క్రమపద్ధతిలో పెట్టవలసిన అవసరం ఉంటుంది. అవసరమైన చోట ఇతర వనరులను సంప్రదించడానికి వీలు. అందుకే నేను వ్యాసాలు రాయగలను కానీ ప్రసంగాలు చేయలేను. అది ఈ సభ చివరలో స్పష్టమయింది కూడాను.

వ్యాసాలు రాసినప్పుడు వ్యాసకర్తలు ఎంత వస్తునిష్ఠతో (subjective) రాస్తున్నాం అన్నా, కొంతైనా వైయక్తికం (objective) కాకపోదు. ఎందుకంటే తాను ఎంచుకున్న ప్రామాణికాల మీద ఆధారపడి ఉంటాయి వారి వ్యాఖ్యానాలు. అవి తెలుగు, సంస్కృతం, ఆంగ్ల గ్రంథాలు చదివి ఏర్పరుచుకున్న ప్రమాణాలు. ఆ మేరకు అవి వైయక్తికమే కదా.

కథలు చదివినంత మంది వ్యాసాలు చదవరు. మూలగ్రంథమో వ్యాసమో దాన్ని గురించి వ్యాసకర్త ఏమి చెప్తున్నాడో పూర్తిగా తెలియాలంటే ఆ గ్రంథమో వ్యాసమో

చదవాలి. రెండోది ఆ వ్యాసకర్త ఎలా చెప్తున్నారు అన్నది. వ్యాసం రాస్తున్నప్పుడు నేను ఎంతగా ఆ వ్యాసంలో మమేకమైపోతున్నానన్నది నేను ఇంతకుపూర్వం ఆలోచించలేదు. కాత్యాయనీ విద్మహే చెప్పాకే అవును కదా అనిపించింది. ఆమె ప్రస్తావించిన అంశాలలో నాకు కొత్తగా అనిపించినవి, నేను దాదాపు అన్నీ పాజిటివ్‌గానే విశ్లేషించాను, అన్నారామె. అందుకు కారణం ఉంది.

ఒక పుస్తకం చదువుతున్నప్పుడు నాకు ఎంతో నచ్చితే తప్ప నేను వ్యాసం కానీ సమీక్ష కానీ రాయను. చదివి, అలా రాయకుండా వదిలేసినవి కూడా ఉన్నాయి. పోతే, రాసినప్పుడు నాకు ఆ పుస్తకం ఎంత నచ్చిందో, ఎందుకు నచ్చిందో చెప్తాను. నాకు ఇలా అనిపించింది. ఇందుకే అన్నాను ఏ విమర్శ అయినా కొంతలో కొంతైనా వైయక్తికమే అని. కాత్యాయనిగారు అన్న అనుభూతి నా వ్యాసాలలో మరింత స్పష్టంగా కనిపించింది అనుకుంటాను.

కథలు, నవలల మాటకొస్తే, నేను మొదలుపెట్టిందే కథలతో. నిజానికి తెలుగు స్వతంత్రలో అర పేజీ (A5 అనుకుంటా తెలుగు స్వతంత్ర పేజీ సైజు) స్కెచ్‌తో మొదలయింది జూన్ 1954లో. నాకు అన్నిటికంటే కథలే ఆత్మీయమైన వ్యాపకం అప్పటికీ ఇప్పటికీ కూడా.

కథల్లో కూడా నాకు శైలి ప్రధానం. శైలి, తెలుగు నుడికారం, జాతీయాలూ, సామెతలూ చూసుకుంటాను. ఇవి చక్కగా ఉన్న కథలే చదువుతాను. అలాగే రాయడానికి ప్రయత్నిస్తాను. సాధారణంగా పాఠకులందరూ ఒక్కలాగే చదవరు కదా.

నేను రచయితలకీ పాఠకులకీ మధ్య గల అవినాభావ సంబంధం అన్న వ్యాసంలో పాఠకులు కథలను ఎలా చదువుతారు, ఎలా స్వీకరిస్తారన్న అంశాలు చర్చించేను. బహుశా ఆ వ్యాసాన్ని ఇప్పుడు ఈనాటి పాఠకుల పోకడల దృష్ట్యా మళ్లీ సంస్కరించాలేమో. ప్రస్తుతానికి ఇలా చెప్తాను.

కొందరు కాలక్షేపానికి చదువుతారు. ఇలా చదివేవాళ్లు ఆ కథలో ఒక పాత్రలోనో ఒక సంఘటనలోనో తమనీ తమ అనుభవాల్నీ కూడా చూసుకోవచ్చు. కొందరు ఇంకొంచెం దూరం వెళ్లి తమ సమస్యలకి పరిష్కారం కూడా వెతుక్కోవచ్చు. వీరు కథని ఇష్టసఖిలా ఆదరిస్తారు అనాలి. మరికొందరు ఆ కథని ఒక సాహిత్య ప్రక్రియగా పరిశీలించి చదువుతారు. కథ ఎత్తుగడ, సంఘటనలు, సంఘర్షణ, ముగింపు, పాత్రపోషణ, భాష వంటివి గమనిస్తారు. నా దృష్టిలో వీరు కథని ఒక కావ్యంలా ఆస్వాదించేవారు. కొందరికి సంభాషణలు నచ్చవచ్చు. కొందరిని సామెతలూ, జాతీయాలూ అకట్టుకోవచ్చు. విజయ కర్రా, రాజేశ్వరి దివాకర్ల

ప్రసంగాలలో ఈ పద్ధతి కనిపిస్తుంది. వివిధ కోణాల నుండి కథని దర్శించి, చదువుతూ ఆనందించడం కావ్యంలా ఆస్వాదించడమే. అలాగే వనజ, కల్పన భాష గురించి, విజయ వాక్యనిర్మాణం గురించి ప్రస్తావించారు. నాకు చాలా ఆనందం కలిగింది. ఎత్తుగడ, నడక, ముగింపు వంటి అన్ని కోణాలనూ సాకల్యంగా పరిశీలిస్తూ చదవడం కూడా చూస్తాం. వీరు కథనిగానీ కథకుడినిగానీ సిద్ధాంతాల చట్రాలలో ఇరికించే ప్రయత్నం చేయరు. ఏ 'సిద్ధాంతాలు, రాద్ధాంతాలూ లేకుండా,' కథని చెప్పొచ్చు అని శ్రీనిధి అనడంలో ఇది రూఢి అయింది. కథని ఒక రాజకీయ నినాదంగా కాక సాహిత్యప్రక్రియగా స్వీకరించడం అంటే ఇదే.

ఈ సభలో ప్రసంగాలలో నా సంస్కృత పదజాలం గురించిన వ్యాఖ్య విన్నాకగానీ నాకు గుర్తురాలేదు నా సంస్కృత భాషాపాటవం ఎంతగా చాటుకున్నానో. వారణాసి నాగలక్ష్మి ప్రస్తావించిన 'వప్రక్రీడాగజప్రేక్షణీయం' లాటి పదబంధాలు నేను వాడినట్టు నాకే గుర్తులేదు. ఆరోజుల్లో సంస్కృతభాష మీద అంత ఇష్టం ఉండేది. ఇప్పుడు తగ్గించేను. అలాగే ఇంగ్లీషు పదాలు కూడా అప్పట్లో వాడేను కానీ ఇప్పుడు తెలుగుపదాలు లేనప్పుడు మాత్రమే, అంటే కంప్యూటరు, ఫోనులాటివి ఇంగ్లీషు వాడుతున్నాను. అమెరికా వచ్చాక వ్యంగ్యం ఎక్కువయింది. సునీత, విజయ, నాగలక్ష్మి ఆ వాక్యాలు మళ్లీ చదివి నాకు వినిపిస్తుంటే చాలా సరదాగా అనిపించింది.

నేను కొత్తగా కథలు రాయడం మొదలుపెట్టిన కాలంలో మహాపండితులు కథలు రాసేవారు భారతి, ఆంధ్రపత్రికలలాటి పత్రికలలో. వేలూరి శివరామశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, పిలకా గణపతిశాస్త్రివంటి పండితులు తమ కథల్లో సంస్కృత పదాలు వాడేవారు. చెప్పేను కదా నేను పదాలు చూసుకుంటూ జాగ్రత్తగా చదువుతానని. ఆ పండితుల కథల్లో నాకు నచ్చిన నుడికారం, పదబంధాలు గుర్తుపెట్టుకుని వీలయితే వాడేదాన్ననుకుంటాను. అలాగే ఆధునిక కాలంలో మంచి నుడికారం వాడుకున్న రచయితలు రాచకొండ విశ్వనాథశాస్త్రి, మధురాంతకం రాజారాం వంటివారు. వారి కథలు కూడా చదువుతూ వాక్య నిర్మాణం, జాతీయాలు ప్రత్యేకించి మళ్లీ మళ్లీ చదువుకునేదాన్ని. మొదట కథ కోసం కథ చదివి, మళ్లీ రెండోసారి కథ గురించి ఆలోచించుకోడానికి చదువుతా నన్నారు వనజ తాతినేని. కొంచెం భిన్నం. నేను మొదటిసారి చదువుతున్నప్పుడే ముందుకీ వెనక్కీ వెళ్తూ, ఒకొక్క పదం, ఒకొక్క వాక్యం చదువుకుంటూ కొనసాగిస్తాను. అందుకే నాకు ఒక కథ చదవడానికి చాలాకాలం పడుతుంది.

ఇప్పుడు అలాటి కథలు ఉన్నాయేమో కానీ నాకు కనిపించలేదు. ఇప్పుడు కావాలంటే ఇండియనింగ్లీషులో ఉన్న కథలు చదివి ఇండియనింగ్లీషు నేర్చుకోవచ్చేమో. నాకు ఆసక్తి లేదు మరి.

బహుశా, నా రెండవ దశ సాహిత్యం, అమెరికా వచ్చేక రాసిన కథలలో ఉత్తమపురుషలో కథనం, సంభాషణల ద్వారా కథ నడపడం ఎక్కువయిందేమో. ఈ రెండు అంశాలతోపాటు సంద్రాలు పాత్రచిత్రణ కూడా శీలా సుభద్రాదేవి పేర్కొన్నారు. సంద్రాల్ని alter ego అంటారు సుభద్రాదేవి.

సుభద్రాదేవి మాటలను నేను ఖండించను కానీ, అధికంగా మరోమాట జోడిస్తాను. నేను ప్రత్యేకంగా సంద్రాలు పాత్ర సృష్టించడానికి కారణం– సాధారణంగా ఒకవర్గం వారిని మనం 'చదువులేనివారు', 'అజ్ఞానులు', 'మూర్ఖులు' అని వేరు పెడతాం కానీ వారిలో ఉండే లౌకికజ్ఞానం గుర్తించం. స్కూలు, కాలేజీ చదువులులేని పామర స్త్రీలకి ఉండగల వివేకాన్ని నేను గౌరవిస్తాను. ఇది సంద్రాలు లేని ఇతర కథలలో కూడా చూపించేను. పుస్తకాలు చదివి గ్రహించే లోకజ్ఞానం వేరు. చుట్టూ ఉన్న మనుషుల్నీ, వారి మాటలు, ప్రవర్తనలను చూసి గ్రహించుకునే లోకజ్ఞానం వేరు. ఈ కోవకి చెందుతుంది సంద్రాలు. బతకనేర్చిన జాణ ఒక్కమాటలో. అది పాఠకులు కూడా గుర్తించేరను కుంటాను. అందుకే రచయితగా నేనో, కథకుడో, కథలో మరోపాత్రో చెప్తే వినని పాఠకులు సంద్రాలు చెప్తే వింటారు. సంద్రాలుకి దాపరికాలు లేవు. నోట ఒకమాటా మనసులో మరోమాటా లేదు.

ఈ రెండో పాదం కథల్లో నాకు నేనై చేయని మార్పు పాఠకులు చదివే విధానం లోనూ అన్వయించుకునే విధానంలోనూ వచ్చిన మార్పుల కారణంగా కొత్తగా వచ్చినట్టు కనిపిస్తున్నాయి కొందరికి. పూర్వం నాలాటివాళ్లం రచయిత ఏమి చెప్పేరు అనుకుంటూ చదివేవాళ్లం. ఇప్పటి పాఠకులలో ఒక వర్గం రచయితకి మనం ఏమి చెప్పగలం అనుకుంటూ చదువుతున్నారు. ఇది నిజంగా పెద్ద మార్పు. దీనివల్ల మంచీ చెడూ కూడా జరిగేయి సాహితీక్షేత్రంలో. ప్రధానంగా సాహిత్యాన్ని రాజకీయం చేసేసేరు కొందరు విద్యావేత్తలు. అంతటి పండితులు కాని రచయితలూ విమర్శకులూ కూడా ఆమూసలోనే కొనసాగిస్తున్నారు ఈ ప్రక్రియని.

వాదాలు, హక్కుల కోసం పోరాటం. రాజకీయం. రాజకీయాలు సర్వకాలీనం కాదు. ఒక సమస్య పరిష్కారం కోసం ప్రారంభించిన ఉద్యమాలు ఆ సమస్య

పరిష్కారం అయిపోయేక సమసిపోతాయి. అంతేకాదు, స్త్రీవాదం మధ్యతరగతి సమస్యలకే పరిమితమయినట్టు కూడా కనిపిస్తోంది. ఎక్కువ కథలు మధ్యతరగతి స్త్రీల గురించే ఉంటున్నాయి. ఇంట్లో పనిమనుషులని (గృహసహాయకారి అనో ఏదో పేరు ఇప్పుడు, నాకు సరిగా గుర్తులేదు) హేళన చేస్తూ రాసిన కథలు చూసేను కనక ఇలా అంటున్నాను. ఇప్పుడు పనిమనిషి అనరు. మరేదో 'గౌరవనీయమైన' పేరయితే పెట్టేరు కానీ, తక్కువగా చూడడం మాత్రం మాన లేదనే అనిపించింది ఆ కథలు చూస్తే. ఇంతకీ, అసలు విషయం, సాహిత్యం వాదన కథలకి భిన్నంగా సార్వకాలీనం. సార్వజనీనం అని నా అభిప్రాయం.

జేబు కథ పరిమిళ చిన్నతనంలో స్కూల్లో పెన్సిలు దాచుకోడానికి జేబు కావాల నడంతో మొదలవుతుంది. తరవాత వాదన కోసం, 'తమ్ముడికి ఉంది కదా నాకు ఎందుకు ఉండకూడదూ,' అనడంతో ఈ కథని 'వివక్ష' కథగా గుర్తించడం జరిగింది. కేవలం పంతంకోసం, తమ్ముడికి ఉంది కనక తనకీ ఉండాలి అనుకుంటే కథ అలాగే మొదలవాలి కానీ పెన్సిలు దాచుకోడానికి అవుసరంగా కాదు. రెండోది, కేవలం జేబు కోసమే పోరాటం అయితే, జేబు వచ్చేసేక ఆ పోరాటం అయిపోయింది. ఆ తరవాత కథ పొడిగించడానికి కారణం కనిపించదు. ఆ భాగం అసంగతం అయిపోతుంది. అలాకాక, జేబు ఒక అవుసరాన్ని తీర్చడానికే అనుకుంటేనే కథ కొనసాగించడానికి ఆస్కారం ఉంది. 'పెన్సిలు దాచుకోడానికి జేబు,' అని మొదలయిన కథ ఆ, 'పెన్సిలు మనసు దాచుకోడానికి,' అనడంతో ముగుస్తుంది. మొత్తం కథని పూర్తిగా దృష్టి లోకి తీసుకుంటేనే ఇలా విశ్లేషించడం సాధ్యం. అలాగే ఉత్తమాయిల్లాలు కథ గురించి శ్రీనిధి యెల్లాల చెప్పిన వాక్యం, 'నిద్ర పోయినట్టు నటించేవాళ్లని మనం ఏమీ చేయలేం. అత్తగారు ఏమి చేసేరంటే తనకి వీలుకాని పరిస్థితిని కోడలు సాధించుకోలిగేలా తయారుచేసేరు,' అని. కొడుకుని కూడా అలాగే పెంచింది అని కూడా చెప్పుకోవచ్చు. శ్రీనిధి వాక్యాలు సరిగా జ్ఞాపకంలేవు కానీ ప్రధానంగా ఇందులో అభిప్రాయం తన భర్తని తాను మార్చలేదు, కానీ కోడలిని తనకంటె సమర్థురాలిగా తీరిచిదిద్దింది అంటున్నట్టుంది. అంటే ఇక్కడ ఆత్మగౌరవం గల ఒక స్త్రీ తరువాతి తరానికి మార్గదర్శకురాలయింది అనడంలో స్త్రీవాద ప్రసక్తి లేదు. వివక్ష, అణచివేతవంటి పడికట్టురాళ్లు లేవు. కేవలం విజ్ఞత గల స్త్రీ తానేమి చేయగలదో, ఏమి తనకి అసాధ్యమో గుర్తించి, తనకున్న పరిధిలో నిశ్శబ్దంగా తన తరవాతి తరాన్ని మలచడం చూస్తాం.

ఆ సందర్భంలో బహుళ ప్రచారం పొందిన నా కథ 'నిజానికీ ఫెమినిజానికీ మధ్య' అనేక అపోహలకీ, దురూహలకీ గురైందని అంతరికీ తెలిసిందే. ఒక మంచి ఉదాహరణ, మహా కథారచయిత్రి, నా సంకలనానికి ఆ కథ పేరు పెట్టినప్పుడు, అలా పెడతారనుకోలేదు అన్నారు. అంచేత ఈ మాట చెప్పకతప్పదు. ఆ కథని డయస్పోరా కథగా గుర్తించి, కథని కథగా విశ్లేషించిన సత్యవతి, కల్పన, సుభద్రాదేవి ప్రభృతుల వల్ల కూడా నాకూ, నా కథలకూ తగిన గుర్తింపు వచ్చిందని గట్టిగా చెప్పగలను. నిజానికి, బ్లాగులో ఆ కథ పెట్టినప్పుడు పాఠకులు తమకి తెలిసినవారి అనుభవాలతో పోల్చుకుని స్పందించేరు. కొందరు ఆ కథలో అమెరికా జీవనవిధానాన్ని మెచ్చుకున్నారు.

నిజానికి ఈ కథలోని సీత, జేబు కథలోని పరిమళలాంటి వారిని మనముందు తరాల స్త్రీలలో చూసేం. ఈనాటి పాఠకులు వాళ్ల అమ్మమ్మలూ, నాయనమ్మలని అడిగితే తెలుస్తుంది. ఆ కాలంలో అంటే ఇప్పటికి 3 తరాల ముందు, మగ వాళ్లు వంశగౌరవం, సంప్రదాయం అంటూ అడ్డు పడినప్పుడు, తల్లులే పూనుకుని వర్ణాంతర వివాహాలు జరిపించేరు.

నా రచనావిధానంలోనూ, సాహిత్యంలోనూ వచ్చిన పరిణామక్రమం వివరించ డానికి ఇంతగా చెప్పవలసి వచ్చింది.

నవల పరిధి విస్తృతం కనక అందులో కొన్ని వాదాలు చొప్పించవచ్చు. అయితే ఆ వాదాలను రాజకీయంగానా, సాహిత్యవిలువలతోనా అన్నది రచయిత మొదట నిర్ణయించుకోవాలి. రాజకీయం అయితే, దానికి తగ్గట్టు వివిధ దార్శనికుల వాక్యాలు, ముఖ్యంగా పాశ్చాత్య దార్శనికుల సువాక్కులు ఉదహరిస్తూ సుదీర్ఘమైన చర్చలు చేయవచ్చు. చేస్తున్నారు. అలాకాక, సాహిత్యవిలువలు దృష్టిలో పెట్టుకుంటే, మితంగా సాంఘికసమస్యలనూ కౌటుంబికసమస్యలనూ వివరిస్తూ దానికి తగ్గ నుడికారంతో పూర్తి చేయవచ్చు. ఈ వ్యత్యాసాన్ని ప్రస్తుత తరం పాఠకురాలు సునీతా రత్నాకరం తమప్రసంగంలో విపులంగా వివరించేరు. ఆమేరకు నేనేమీ తప్పు చేయలేదనే అనుకున్నాను.

నేను రాసినవి రెండే నవలలు, చాతకపక్షులు, మార్పు. ఇందులో చాతకపక్షులు నవలగానే మొదలుపెట్టేను. అప్పట్లో కల్పనతో సంప్రదిస్తూ పూర్తి చేసేను. APWeekly.com అన్న జాలపత్రికలో వారం వారం ప్రచురించేరు 2004లో. ఆ తరవాత దాన్ని 2, 3సార్లు సంస్కరించేను. మార్పు నవల రాయాలనుకుంటూ

ప్రారంభించినది కాదు. వారం, వారం నాకు తోచిన విషయాలు చర్చిస్తూ నాబ్లాగు, తెలుగు తూలికలో పెట్టిన పోస్టులను కొంతకాలం అయేక, వాటిని ఒక క్రమంలో పేర్చి నవలగా రూపొందించినది. అలా చేయడంలో చాలా అవక తవకలు జరిగేయి. వాటన్నిటినీ మళ్లీ మళ్లీ చూసుకుని, సరి దిద్దుకున్నాను. కనీసం మూడుసార్లు మార్చి ఉంటాను. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, నేను నవల రాయలేను. ప్రధానంగా, నవల రాయాలంటే సమాజంలో తిరుగుతూ, సమాజంలో జరుగుతున్న సంఘటనలనూ మనుషులనూ నిశితంగా పరీక్షిస్తూ సమాచారం సేకరించాలి. నేను సమాజానికీ, మనుషులకీ దూరంగా ఉంటు న్నాను కనక నాకు అది అంత తేలిక కాదు. ఈ రెండు నవలలూ కొంతవరకూ నేను సమాజానికి దూరంగా జరక్కముందు రాసినవి. ఈ నవలలమీద సునీతా రత్నాకరం ప్రసంగం విన్నతరవాత, కనీసం ఈ రెండూ ఎట్టకేలకు అర్థవంతంగానే స్థిరపడ్డాయి అనిపించింది. వీటిమీద స్త్రీవాదనవలలు అంటూ ముద్ర పడక పోవడం నా పూర్వజన్మ సుకృతం. ముఖ్యంగా మార్పు నవలలో మూడు తరాలకి ముందు స్త్రీలు తమ అస్తిత్వాలని ఎలా నిలబెట్టుకున్నారో చూపించేను. సునీతా రత్నాకరం ఈకోణం విశదీకరించేరు తనప్రసంగంలో. అంటే ఆనాటికే స్త్రీవాదం అన్న ముద్రలేమీ లేకపోయినా, ఆనాటి స్త్రీలు తమ తమ వెసులుబాటు, వ్యక్తిత్వాలు, ఆలోచనలు ఆధారంగా తమ అస్తిత్వాలను కాపాడుకున్నారు. అణకువగా మెలగుతున్నట్టు కనిపిస్తూనే తాము అనుకున్న కార్యాలు సాధించు కున్నారు.

నా సాహిత్యాన్ని సంపూర్ణంగా గ్రహించి కొన్ని అభిప్రాయాలు ఏర్పర్చుకున్న వారిలో సత్యవతిగారొకరు. ఇక్కడ నాకు స్ఫురించిన ఒక కోణం, రచయితతో వక్తకి ప్రత్యక్షపరిచయం ఉన్నప్పుడు ఆ పరిచయం ప్రభావం వారి విశ్లేషణ మీద ఉంటుందా అన్నది. సాధారణంగా కథలోగానీ నవలలోగానీ కొన్ని మాటల, సంఘటనల విశ్లేషణమీద ఈ పరిచయాల ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా రాజకీయ కథలు, నవలలో ఇది ఎక్కువగా కనిపించవచ్చు. ఇది నా ఊహ మాత్రమే. ఖచ్చితంగా చూపడానికి నాకు దాఖలాలేమీ లేవు.

తూలిక.నెట్ వెబ్‌సైట్ గురించీ, అనువాదాల గురించీ చెప్పాలంటే చాలా ఉంది. తూలిక.నెట్ సైటు గురించి వి.బి. సౌమ్య చెప్పిన విషయాలు గమనార్హం. తెలుగువాళ్లు ఆ సైటుకి మద్దతు ఇచ్చి వుంటే, మరింత ప్రతిభావంతంగా నడపడం సాధ్యమయి ఉండేది. కానీ పైన చెప్పిన స్త్రీవాదంలాగే, ఈనాటి

సంఘాలూ, సంఘనిర్వాహకులూ, విమర్శకులూ సాహిత్యాన్ని సాంఘిక ప్రయోజనం పేరుతో సంపూర్ణంగా రాజకీయం చేసేయడంతో, సంస్కృతీ సంప్రదాయాలను ఆవిష్కరించే కథలు వాళ్ల మాటల్లోనే చెప్పాలంటే, 'వివక్షకి గురయేయి.' ఈ సమస్య ఎలా పరిష్కారమవుతుందో, కథని ఒక సాహిత్య ప్రక్రియగా చదివి ఆనందించే రోజు ఎప్పుడు ఎలా వస్తుందో నాకు తెలీదు.

తూలిక.నెట్ సైటుని మనవాళ్లు ఆదరించకపోవడానికి ఒక కారణం వాళ్లకి నా ధ్యేయం అర్థం కాకపోవడం. వాళ్ల దృష్టిలో గొప్ప కథలు, వాళ్లు బహుమతు లిచ్చిన కథలు అనువాదం చేస్తే, గంపలకొద్దీ మెప్పులు గుమ్మరించేవారేమో. నాకు ఓ శాలువా కూడా కప్పేవారేమో. కానీ నా ధ్యేయం అదికాదు.

తూలిక సైటు నాతో ముగియకుండా భావితరాలకు కూడా ఆసరా కావాలి, భావితరాలు ఆ సైటు ధ్యేయాన్ని నిలబెట్టాలి అన్న నా కోరికను కల్యాణీ నీలారంభం మరొకసారి వాచ్యం చేయడం ముదావహం. నా కోరిక కూడా అదే.

అనువాదాల మీద మరో వ్యాఖ్య– తెలుగుభాష సొగసు అనువాదాల్లో రాదని. అనువాదాలు తెలుగు చదవడం రానివారికోసమే అని వారికి అర్థం కాదను కుంటాను. చెప్పినా వినకపోవడం మన దురదృష్టం. కొందరికి ఇండియ నింగ్లిషులో రాసిన కథలు నచ్చుతున్నాయి. వాటికి బహుమతులు కూడా వస్తున్నాయి. ఈ విషయం నేను కల్పనతో చేసిన ఇంటర్వ్యూలో విపులంగా చర్చించేను. లింక్, https://tethulika.wordpress.com/2013/05/08/3811/

తెలుగు సాహితీప్రపంచంలో మహాకవయిత్రి మొల్లకి గల స్థానం, పాండితీప్రతిభ నాకు లేవు కానీ ఆ భావం కనీసం అలా తలుచుకోడం ఆనందం. మొల్ల శ్రీకంఠ మల్లీశుని ఆలయం మండపంలో కూర్చుని రాసిందిట రామాయణం. నేను నా ఇంట్లో కూర్చుని రాసుకుంటున్నాను. నెట్‌వర్కింగ్ లేదు. మొల్ల జానుతెనుగులో రాస్తాను అని ప్రారంభించినా, కఠినమైన సంస్కృత సమాసాలు, అలంకార విశేషాలు చాలానే ఉపయోగించింది. నేను తొలిదశ కథల్లో సంస్కృతం, ఇంగ్లీషు పదాలు వాడేను. అమెరికా వచ్చేక నాకు తెలుగుభాష పట్ల శ్రద్ధ హెచ్చింది. ఇప్పుడు సరైన తెలుగు పదాలు లేకపోతేనే ఇంగ్లీషు పదాలు వాడుతున్నాను.

మొల్ల సత్కారసభలో మునిపల్లె రాజుగారి కథాసంకలనానికి నా అనువాదం ప్రచురణ విషయంలో జరిగిన అవకతవకల గురించి ప్రస్తావించేను. అది ఇప్పుడు ప్రచురణ అయింది. ఇది నా సాహితీప్రస్థానంలో ఒక ముఖ్యమైన ఘట్టమే. మునిపల్లె రాజుగారు ఉండగా రావలసింది అని అనుకోకుండా ఉండలేను.

అలాగే కల్పనా రెంటాల నాకు ప్రత్యక్షంగా పరిచయమే కాక సన్నిహితం అని కూడా చెప్పుకుంటాను. 2004లో పరిచయమయింది. నేను మాడిసన్‌లో ఉన్నంతకాలం తరుచు కలుసుకునేవాళ్లం. నేను డాలస్‌కి మారియేక, వాళ్లు టెక్సస్‌కి మారడంతో మళ్లీ 2, 3సార్లు కలుసుకునే అవకాశం కూడా వచ్చింది. ఇద్దరం ఆడియోలు, విడియోలు చేసేం, సాహిత్యంలో కొన్న అంశాల మీద.

ఈ సభ తలపెట్టడం ఒక ఎత్తయితే, ఆ పురస్కారం మొల్లపేరు మీదుగా ఇవ్వడం మరొక ఎత్తు. మొల్ల పేరుతో ఈ పురస్కారం ఎందుకంటే అన్న వ్యాసంలో కల్పన తన ఆలోచనను పంచుకుంది.

ఈ మొల్ల పురస్కారం తలపెట్టి, ఒక్కచేత్తో సభని నిర్వహించడం నాకు ప్రత్యేక గౌరవం. ఆనందదాయకం. అది కూడా ఏదో సభ పెట్టేం అంటే పెట్టేం, అంటూ మూసవాక్యాలతోనూ, ఫొటోలతోనూ అట్టహాసంగా ముగించడం కాక, నేను సృష్టించిన సాహిత్యంలో వివిధ అంశాలు స్పృశిస్తూ పరిశీలనాత్మకంగా ప్రసంగించే ఏర్పాటుచేయడం నా జీవితంలో ఇదొక్కటే. అందుకు కల్పనని తప్పకుండా అభినందించాలి. ఇంతకుముందు ఆమె రచనలు మాత్రమే తెలుసు. ఇప్పుడు నిర్వహణాదక్షత కూడా తెలిసింది.

ఈ ఆదానప్రదానాల విషయంలోనే మరొకమాట కూడా చేరుస్తాను. ఈ సభలో పాల్గొన్న వక్తల గురించి. ఒక్క సత్యవతిగారిని తప్పిస్తే, మిగతా ఎవరి కథలూ అనువాదం చేయలేదు. వాళ్ల పుస్తకాలు సమీక్షించడమో అలాటిదో కూడా చేయలేదు. అంటే వీరందరూ కేవలం సాహిత్యాభిమానంతోనే ప్రసంగాలు చేసేరు. అదీ నాకు గర్వకారణం. అందుచేత కూడా ఈ సభని నేను ఒక ప్రత్యేక గౌరవంగా నిజమైన ఘనసత్కారంగా భావిస్తున్నాను.

శుభం.

ఆగస్ట్ 12, 2023





తెలుగు వాక్యానికి వన్నె తెచ్చిన నిడదవోలు మాలతి

పి. సత్యవతి

పందొమ్మిది వందల యాభైల్లో కథలు వ్రాయడం మొదలుపెట్టి ఇప్పుడు తన స్వంత వెబ్ పత్రికలు తెలుగు, ఇంగ్లిష్ తూలికలు నిర్వహిస్తూ, దాదాపు వంద తెలుగు కథల్ని ఇంగ్లిష్‌లోకి అనువదించి, ఇంగ్లిష్‌లో మూడు అనువాద కథాసంకలనాలు. The Spectrum of My People (జైకో బుక్స్), From My Front Porch (సాహిత్య అకాడెమీ ప్రచురణ), All I wanted to Read and other stories వెలువరించారు. మొదటి రెండూ ప్రసిద్ధ రచయితల తెలుగు కథలకు ఆమె చేసిన ఇంగ్లిష్ అనువాదాలు కాగా మూడవది తన తెలుగు కథలకు ఆమె ఇంగ్లిష్ అనువాదం. ఇవికాక Quiet and Quaint: Telugu Women's Writing: 1950-1975 అనే పుస్తకాన్ని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ప్రచురించింది. ఇది రెండున్నర దశాబ్దాలపాటు మన రచయిత్రులు సాధించిన ఘనవిజయానికి వెనకగల సాంఘిక, కౌటుంబిక పరిస్థితులూ, వారి రచనల్లో కథావస్తువులూ, శిల్పం పరిశీలిస్తూ రాసిన పుస్తకం. తెలుగులో 'నిజానికీ ఫెమినిజానికీ మధ్య' అనే కథాసంకలనం 44 కథలతో 2005లో వచ్చింది. మరో సంకలనం 22 కథలతో 'కథల అత్తయ్యగారు', 'చాతక పక్షులు' అనే నవల. ఆంధ్రా యూనివర్సిటినించీ ఇంగ్లిష్ ఆనర్స్, లైబ్రరీ సైన్స్ చదివి ఢిల్లీలో లైబ్రరీ సైన్స్‌లో యెమ్.యే. చేశారు. తొమ్మిది సంవత్సరాలు తిరుపతి

యూనివర్సిటీలో అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా పనిచేశారు. 1973నించి అమెరికాలో వుంటున్నారు. ఆమె కథల్లో ఎక్కువ కనిపించే విశాఖపట్నం ఆమెది. చిన్నప్పుడు అమ్మ వెనుక తిరుగుతూ కమ్మని తెలుగుని సామెతలతో సహా నేర్చుకున్నారు. అందుకే ఆమె కథలన్నిటికీ చక్కని తెలుగు శీర్షికలుంటాయి. నిడదవోలు మాలతిగారిని గురించిన స్థూల పరిచయం ఇది.

కథలు వ్రాయడం చిన్న వయసులోనే, 1950 దశకానికి ముందే మొదలు పెట్టినా ఎదుగుతున్నకొద్దీ కొంత పునాది వేసుకుని రచనలకు మెరుగులు దిద్దుకున్న తరం అది. కొంత తెలుగు సాహిత్యాధ్యయనం, భాషాజ్ఞానం, సామాజిక పరిశీలన ఆ పునాది... సాహిత్యాభిరుచి కల కుటుంబంలో జన్మించి, ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని బాగా చదువుకుని సంస్కృతం కూడా నేర్చుకుని, ఇంగ్లిష్‌లో మాస్టర్స్ చేసి, మానవ స్వభావాన్ని నిష్పాక్షికంగా పరిశీలించి సహానుభూతితో వారిని గురించి వ్రాసారు నిడదవోలు మాలతి. అప్పటినించి ఆమె రచన ప్రవాహశీలంగా సాగుతూనే వుంది. కొంతమంది రచయితల వలె ఏదో ఒక మలుపు దగ్గర నిలిచి అదే స్థిర భావంతో కాక సమకాలీనంగా ప్రవహిస్తోందనడానికి ఆమె నిర్వహిస్తున్న బ్లాగ్‌లే దర్పణాలు. ఒక వ్యక్తి స్వభావం గురించి చెప్పినా ఒక సంఘటన ప్రభావం గురించి చెప్పినా రచయితగా ఒక పాత్ర తరఫున వకాల్తా పుచ్చుకుని ఓవర్ టోన్స్‌లోకి వెళ్లకుండా తన పాత్రలన్నిటి పైనా సానుభూతితో వ్రాస్తారు. ఆమె రచనల్లో స్త్రీ పాత్రలు ఎక్కువగానే వుంటాయి. అయితే వాళ్ల బాధల్ని, వాళ్లపై హింసని మాత్రమే పట్టించుకుని వారి జీవితాల్లోని ఇతర పార్శ్వాలను వదిలిపెట్టరు. జీవితాన్ని అన్ని రంగుల్లోనూ అన్ని కోణాల్లోనూ ఒకింత సమతూకంతో పరిశీలిస్తారు. 'హింస మగవాళ్లు ఆడవాళ్లని హింసించడంతో ఆగిపోలేదు. నా అభిప్రాయంలో హింసకి మూలం బలం. అర్థబలం కావచ్చు, అంగబలం కావచ్చు. మనిషికి ఆ బలం నిరూపించుకోవాలన్న కోరిక కలిగించేదే అహంకారం. ప్రతి ఒక్కరూ ఎదుటివారి మీద తమ ఆధిక్యం చూపించుకోడానికి బలం ప్రదర్శిస్తారు. అందుకని ముందు రావల్సింది వైయక్తిక విలువలలో, సామాజిక విలువలలో మార్పు. ఎదుటివారిని గౌరవించడం నేర్చుకున్న వారు ఏ జండరు వారినైనా గౌరవిస్తారు. అందుకే నా కథల్లో బాధల్ని అనుభవించిన స్త్రీలున్నారు కానీ, కేవలం అదే అన్ని కథలకీ ప్రాతిపదిక కాదు. అనేక వస్తువులలో అదొక వస్తువు,' అంటారు. (పొద్దు.నెట్ లో ఇంటర్వ్యూ నుంచి.)

మాలతిగారు 1973లోనే అమెరికా వెళ్లిపోవడంవల్ల ఆమెకు ఆ దేశంలో భారతీయుల జీవితాన్ని గురించి విశేషమైన అనుభవంతో కూడిన అవగాహన వుంది.

ఇప్పుడు మనకి లభ్యమౌతున్న ఆమె వ్రాసిన 66 కథలనీ రెండు వర్గాలుగా విడగొడితే కొన్ని భారతదేశపు కథలు, కొన్ని డయాస్పోరా కథలు. డయస్పోరా కథలలో ఈ ముప్ఫై సంవత్సరాలుగా ప్రవాస భారతీయుల జీవితంలో వచ్చిన మార్పులు స్పష్టమైనట్లు భారతదేశపు కథల్లో భారతదేశంలో వచ్చిన మార్పులు అంతగా ద్యోతక మవవు.కారణం మార్పు వేగం అధికమైన ఈ రెండు మూడు దశాబ్దాలలో ఆమె ఇక్కడ లేకపోవడం కావచ్చు. ఒక్కొక్కప్పుడు మనిషి స్వభావం, ఆయా సంఘటనల పట్ల వాళ్లు స్పందించే తీరు, దేశకాలాలకతీతంగా వుంటాయి. మానవ సంవేదనలు, ఆవేదనలు, ఆరాటాలు, వాళ్లు చేసే పోరాటాలు ఒక కాలానికి ఒక దేశానికే పరిమిత మైనవి కావు. ఆయా సంస్కృతులలో మనకి కనిపించే వైరుధ్యాలు ఉపరితలానివే కాని హృదంతరాలలో మానవులంతా ప్రేమించేది మానవత్వాన్ని, సౌహార్ద్రతనే. దీనికి కొంతమంది మినహింపుగా ఎప్పుడూ వుంటారనుకోండి. ఈ ఎరుక మాలతిగారి కథల్లో ఎక్కువగా కనిపిస్తుంది.

మాలతిగారు కథలు వ్రాయడం ప్రారంభించిన రోజుల్లో (1950 దశకంలో) జనజీవితంలో ఇంత వేగం లేదు. ఇంత స్వకేంద్రీయత (self centeredness) కూడా లేదు. సమయ నిర్వహణ పాఠాల ప్రభావమూ లేదు. పొరుగువారికి మన సమయాన్ని ఆనందంగా పంచడం వాళ్ల ఆనందాన్ని పంచుకోడం వుండేది. ఇందుకు 'కథల అత్తయ్యగారు' అనే కథే ఒక ఉదాహరణ. ఇప్పటి ఆంటీల కన్న అప్పటి అత్తయ్యగార్ల అమాయక ప్రేమలు ఎంతో ఉదాత్తమైనవి. ఆమె ఒక కథల ఖజానా. ఆ కథలు అభూతకల్పనలే అయినా అవి చమత్కారంతో కలిసిన అచ్చ తెలుగు నుడికారంతో వుండేవి. ఒక తల్లి చేసిన మోసాన్ని కూతురు తెలుసుకుంది. ఆ విషయం తల్లికి అర్థం చేయించడానికి తన బొమ్మకి బువ్వ పెడుతుంది. బొమ్మ తినదుకదా? అప్పుడా తల్లి, 'చిలకల కొలికి చినదానా బొమ్మలు బువ్వలు తిందురటే,' అంటుంది. ఆ పిల్ల తల్లితో ఇలా అంటుంది, 'మాయలదానా! మహిమలదానా మనుషులు కప్పలు కందురటే!' తల్లి తను చేసిన మోసానికి సిగ్గుపడి దాన్ని సరిదిద్దుకుంటుంది. ఇలా కథల అత్తయ్యగారి కథల ప్రభావం మాలతిగారి మీద వుంది. మాలతిగారి 66 కథల్నీ మనం ఇక్కడ స్థల పరిమితి వలన చెప్పుకోలేము కనుక ఈ దేశపు కథలు కొన్నిటిని ఆ దేశపు కథలు కొన్నిటినీ స్పృశిద్దాము. రచయిత్రి చెప్పినట్లు ఆమె సృష్టించిన స్త్రీల పాత్రలు కొన్నిటిలో 'మంచుదెబ్బ' కథలో వకుళ, 'నవ్వరాదు' కథలో కమలిని, 'జీవాతువు' కథలో అరుంధతి, 'అవేద్యాలు' కథలో శారద...

నవ్వరాదు కథలో కమలిని తన కష్టాలను నవ్వుల మాటున హాస్యం మాటున దాస్తుంది, వకుళ మహామౌనం దాలుస్తుంది. అరుంధతి జీవితంతో పోరాడి ఓడిపోతూ

వుంటుంది. శారద తను అవమానానికి గురైనా చివరికి ఆత్మాభిమానానికి, ఔన్నత్యానికి సజ్జనత్వానికి ప్రతిరూపంలా నిలుస్తుంది. నడుస్తున్న చరిత్రలో కల్యాణికి సంగీతం, నృత్యం అంటే ప్రాణం. కానీ పెళ్లికోసం అవి ఆమెకు దూరమయ్యాయి. భర్తకి సంగీతకచేరీలకు వెళ్లడం ఇష్టం అని కొంత ఊరట. అయినా ఆమె ఆకాశ వాణిలో స్వరపరీక్షకి వెడతానంటే వీల్లేదనడంతో సంగీత కచేరీలకు వెళ్లడం మాను కుంటుంది. ఆమె మనసుని అర్థం చేసుకోలేని భర్త ఆ విషయం పట్టించుకోడు. చివరికి తన మనుమరాలు తను సాధించలేనివన్నీ సాధిస్తుందన్న ఆశతో తన నిరాశకు తెర దించుతుంది. మంచుదెబ్బ కథలో వకుళ భర్త నపుంసకుడు. ఆ విషయం మనకి చివరిదాకా తెలియదు. దాన్ని గరళంలా కంఠంలో దాచుకుని మౌనమే తన తిరస్కారంగా, నిరసనగా చేసుకుంటుంది. ఆమె మౌనానికి కారణం భర్తకు తెలిసినా అతను హిపోక్రైట్ కదా! ఆమెకు మానసిక వైద్యం చేయిస్తాడు. చివరికి ఆమె తల్లి అమెను తీసుకుపోతానంటే తనే కలకత్తా తీసుకువెళ్లి నయం చేయిస్తానంటాడు. ఆమె చనిపోతుంది. భర్త నపుంసకుడన్న నిజాన్ని ఒక్క స్నేహితురాలికి మాత్రమే చెప్పి తన ధిక్కారాన్ని మౌనం ద్వారా, మరణం ద్వారా ప్రదర్శిస్తుంది. ఈ కథ స్నేహితురాలి కథనంగా సాగి చివరివరకూ వకుళ మౌనానికి కారణం ఒక ప్రశ్నగానే వుంటుంది. అట్లా స్నేహితురాలిని నెరేటర్‌గా ఎంచుకోడం కథకి బిగువునిచ్చింది. మాలతిగారి కథల్లో చాలా వాటికి ఇటువంటి శిల్పాన్నే ఎన్నుకున్నారు.

'ఫలరసాదులు కురియవే పాదపములు' అనే కథలో ఒక మహాశ్వేత గురించి చెప్పినా, 'మామూలు మనిషి' అనే కథలో రాజేశ్వరి గురించైనా, 'జీవాతువు' కథలో అరుంధతి గురించైనా ప్రథమ పురుష అనుభవాలనించే ముఖ్యపాత్ర జీవితం మనకి తెలుస్తుంది. 'నవ్వరాదు' కథలో కమలిని కూడా అంతే. 'తృష్ణ' కథలో బాలయ్య గురించి కూడా. సాధారణంగా ఉత్తమ పురుషలో కథ చెబుతుంటే 'నేను'కి చాలా మంది రచయితలు కొన్ని ఉత్కృష్టమైన గుణాలని అంటగడతారు. కానీ మాలతి గారు ఈ 'నేను'ని కూడా ఒక సామాన్య వ్యక్తిగానే వుంచుతారు. అదే ఆమె ప్రత్యేకత. 'తృష్ణ' కథ ఒక లైబ్రేరియన్ చెప్పడంగా వుంటుంది. లైబ్రరీలో అటెండర్ బాలయ్య. అతన్ని గురించి లైబ్రేయన్‌గారికి చాలామంది ప్రతికూల వ్యాఖ్యలు, హెచ్చరికలు చేస్తారు. ఆమె తన విధి తను చేసుకుపోతూ వుంటుంది కానీ అతిగా స్పందించదు. బాలయ్యమీద పుస్తకాల దొంగతనం అభియోగింపబడి అతని ఇంటిని సోదా చేసే వరకూ వెడుతుంది. ఆ సోదాలో అతనికి పుస్తకాలు చదవాలనే అభిలాష, అభిరుచి, ఊర్కే చదవడమేకాక వాటిలోని కొన్ని పంక్తుల్ని వ్రాసిపెట్టుకోడం కూడా లైబ్రేరియన్‌ని చకితురాలిని చేస్తుంది. బాలయ్య నిజానికి పుస్తకాలు ఏవీ ఎత్తుకు

పోలేదు. పోయిన పుస్తకాల్లో ఒకటే అతని ఇంట్లో వుంది. అదికూడా చదివి ఇచ్చేసే ఉద్దేశంతోనే తెచ్చాడు. ఉద్యోగం పోయాక బాలయ్య కనిపించలేదు. చివరికి మూర్ మార్కెట్‌లో సెకండ్ హాండ్ పుస్తకాల షాపు నిర్వహిస్తూ కనపడ్డాడు. అనేక పుస్తకాల మధ్య ఉన్న బాలయ్యకిప్పుడు పుస్తకం ఒక అమ్మకపు సరుకులా మారిపోవడం ఒక ఐరనీ. ఈ కథని మాలతిగారు వ్రాసిన తీరు చాలా సహజంగా వుంటుంది. అట్లాగే 'విషప్పురుగు' అనే కథలో స్కూల్ అటెండర్ రోశయ్య. అతనికి పాములు పట్టడంలో నేర్పుంది. అతను ఎక్కడ పాము కనిపించిందన్నా వెంటనే వెళ్లిపోయి వాళ్లకి సాయపడతాడు. ఆవిధంగా అతను స్కూల్‌కి ఆలస్యంగా రావడం, విధి నిర్వహణలో అలక్ష్యం కారణంగా మెమోలు అందుకోడమేకాక అతని పై స్కూల్లో అంతా నేరాలు చెబుతూ వుంటారు. స్కూల్‌కి వచ్చిన ఒక రిజిస్టర్డ్ పార్సెల్ పారేశాడనే అభియోగంతో అతనికి బదిలీ వేటు పడినా ఆనందంగానే వెళ్లిపోతాడు. కానీ అతనిపై నేరం మోపడానికి మరొకరెవరో ఆ పార్సెల్‌ని సైన్స్ లాబ్‌లో పారేస్తారు. రోశయ్య వ్యక్తిత్వాన్ని ప్రధానోపాధ్యాయురాలైన 'నేను' ద్వారా చెప్పిస్తారు.

మాలతిగారికి బహుమతి వచ్చిన కథ 'చిరుచక్రం.' సర్వసాక్షి దృక్కోణంలో వచ్చింది. ఇందులో కూడా స్కూల్ ప్యూన్ వెంకన్న వ్యక్తిత్వచిత్రణే ప్రధానం. అతనికి తను చేసే పనిమీద ప్రేమ. ఒక రకమైన భక్తి కూడా. అల్పసంతోషి. తనదికాని తోట మాలి పని కూడా నెత్తిన వేసుకుని తను పండించిన, పూయించిన ఫలపుష్పాలను ఎవరైనా మెచ్చుకుంటే పరవశించిపోతాడు. స్కూల్ ఇన్‌స్పెక్షన్ రోజున ఉరుకులు పరుగులుగా వొళ్లు విరుచుకుని పనిచేసి అందుకు ప్రతిగా అతనికి అయిదు రూపాయిల ఫైన్ పడినా ఆరోజు తన పువ్వుల్నీ కూరగాయల్నీ ఎవరెంత మెచ్చుకున్నదీ భార్యతో చెప్పి పొంగిపోతాడు. ఫైన్ మాట చెప్పడు. ఈ కథని 'ఎక్స్‌ప్లాయిటేషన్' కోణంలోనించి ఓవర్ టోన్స్‌లో రాయచ్చు. కానీ రచయిత ఆ విషయం ఎక్కడా ఎత్తకుండా చివరికి ఆ మాట పాఠకులకు తట్టేలా చేస్తారు. ఒక అమాయకుని స్వభావాన్ని మాత్రమే చెబుతారు. అది ఆమె శిల్ప నైపుణ్యం. మాలతిగారి కథల్లో ఎక్కువ స్వభావచిత్రణ వుంటుంది. 'మామే స్త్రీత్వం' అనేది ప్రతీకాత్మక కథ. స్త్రీ చైతన్యానికీ రాగద్వేషాలకూ ప్రతీక. చైతన్యమూ రాగమూ ఎక్కడుంటాయో ద్వేషమూ అసూయా కూడా అక్కడికి వచ్చి చేరాతాయని అంచేత నాకీ స్త్రీత్వం (రాగద్వేషాలు) వద్దు అని. ఈ కథలో రాగద్వేషాతీతమైన ఒక వూరికి ఒక స్త్రీ వస్తుంది. ఒక పిల్లవాణ్ని చేరదీస్తుంది. ఆమె మనుమడు వస్తాడు. అతన్ని ఆమె ప్రేమగా చూడ్డం చేరదీసిన పిల్లవాడికి ఈర్ష్య కలిగించి అతన్ని కొట్టించి చివరికి క్షమాపణ అడుగుతాడు.

మాలతిగారి (కథల అత్తయ్యగారు) ఉన్న ఇరవై రెండు కథల్లో చాలావరకూ డయస్పోరా కథలు కాగా మొదటి సంకలనంలో కూడా దాదాపు 14 కథలున్నాయి. ఆమె కథాసంకలనానికి శీర్షికైన 'నిజానికీ ఫెమినిజానికీ మధ్య' అనే కథతో కూడ... ఈ కథలన్నింటిలో అమెరికా వెళ్లిన ఆంధ్రుల అనుభవాలు అప్పటివీ ఇటీవలివీ కూడా వున్నాయి. అమెరికాలో ఎలా మెసులుకోవాలో పదిమందీ పది సలహాలూ హితవులూ చెబుతారే కానీ ఏ వొక్కరూ మంచులో జారిపడతావు జాగ్రత్త అని పనికొచ్చే ఆ ఒక్క ముక్కా చెప్పరెందుకో అనే కథలో చమత్కారం బావుంటుంది. అక్కడికి వెళ్లాక కొంతమంది ప్రతిదాన్నీ డబ్బుతో కొలవడం తమకెలా లాభం అని చూడ్డం 'కొనే మనుషులు', 'డాలరుకో గుప్పెడు రూకలు', 'గుడ్డిగవ్వ' కథల్లోనూ తమకెవరైనా ఏదైనా ఇచ్చినప్పుడు వెంటనే ఆ ఋణం తీర్చే అమెరికనుల పద్ధతి 'జమాఖర్చుల పట్టిక'లోనూ చెబుతూ మన సంస్కృతిలో ఏదైనా ఎవరికైనా ఒక బహుమతి ఇవ్వడమూ పుచ్చుకోడమూ కూడా ఇటువంటి బేరీజులకతీతంగా ఒక ఆత్మీయస్పర్శతో వుంటాయంటారు. అమెరికా వెళ్లినా మన 'sense of rumour' (sense of humour కాదు) అట్లాగే వుంటుందనీ ఆత్మీయంగా ఎవరితోనైనా అంత రంగంలో మాట చెబితే అది ఇండియాలో నీలాటిరేవులో పాకిపోయినంత త్వరగా పసిఫిక్, అట్లాంటిక్ రేవుల్లో కూడా పాకుతుందనీ ఆ కందిరీగల్ని ఎలా తప్పించు కోవాలో చెప్పే 'అడవి దారంట.' అట్లా పెళ్లికో పేరంటానికో పార్టీకో ఒంటరిగా వచ్చిన స్త్రీని అక్కడ కూడా 'మీరెవరి తాలూకూ?' అని ఆరాలు తీయడం, అమెరికాలో డ్రైవింగ్ రాకపోతే వుండే కష్టాలు అక్కడుండే వాళ్లకే కాదు చుట్టం చూపుగా వెళ్లొచ్చే వాళ్లకి కూడా తెలుస్తాయి. అలాంటప్పుడు కారుండి డ్రైవ్ చేసే వాళ్లు అది లేని వాళ్లకి లిఫ్ట్ ఇవ్వడం, సాయం చెయ్యడం మామూలే. కానీ అదికూడా ఓర్వలేనివాళు చేసే వ్యాఖ్యానాలు ఇద్దరు స్నేహితురాళ్లనూ బాధపెడతాయి. కానీ ఆపత్సమయంలో మళ్లీ ఒకరికొకరు దగ్గరైపోతారు 'అత్యంత సన్నిహితులు' కథలో.

అమెరికాలో పై చదువులకి రావడానికి ఇండియాలోనే రిహార్సల్ వేసుకు నొచ్చి, అత్యుత్సాహంతో యాక్సిడెంట్ పాలైన ఒక ధనిక తండ్రి గారాల కొడుకు, ఒక కొడుకుని సరిగా తీర్చిదిద్దలేక దేశాల పాల్చేసి, రెండో కొడుక్కి అతిగారం పెట్టి ఆకాశమార్గన నడిపించిన తండ్రి- 'పై చదువులు' కథలోనూ, అంత గొప్ప ప్రజా స్వామిక దేశంలోనూ ఇంకా కొనసాగుతున్న వర్ణవివక్ష 'రంగుతోలు' కథలోనూ, అక్కడి 'లే ఆఫ్'ల ప్రభావం పైన 'హాలికులైననేమి', 'నీకోసం' కథల్లోనూ, మన సంస్కృతి లోని భక్తిభావన ఒక చిన్నిపాప మనసుని స్పర్శించడం 'చివురు కొమ్మైన చేవ' కథలోనూ, కొత్తగా వచ్చిన ప్రవాసులపై స్థానికులు కొంత జులుం ప్రదర్శించడానికి

ప్రయత్నిస్తే ఎలా తిప్పికొట్టాలో నేర్చుకున్న అమ్మాయి కథ 'పలుకు వజ్రపుతునక' కథలోనూ చూస్తాము. 'నీకోసం' కథలో ఉద్యోగం పోయి మరొకటి వెతుక్కోకపోవడం కూడా భార్య కోసమేననే భర్తకి ఒక హెచ్చరిక చేసిన భార్య, 'ఇంక నిజానికీ ఫెమినిజానికీ' అనే కథకు కొంత నేపథ్యం 'దేవీపూజ' అనే కథలో వుంది. వివాహపు పదహారో వార్షికోత్సవం ఒక మొక్కుబడి తంతుగా సాగుతుంది సీతకీ ఆమె భర్త సీతాపతికీ. అతనికెంతసేపూ ఆర్త స్త్రీరక్షణ పరాయణత. అది ఎక్కడికి దారి తీస్తుందో నన్న కలత సీతది. నిజానికీ ఫెమినిజానికీ మధ్య కథ దీనికి కొనసాగింపులా అనిపిస్తుంది. పదిహేడేళ్లుగా ఇంటికోసం చాకిరీ చేసి, ఉద్యోగం చేసి అతన్ని తప్ప వేరొకర్ని మదిని తలవక ఉన్న భార్యతో అబద్ధాలాడి ఇతర స్త్రీలతో సంబంధాలు పెట్టుకుని సీతాపతి ఆమెకు షాక్ ఇచ్చాడు. కళ్లెదుట కనిపిస్తున్న నిజాలను అబద్ధాలుగా నమ్మింపజూశాడు. అతని విలువల పతనాన్ని ఆమె ఆమోదించలేక పోయింది. అతని స్త్రీలలో ఒక స్త్రీగా వుండలేక వేరే అపార్ట్‌మెంట్‌కి మారడానికి ఆయత్తమైంది. ఈ కథని మాలతిగారు ఒక్కొక్క మెట్టుగా చాలా సహజంగా మలుచు కుంటూ వచ్చారు. అతని ఉత్తరాలు చూసేదాకా అతనిమీద అనుమానాన్ని స్థిరపరుచుకోలేకపోవడం, కొంత ఆలోచన, చివరికి నిర్ణయం. పదిహేడు సంవత్సరాల సహజీవనం ఇంటికి తనెంతగా అంకితమైందీ, ఇవ్వన్నీ ఆమె ఆత్మాభిమానాన్ని కాపాడుకునేలా ఒక నిర్ణయానికి వచ్చేలా చేసిన తీరు చాలా సమతూకంతో వ్రాశారు. అట్లాగే 'ఆనందోబ్రహ్మ' అనే కథలో బ్రహ్మ కూడా ఆర్త స్త్రీ పరాయణుడే. మాలతిగారి కథలు కొంత సీరియస్‌గా వున్నా ఆమెలో హాస్యమూ వ్యంగ్యమూ కూడా మిక్కిలిగా వున్నాయి. 'కోపం' అనే డయాస్పోరా ఇండియా కలగ లిసిన కథ. 'మద్రాస్ టూ తిరుపతి' అనే కథ, 'కాఫీ రంగూ రుచీ' అనే కథ, మరికొన్ని డయస్పోరా కథల్లోనేకాక ఆమె బ్లాగ్ తెలుగు తూలిక (www.tethulika.wordpress.com)లో 'ఊసుపోక'లో ముఖ్యంగా ఈ హాస్య, వ్యంగ్యధోరణి చూడవచ్చు.

మాలతిగారు ఆనాటి రచయిత్రి కారు. ఆవిడ ఎప్పటి రచయిత్రి. ప్రస్తుతం విస్కాన్సిన్‌లో వుంటున్న మాలతిగారు సాహిత్యమే స్వదేశాన్ని మరిపించే స్నేహ సాధనం అంటారు. 'నాకు జీవితంలోనూ. సాహిత్యంలోనూ ఒకటే విలువలు. చిత్తశు ద్ధీ ఆత్మవివేచనా, ఉన్నదానితోనే తృప్తిపడటం నాకు చిన్నప్పటి నుంచీ ముఖ్యమైన విలువలుగా వుంటూ వచ్చాయి,' అనే మాలతిగారు ఎంత గొప్ప రచయితపైనయినా తన అభిప్రాయాన్ని నిస్సంకోచంగా చెప్తారు. 'ఈనాటికీ అప్పారావుగారి దిద్దుబాటు గొప్ప సాంఘిక కథ అంటే నాకు ఆశ్చర్యంగా వుంటుంది. నేను చూసినంతవరకూ, వేశ్యాలోలత్వం, జూదంవంటి దురలవాట్లు చాలా బలమైనవి. క్షణాలమీద మార్చుకో

గల అలవాటు కాదు అది. అప్పారావుగారి కథలో భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని తెలియగానే ఆ భర్త నిల్చున్న పళాన మారిపోయాడంటారు రచయిత. నాకు తెలిసి నంతవరకూ నిజజీవితంలో భార్య పుట్టింటికి పోతే, వేశ్యాలోలురకి మరింత ఆట విడుపు. అదే కథ స్త్రీ రాసి వుంటే ఇంత అమాయకంగా వుండదు.' అంటారు.

అట్లాగే ఫెమినిజం పైన, అన్ని ఇజాల చట్రాలలో వచ్చే కథలపైన తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా సూటిగా చెప్తారు. 'అసలు బాధ ఏమిటంటే, మనకి వ్యక్తిపూజలే కానీ వస్తునిష్ఠ లేదు. రచయిత పేరుని బట్టి, అది అచ్చయిన పత్రిక పేరునిబట్టీ రచన విలువ నిర్ణయించడం మన రాచరికపు సంప్రదాయమేమో మరి. ఏమైనా, రచనని మాత్రమే రచనగా తీసుకుని విశ్లేషిస్తే, మన సాహిత్యం మెరుగుపడే అవకాశం ఉంది,' అంటారు.

కలం కాలంనించి ఇప్పటి కీబోర్డు కాలందాకా విరామమెరుగని కలం మాలతిగారిది. రాత నుంచి కంప్యూటరు దాకా ఎంతో ఓపికగా, శ్రద్ధగా రూపాంతరం పొందడమే కాకుండా, రచనాస్వభావాన్ని కూడా కాలానుగుణంగా మార్చుకున్న మాలతిగారు అటు ఆంధ్రా, ఇటు అమెరికా తెలుగు జీవితాల మధ్య సామ్యాలనూ, సామరస్యాలనూ వెతికే ప్రయత్నం చేశారు. స్వీయరచనల్లోనూ, అనువాదాల్లోనూ వొక నిష్టతో, నియమంతో పనిచేస్తున్నారు. వయసూ, బతుకు బాధలతో నిమిత్తం లేకుండా ఎత్తిన కలం... (టచ్ చేసిన కీబోర్డు అనాలా?!) వదలకుండా, అన్ని అవరోధాలనీ జయించి రచయితగా తన ఉనికిని సదా కాపాడుకుంటున్నారు.

'అచ్చు లోకంలోనే కాకుండా, అంతర్జాల లోకంలో కూడా సుపరిచితమయిన పేరు నిడదవోలు మాలతి,' అంటారు అఫ్సర్.





నిడదవోలు మాలతి రచనాదృక్పథం

శీలా సుభద్రాదేవి

1964లో సాహిత్యరంగంలోకి అడుగుపెట్టిన నిడదవోలు మాలతిగారు సుమారు 70 ఏళ్లుగా నిర్విరామంగా తనకు నచ్చిన విధంగా ఎవరి ప్రభావానికిగానీ, సాహిత్య రంగంలో వస్తోన్న అనేకానేక పరిణామాలకుగానీ, వాదాలకుగానీ తన దృక్పథాన్ని మార్చుకోకుండా కేవలం మానవీయ విలువలు, మానవ మనస్తత్వ చిత్రణమే తన దృక్పథంగా ఎంచుకొని రచనలు చేస్తోన్న రచయిత్రి.

అంతమాత్రాన సాహిత్యధోరణులు పట్టించుకోవడంలేదు అనుకోటానికి వీలులేదు. అన్నీ గమనిస్తూనే అవసరమైనప్పుడు తన అభిప్రాయాన్ని ఏదో ఒక రచనా ప్రక్రియ ద్వారా వ్యక్తపరుస్తూనే ఉన్నారు.

ఆమె 1973 లోపున రాసిన కథలన్నీ చాలావరకూ విశాఖ నేపథ్యంగానే సాగుతాయి. తర్వాత నుండి ఇప్పటివరకూ రాస్తున్న రచనలకు అమెరికా నేపథ్యమే అయినా అందులో భారతీయ సంస్కృతీ, విశాఖ సముద్రం, సంపెంగల గుబాళింపూ మనల్ని తాకుతునే ఉంటాయి.

'నా సాహిత్య దృక్పథమే నా జీవన దృక్పథం,' అని చాటే నిడదవోలు మాలతి గారి సాహిత్యఖాతాలో ఏడు కథాసంపుటాలు, నాలుగు ఎన్నెమ్మ కథాసంపుటాలు, రెండు నవలలు, అయిదు వ్యాససంపుటాలూ కాక అనేక సాహితీ ప్రముఖుల వందల కథల్ని ఆంగ్లంలోకి అనువదించారు.

'నాకు ఎల్లవేళలా ఛాలెంజ్ కావాలి, అదే నన్ను నడిపించే చోదకశక్తి,' అంటారు మాలతి. నిజానికి ఛాలెంజ్ లేకపోవటమే అసలైన ముసలితనం అంటారామె. బహుశా ఆమె నిరంతర సాహిత్యకృషికి అదే కారణం కావచ్చు.

ఎప్పటికప్పుడు నిరాశానిస్పృహలతో చతికిలపడిపోయేవారు ఒకసారి నిడదవోలు మాలతి రచనలలోకి తొంగిచూడాల్సిన అవసరం ఉంది.

ఒకటి రెండు రచనల్నిబట్టి స్త్రీవాద రచయిత్రిగా పేర్కొనడం ఆమెకి నచ్చదు. అందుకే నేను స్త్రీవాద లేబుల్ కోసం రాయలేదని నిర్ద్వందంగా ఖండిస్తారు.

మాలతిగారి రచనలు చాలావరకూ ఉత్తమ పురుషలో ఉండటం వలన పాఠకులు కూడా కథలో మమేకం అయ్యేలా ఉంటాయి. వీరి రచనలన్నింటిలో కొన్ని పాత్రలు తిరిగి తిరిగి పలుమార్లు కథాంశంలోకి ప్రవేశిస్తూనే ఉంటాయి. అందుకే కథలన్నింటిలోనూ ఏకసూత్రత ఉండటం రచయిత్రి కథనశిల్పంలోని ప్రత్యేకత అని చెప్పొచ్చు.

మాలతి కథలు వాస్తవికత పేరుతో కరుణార్ద్రంగా చిత్రించే రచనలు కావు. అబ్బాయి అమ్మాయిల ప్రేమకథలు కావు. దాంపత్యజీవితంలో అపార్థాలు అపోహలూ లేవు. అలా అని నిస్సార కథలు అనుకోకండి. మానవీయకోణంలో ఏ దేశమైనా- సంస్కృతి, భాష, జీవనసరళిలో తేడా ఉండొచ్చుగానీ మౌలికవిలువల్లో మానవస్వభావాల్లో తేడాలు ఉండవనేది చాటి చెప్తాయి మాలతి రచనలు.

మాలతిగారు ప్రధానంగా కొన్నింటిని నెరేషన్ పద్ధతిలోను, మరికొన్ని సంభాషణారూపకంగానూ రాసారు.

వీరి రచనల్లో మరో ముఖ్య లక్షణం తెలుగు నుడికారం. చాలా సహజమైన, సరళమైన సంభాషణలతో రచన కొనసాగుతుంది. ఇంకో ప్రత్యేకత సీరియస్ విషయాన్ని సైతం హాస్యధోరణిలోనో, వ్యంగ్యధోరణిలోనో వాతావరణాన్ని తేలిక పరుస్తూనే ఆలోచింపజేస్తాయి.

రావిశాస్త్రి, మునిమాణిక్యం రచనల ప్రభావం వల్లనేమో మాలతిగారి రచనల్లోనూ సున్నితమైన వ్యంగ్యం, చమత్కారాల శైలి ఆకట్టుకుంటుంది.

మాలతి రచనల్లో పాత్రల మనోచిత్రణకూ, సంఘర్షణలకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో పరిసరాల చిత్రణకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తారు.

కొన్ని కథలు తనలో తానే జీవనమథనం చేసుకుంటున్నట్లు ఉండటం మూలాన వాటిని మ్యూజింగ్స్‌లాగానో, గల్పికల్లాగానో పరిగణించాలి. దేనిలోనైనా స్పష్టంగా కనిపించేది మాత్రం మానవసంబంధాలు, స్వభావాలు, ఆర్థిక సంబంధాలు, స్నేహాలు. అన్నింటినీ చెప్తూనే ఇటువంటివన్నీ అవసరార్థం వాడుకునే వారి అవకాశవాదాల్నీ కూడా అంతర్లీనంగా తెలియజేస్తూ ఉంటాయి.

నిడదవోలు మాలతి రచనలు నేల విడిచిన కథలు కావు. మూలాల్ని స్పృశిస్తూ వర్తమానంలో బతుకుతూ మనిషిగా బ్రతకటానికి కావలసిన మనసును తడుము కోవాల్సిన వాస్తవ కథలు, మనసు కథలు, మనిషి కథలు, పాజిటివ్ థింకింగ్‌ను ప్రేరేపించే కథలు.

మాలతి రచనలు గురించి చెప్పాలంటే తప్పక చెప్పవలసింది మరొకటి ఉంది. వీరి చాలా రచనలలో 'నేను' పాత్రతో సమానంగా ఉండే పాత్ర సంద్రాలు. 'నేను' పాత్ర మూలాలేకాక స్వభావంలో కూడా రచయిత్రి మాలతిని పోలి ఉంటుంది. ప్రతి సంఘటనలోనూ, సంఘర్షణలోనూ 'నేను'ను మందలిస్తూనో, మానవ నైజాన్ని విప్పి చెప్తూనో, సమస్యని పరిష్కరించడానికి ఎలా నడుచుకోవాలో బోధిస్తుంది. అన్నింటికీ మౌనం వహిస్తున్న 'నేను'ను కోప్పడుతూ ఒక స్నేహితురాలిగా కథలన్నింటి లోనూ ఉన్న పాత్ర సంద్రాలు. విదేశాల్లో ఉన్నాసరే మర్చిపోలేని ఉత్తరాంధ్ర మాండలిక సొబగును సంపంగి పరిమళంగా సంద్రాలుతో పలికిస్తారు మాలతిగారు.

'నేను' పాత్రకి లోపలి మనిషిలా సంద్రాలు పాత్రని సృష్టించటమేకాక ఆ పాత్ర కేంద్రంగానే రచనల్ని రాయటం మాలతిగారి ప్రత్యేక టెక్నిక్‌గా తోస్తుంది.

'చిన్న పదం, ఒకవాక్యం అయినా చాలు నాకు కథ రాయటానికి,' అని చెప్పే మాలతిగారు 'శివుడాజ్ఞ' అనే కథని మూడు ముగింపులతో రాయటమూ ఒక రచనావిన్యాసమే.

మొత్తంగా మాలతి రచనలన్నీ మధ్యతరగతి మహిళల కథలే. వీరి ఎన్నెమ్మ కథలు కూడా సాహిత్య, సాహిత్యేతర విషయాలపై అనేక విషయాలు చర్చిస్తూ చిన్న కథలుగా గల్పికలుగా వుంటాయి.

తెలుగేతర ప్రజలకు తెలుగు భాషా సంస్కృతులు, సాహిత్యం పై వారికి గల అపోహలు తుడిచివేయటానికే అనువాదాలు చేసానంటారీమె.

నిడదవోలు మాలతిగారి సాహిత్య వ్యాసాలు చాలా అమూల్యమైనవి. ప్రాచీన, ఆధునిక సాహిత్యకారుల గురించి, సాహిత్యం గురించి సాధికారతతో రాసిన నాలుగు సంపుటాలు తన తూలిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇవన్నీ తెలుగు అధ్యయనం చేసేవారికి, అధ్యాపకులకూ చాలా ఉపయుక్తంగా ఉంటాయి.

ఒక నిర్దిష్టమైన దృక్పథంతోనే నిడదవోలు మాలతి రచనల్ని చేస్తారనే విషయం ఆమె సాహిత్యాన్ని పరిశీలించిన వారికి తప్పక స్పష్టమౌతుంది.





డెబ్భై వసంతాల సాహితీసౌరభం

వారణాసి నాగలక్ష్మి

సాహితీ విద్యుల్లత నిడదవోలు మాలతిగారికి మొల్ల సాహితీ సత్కారం లభించిన శుభసందర్భంలో వారికి అభినందనలూ, సాహితీ మిత్రులందరికీ శుభాకాంక్షలూ!

ప్రవాసి అయి ఉండీ, అంతర్జాలపు సౌకర్యం లేని రోజుల్లో కూడా, దశాబ్దాల తరబడి తన కథలతో, వ్యాసాలతో, సమీక్షలతో, అనువాదాలతో తెలుగు సాహితీ రంగాన్ని సుసంపన్నం చేస్తూ వచ్చిన నిడదవోలు మాలతిగారిని మొల్ల సాహితీ సత్కారానికి ఎన్నుకోవడం, ఒక చక్కని సాహితీసభ ఏర్పాటుచేసి వారిని గౌరవించు కోవడం ఎంతో హర్షదాయకమైన విషయం. హర్షదాయకమే కాదు తెలుగు సాహిత్యాభిలాషులందరికీ విధాయకం కూడా అయిన విషయం.

ఈ సందర్భంగా ఇటువంటి సందర్భాన్ని కల్పించిన ప్రముఖ కవయిత్రి, రచయిత్రి- కల్పనా రెంటాలగారిని మనసారా అభినందిస్తున్నాను. నన్ను కూడా ఈ సభలో పాల్గొని నాలుగు మాటలు చెప్పమని అడిగినపుడు సరిగా మార్చి పదకొండున లేఖిని సాహితీ సంస్థ వార్షికోత్సవ సభ కూడా ఉండడం వల్ల నేను రాలేనని అంటే రికార్డ్ చేసి పంపుతారా అని అడిగారు. సంతోషంగా అందుకు ఒప్పుకున్నాను.

మాలతిగారి రచనలో నన్ను ప్రధానంగా ఆకర్షించింది వారి నిశితమైన చూపు, తాత్త్వికధోరణీ.

ఆవిడ కథలెలా ఉంటాయంటే ఆయా కథల కోసం ఆమె ఎన్నుకున్న ప్రధాన పాత్రల జీవితాన్ని సీటీ స్కాన్ చేసి ఎదురుగా పరిచినట్టుంటాయి. ఆవిడ రాసి

పెట్టేస్తారు కథల్ని. వాటిని అర్థం చేసుకుని సంపూర్ణంగా ఆస్వాదించాలంటే పాఠకులుగా మనం మన బుర్రని వాడి తీరాల్సినట్లుంటాయి ఆ కథలు.

మేడ ఎక్కేటప్పుడు చూడండి కొందరు రెండేసి మెట్లకో అడుగు చొప్పున చెంగు చెంగున ఎక్కేస్తారు, వాళ్ల శారీరక పటుత్వం మీద మనకి అసూయ కలిగేలా. మరికొందరు నేలమీద నడకలా కాకపోయినా, ప్రయాస కనపడకుండా తేలిగ్గా ఎక్కేస్తారు. ఇంకొందరు కుడి కాలు తీసి, పై మెట్టు మీద పెట్టి, మెల్లిగా ఎడమకాలు సాగతీసుకుని, అది కూడా పైమెట్టు మీద పెట్టి, ఊపిరి తీసుకుని మళ్లీ రెండో మెట్టు అధిరోహణం చేయడానికి పూనుకుంటారు!

మాలతిగారిది మొదటి కేటగిరీ. ఆవిడ కథ, మొదలుపెట్టగానే మెరుపులా తళుక్కుమని మెరిసి రూపం పూర్తిగా అర్థం కాకముందే ముగిసిపోతుంది. ఆ మెరుపు రూపం తర్వాత మన మనసులో మిగిలిపోయినట్టే ఆమె కథలూ చిరకాలం జ్ఞాపక ముంటాయి. ఈ చురుగ్గా కదిలిపోయే కథనం వల్ల పాఠకుడికి ఎక్కడా విసుగెత్త కుండా కథ నడుస్తుంది. ఉత్కంఠ నిలుస్తుంది.

నేను పుట్టక ముందు రాసిన కథల్లో కూడా, ఆమె వాడిన భాష ఇప్పటికీ సమకాలీనంగా ఉండడం నాకు ఆశ్చర్యం కలిగించింది. కథాశిల్పంలో, శైలిలో ఈమెది తనకే సొంతమైన, వినూత్నమైన పద్ధతి. మచ్చుకి కొన్ని కథలు చూద్దాం.

పాములు పట్టే రోశయ్య ప్రధాన పాత్రగా రాసిన ఒక కథ పేరు విషప్పురుగు. ఎక్కడా ఈ రోశయ్య వ్యక్తిత్వాన్ని ఎలివేట్ చేయకుండా విషప్పురుగు అతనేనేమో అనిపించేలా కథని లాక్కొస్తారు. చిట్టచివర్లో పాఠకుడికి నిజమైన విషప్పురుగు ఎవరో అర్థమవుతుంది. ఇందువల్ల కథాశిల్పం వన్నె తేలి, కథకు విలువ చేకూరిందని పిస్తుంది.

కథలోని రోశయ్య బడిలో ప్యూన్. పాములు పట్టడంలో సిద్ధహస్తుడైన ఇతను ఆ ఊరిలో ఎక్కడ పాము కనపడినా నేర్పుగా పట్టుకుని ఊరివాళ్లకి సాయపడుతూ ఉంటాడు. అయితే పాఠశాలలో తన విధులకి రోజూ ఆలస్యంగా వస్తాడుగాని ఎవరి ముందూ తల దించుకోడు. నమ్రతగా ఉండడు.

ఇతనిపట్ల అందరి కంటగింపుకీ కారణం కథ పూర్తయ్యాక మనం ఊహించు కోవలసిందే- అంతా సమయానికి రావలసి ఉండగా ఇతను మాత్రం ఇష్టానుసారంగా వస్తూ కూడా ఆ ఉద్యోగంలో మనగలగడం. బడిలో స్టాఫ్ అందరి సంతకాలూ అయిపోయాక ఆ రిజిస్టర్ తెచ్చి హెడ్ మిస్ట్రెస్ టేబుల్ మీద పెట్టడం అతని పని. ఆలస్యంగా వచ్చిన రోశయ్య తన సంతకం కూడా పెట్టేసి రిజిస్టర్ తెస్తే హెడ్ మిస్ట్రెస్‌కి తెలిసే అవకాశం ఉండదు. అయినా అతనలా చేయడు. ఆలస్యంగా వచ్చానని చెప్పి ఆవిడ ముందే సంతకం పెడతాడు. అతను ముక్కుసూటిగా పోయే వ్యక్తి

అనీ, ఎవరినీ లెక్క చేయడనీ అతని ప్రవర్తన ద్వారానే పాఠకులకి పరిచయం చేస్తారు మాలతిగారు.

'పోస్ట్ మానవుడు అనేవాడు ఒకడు కలడో లేడో,' అంటారు కథలో ఒకచోట. మానవ మనస్తత్వాన్ని ఒక్క వాక్యంలో పొందుపరుస్తూ, 'హెడ్డు గోతిలో పడ్డందుకు జాలిపడుతూ తలో బెడ్డా విసిరేరు,' అంటారు. జాలి దారి జాలిదే, దాడి దారి దాడిదే కదా అనిపిస్తుంది. ప్రాణాలకు తెగించి విషనాగుల్ని పట్టి ఎక్కడో విడిచిపెట్టే 'రోశయ్య' మీద రాసిన ఛార్జిషీటుపై సంతకం పెడుతూ, తన చేతిలో కలం, 'ముందు రోజు చూసిన సరీసృపంలా కదుల్తున్నట్టనిపించింది,' అనిపిస్తారు హెడ్ మిస్ట్రెస్ చేత. పాము కాటేసినట్టే ఆ కలం కూడా రోశయ్యని కాటేస్తుంది కదా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ రూపంలో.

మంచుదెబ్బ అనే కథలో పువ్వులాంటి వకుళకి అందవికారేగాక నపుంసకుడు కూడా అయిన నరహరితో పెళ్లి జరుగుతుంది. తగిలిన ఆ మంచుదెబ్బకి ఆమె మాట్లాడాలనే కోరిక హరించిపోయి, ట్రీట్‌మెంట్ పేర అనేక హింసలకు గురై హఠాత్తుగా మరణిస్తుంది. మాలతిగారి శీర్షికలు చూస్తే ఈమె కథలకి పేర్లు కూడా ఎంతో శ్రద్ధతో ఎన్నుకుంటారని తెలుస్తుంది. భార్యాభర్తల మధ్య సంబంధం సవ్యంగా ఉందోలేదో బయటివాళ్లకి తెలిసే అవకాశం తక్కువ. ఫ్రాస్ట్ బైట్‌లాగే. బయటికి కనపడని ప్రాణాంతకమైన దెబ్బ అది. ఆ దెబ్బకి గురై వకుళ మరణిస్తుంది.

విషప్పురుగు కథలాగే ఈ కథా ఉత్తమపురుషలో సాగుతుంది. మాలతిగారి కథల్లో కొన్ని అరుదైన పదప్రయోగాలు కనిపిస్తాయి. ఈ కథలో ఆకాశంలో కదులుతున్న నల్లటి మేఘాలని వర్ణిస్తూ వప్రక్రీడాగజప్రేక్షణీయం అంటారు. ఏమిటా అని వెతికితే తెలిసింది- వప్ర క్రీడ అంటే ఏనుగు మొదలైన జంతువులు దంతాలతో కుంభాలతో ఏటి ఒడ్డుని పెళ్లగిస్తూ, రాళ్లూ రప్పల్ని పైకి విరజిమ్ముతూ ఆడే ఆట. వప్రక్రీడలో ఉన్న ఏనుగుల్లాంటి మేఘాలని చూసినట్టుందిట ఆకాశంలో మేఘాల చలనం.

'నల్లగా బండరాళ్లలా, కారు ఎనుముల్లా ఉన్న ఆ మేఘాలు అస్తమిస్తున్న సూర్యుడిని దాచ ప్రయత్నిస్తున్నాయి. సూర్యనారాయణుడు అల్లరిపిల్లవాడిలా అడుగునుంచే చేతులు చాపుతున్నాడు. దివ్యకాంతులు విరజిమ్మే ఘనశ్యామ సుందరుడు ఇలాగే ప్రకాశించేడు కాబోలు. అంత ఎత్తుకు ఎగరలేని రాధ కింద నించి దిగులుగా, నీ లీలలకి అమాయికనైన నేనే దొరికేనా? అన్నట్టు చూస్తుంది కాబోలు,' అంటూ ఎత్తుగడలోనే ముగింపుకి సూచనలా ఈ వాక్యం వాడతారు ఆమె.

నవ్వరాదు కథలో హాయిగా స్వచ్ఛంగా నవ్వుతూ తుళ్లుతూ అల్లరి చేసే అమ్మాయి కమలిని. పెళ్లి చేయాలి కాబట్టి చదువుకోనివ్వని తల్లితండ్రులవల్ల చదువు లేకుండా మిగిలిపోయి, పెళ్లి కాకపోవడంతో అన్నావదినల ఇంట్లో చాకిరీకి పరిమితమైపోయి, ఎన్నో విఫలమైన పెళ్లిచూపుల తర్వాత పెళ్లి చేసుకుంటుంది. తీరా చూస్తే అత్తింటివారు కడుపునిండా నాలుగు మెతుకులు కూడా పెట్టని రకం. స్నేహితురాలితో మాటల్లో అత్తవారి ప్రస్తావన వస్తే, తన కష్టాలు చెప్పుకోకుండా, 'మనుష్యుల్ని స్టడీ చేయడానికి నాకింత మంచి అవకాశం దొరుకుందనుకోలేదే,' అంటూ నవ్వుతుంది. 'ఇప్పటికీ నీకర్థం కాలేదు మనం ఏడ్చినా నవ్వినా ఒకటేనని,' అంటూ ఒక్క వాక్యంలో తన జీవితం ఎలా నడుస్తోందో చెప్పకుండానే చెపుతుంది కమలిని.

ఎలాంటి పరిస్థితిలో అయినా నవ్వు వీడని కమలినిని ఏమిటా నవ్వు అని చివాట్లు పెట్టేవాళ్లే అంతా. చివరికి చావు దగ్గరకొస్తుంటే, 'యముడు ఎన్టీ రామారావులా వుంటాడా? ఎస్వీ రంగారావులా వుంటాడా? ఎవరి వెనకపడితే వారి వెనక పోలేనుకదా,' అని స్నేహితురాలితో కమలిని హాస్యమాడుతుంది. స్నేహితురాలు సరస్వతి, చిన్నప్పటి నుంచి కమలినిని ఎరిగున్నదై ఉండీ కూడా, 'నువ్వలా నవ్వకే నాకు భయమేస్తోంది,' అంటుంది. 'నువ్వు కూడా నవ్వొద్దనే అంటావా సరసూ,' అంటుంది కమలిని.

కథ ముగిసేసరికి, ఇలా ఎందరు స్త్రీలు తమ నవ్వుల్ని కోల్పోయారో కదా అనిపించి విచారం కమ్మేస్తుంది. కథ పేరు 'నవ్వరాదు' అని పెట్టడం సముచితమని పిస్తుంది.

మరో కథ రససిద్ధిలో విద్యార్థి అయిన రాజారావుకీ, కుర్ర లెక్చరర్ కామేశ్వర రావుకీ మధ్య చిన్నపాటి ఘర్షణ కారణంగా ఇరవై రోజుల నించీ రకరకాల నినాదాల మధ్య సమ్మె నడుస్తూ ఉంటుంది. 'సమ్మెకు కారణాలు చాలామందికి తెలీవు. తెలిసిన కొద్దిమందీ పదిరోజులయేసరికి మర్చిపోయారు,' అంటారు. ఇవాళ్టికీ చాలా సమ్మెలు అలానే సాగుతూండడం మనం చూస్తూంటాం.

కథంతా చివరికి వచ్చేవరకూ పాఠకుడికి రాజారావే సమ్మెని నడిపిస్తున్నాడని అర్థంకాదు. కాలేజీ లేకపోవడంతో కాలక్షేపం లేక ఏనాడూ సంగీతం వినని రాజారావు ఓ సంగీతసభకి వెళ్తాడు. తనకు తోచిందే సరైనదని నమ్మే రాజారావుకి ఔచిత్యం గురించిన ప్రథమ స్ఫురణ సంగీతసభలో కలుగుతుంది. కళలు మనుషుల మధ్య ఘర్షణ నివారించే లూబ్రికెంట్స్‌గా కందెనలుగా ఎంతబాగా పనిచేస్తాయో ఈ కథలో చూపిస్తారామె. ఆ పాటకచేరీలో, రససిద్ధి కలిగిన స్థితిలో లెక్చరర్‌పట్ల కలిగిన వైషమ్యం తొలగిపోయి సమ్మె ముగించేస్తాడు రాజారావు. కథ ఇలా కాకుండా ఎలా చెప్పినా ఈ రససిద్ధి కలిగేది కాదనిపించింది!

కథలో ఏమీ తోచని రాజారావు జూనియర్ విద్యార్థిని కలవడానికి వెళ్లినపుడు కాలేజీ కుర్రాళ్ల సినీవార వ్రతం గురించి ప్రస్తావన వస్తుంది. అదేమిటని రాజారావు అడిగితే, కొత్తగా యూనివర్సిటీకి వచ్చిన కుర్రాళ్లు సోమవారం నించి శనివారందాకా రోజూ ఒక సినిమా క్రమం తప్పకుండా చూసి, ఆదివారం నాడు మూడాటలూ చూసి ఉద్యాపన చేసుకుంటారనీ, తర్వాత మూడో ఐదో టికెట్లతో వాయినాలు కూడా ఇచ్చుకుంటారనీ చెప్తాడా జూనియర్. ఇలా మాలతిగారి కథలన్నిటిలో అంతర్లీనంగా హాస్యరసం కూడా ప్రవహిస్తూ ఉంటుంది.

మాలతిగారి కథల్లో ముఖ్యంగా స్త్రీ ముఖ్యపాత్రగా ఉన్న కథల్లో, కథానాయికలు వివేకమూ, విచక్షణా, చక్కని సంస్కారమూ ఉన్న వ్యక్తులు. శరత్ కథలకీ వీటికీ పోలిక లేకపోయినా మర్చిపోలేని ప్రత్యేక వ్యక్తిత్వాలను సృజించడంలో రచయిత్రి సఫలీకృతులయ్యారనిపించి ఈమె కథలు చదివినపుడు శరత్ గుర్తొస్తారు. కథకి ముఖ్యమైన క్లుప్తత అనే లక్షణాన్ని ఎంత బాగా పాటించారంటే ఒకోసారి ఒక పెద్ద కథని సంక్షిప్తీకరణ చేశారా అనిపిస్తాయి కొన్ని కథలు.

పంతొమ్మిది వందల యాభైల్లో కథ రాయడం మొదలుపెట్టిన ఈ విదుషీ మణి ఇపుడు తూలిక పేర తన స్వంత జాలపత్రిక తెలుగులోనూ, ఆంగ్లంలోనూ నడుపుతూ దాదాపు వంద తెలుగు కథల్ని ఆంగ్లంలోకి అనువదించి మూడు అనువాద కథాసంకలనాలు ఆంగ్లంలో వెలువరించారని విన్నపుడూ, ఆంగ్లంలో, ఆంగ్ల సాహిత్యంలో, లైబ్రరీ సైన్సెస్‌లో- రెండు సబ్జెక్ట్స్‌లోనూ ఎమ్మే పట్టాలు పుచ్చుకున్నారని వికీపీడియాలో చూసినపుడు విస్మయం కలిగింది.

పురస్కారాల పరంగా చూస్తే వీరి కృషికి తగిన గుర్తింపు లభించలేదనిపించిన మాట వాస్తవం. ఇవాళ మాలతిగారిని మొల్ల సాహితీ సత్కారం అందించి, గౌరవించుకునే సన్నివేశం తెలుగు సాహితీలోకం ఎంతగానో సంతోషించవలసిన సందర్భం. ఈ సందర్భంగా నిడదవోలు మాలతిగారికి హార్దికాభినందనలు తెలియజేస్తూ మిత్రులందరికీ శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాను.





నిడదవోలు మాలతి నవలావలోకనం

సునీత రత్నాకరం

ముందుగా మొల్ల పురస్కార గ్రహీత నిడదవోలు మాలతిగారికి అభినందనలు. జూమ్ వేదికగా జరుపుకుంటున్న ఈ కార్యక్రమంలో మాలతిగారి సారస్వతాన్ని చర్చిస్తున్న వక్తలందరికీ నా నమస్కారాలు. మాలతిగారి నవలాసాహిత్యం గురించి ఈ నాలుగు మాటలు మాట్లాడటానికి నాకున్న ఒకే ఒక అర్హత ఒక చదువరిగా ఆ నవలలని ఇష్టంగా చదువుకోవడం, ఇంకా మాలతిగారిని రచయితగా, వ్యక్తిగతంగా అభిమానించడం మాత్రమే. ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు కల్పన గారూ.

మొదటిగా చెప్పుకోవల్సిన ఒక మాట, మాలతిగారిని ఫేస్‌బుక్ మాధ్యమంగా అనుసరించడం మొదలుపెట్టిన వారిలో కనీసం యాభైశాతం మంది చెప్పే మాట, నేను ఈ మాత్రం తెలుగు నిలబెట్టుకోవడానికి ముఖ్య కారణం వారే. ఆ పట్టుదల చూసి చిన్నగా తెలుగులో రాయడం మొదలుపెట్టి, ఇవాళ ఇంగ్లీషు మాటలు కూడా తెలుగు లిపిలోనే రాసేస్తున్నాను అవసరమైతే. రాస్తూ వుంటేనే ఆ మాటలు మన పట్టులో వుంటాయన్నది అందరి అనుభవమే. మాలతిగారి కథలూ, ఫేస్‌బుక్ మాధ్యమంగా చేసే చిన్నపాటి సాధారణ, హాస్య, వ్యంగ్య సంభాషణలూ; ముఖ్యంగా ఆధునిక యాంత్రిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ ‘తూలిక’ ద్వారా చేస్తున్న సాహిత్యసేవ నన్ను ముగ్ధురాలిని చేస్తుంటుంది. కానీ ఆయా అంశాలపై ఇతర వక్తలు మాట్లాడబోతున్నారు కాబట్టి నేను వీరి రెండు నవలలు మార్పు, చాతకపక్షులు గురించి మాత్రమే మాట్లాడతాను. కథ గురించి మాట్లాడినా, నవల

గురించి అయినా కథ చెప్పకపోవడమే మేలైన పంథా కనుక నేను ఆ పద్ధతిలోనే ఈ నవలల పట్ల నా అవగాహన మాత్రమే ఇక్కడ పంచుకోబోతున్నాను.

'చాతకపక్షులు' వీరి మొదటి నవల. ఈ నవల గురించి నేను ఇదివరకు రాసిన మాటలనే ఈ ప్రసంగంలో కూడా చేర్చాను. ఇతరేతర ఉద్యోగసంబంధ బాధ్యతల వల్ల 'మార్పు' మాత్రమే రెండవసారి చదవగలిగినందున ఇందుకు నన్ను క్షమించాలి.

చాతకపక్షులు

'చాతకపక్షులు' నవల మాలతిగారు ఎనభయ్యవ దశకంలో రాయడం మొదలుపెట్టారట. కానీ కొంతలో ఆపి మళ్లీ పూర్తిచేసింది మాత్రం రెండువేలలో. మొదట 2004లో ప్రచురించపడి తర్వాత బ్లాగుకి వెళ్లి ఇప్పుడు మళ్లీ నెచ్చెలి.కామ్‌లో సీరియల్‌గా వచ్చింది.

కథ స్థూలంగా చూసుకుంటే, గీత అనే వో అమ్మాయి వివాహబంధంతో అమెరికాలో అడుగుపెట్టి అక్కడి సంస్కృతిని ఆకళింపు చేసుకుంటూ, తను పుట్టి పెరిగిన వాతావరణాన్ని గుర్తుచేసుకుంటూ, తనలాగే ఇక్కడికి చేరిన ఇంకొందరి వ్యవహారాలను దగ్గరగా గమనిస్తూ, తన ఆలోచనలతో వీటన్నింటినీ తరాజు వేసు కుంటూ జీవితం నడిపిస్తున్నట్టుగా ఒక పెద్ద ప్రణాళిక లేకుండా వెళ్లిపోతుండటమే.

ఊరికొకరు అమెరికాకు వెళ్లడం నుంచి వీధికొకరు మీదుగా ఇప్పుడు ఇంటి కొకరు అన్నట్లుగా మారిన కాలం. ఇట్లాంటప్పుడు తెలియనివి ఏం చెప్పారు ఇందులో... ఇప్పుడీ కథ ఎందుకు చదవాలి అన్న సందేహాలు రావచ్చు. ఈ కథ చెప్పడంలో రచయిత ఒక ట్రావెలాగులాగానో, అక్కడి వాతావరణ చిత్రణమీదనో మాత్రం ప్రధానంగా దృష్టి పెట్టి వుంటే ఆ మాట ఒప్పుకోవచ్చు. కానీ, ఈ నవలలో జరిగింది రకరకాల మనస్తత్వాల చిత్రణ, విశ్లేషణ. అందుకే ఇది తప్పక చదవవలసిన కథగా మారుతుంది. కథలో అతి తక్కువ సమయం కనబడే శివం మామయ్య, కనకమ్మ అత్తయ్య, ఇమ్మాన్యుయేల్, అచల లాంటి పాత్రల నుంచీ ప్రధాన పాత్రలు గీత, హరి, తపతిల దాకా అందరికీ జవజీవాలతో నిండిన వ్యక్తిత్వాలు వున్నాయి. పాత్రల మధ్య సంబంధాలు ఆసక్తికరంగా వాస్తవికంగా వున్నాయి. దాదాపు అందరి జీవితాలలో వచ్చిన మార్పులు గీత కళ్లలోంచి చూపిస్తారు. గీత మాత్రమే తామరాకు మీది నీటిబొట్టు చందాన బతికేస్తుంది. తను కథానాయిక కనుక సర్వశ్రేష్ఠమైన మనిషిగా చూపాలి అన్న ప్రలోభం రచయితకు వుండకపోవడం గీతకు చేసే మేలు తక్కువ కాదు.

అమెరికాకి చేరాక తెలుగు మూలాలు కాపాడుకోవలనుకునే స్పృహతో చేసే రకరకాల క్రతువులు కార్యక్రమాల నుంచి సంఘాల ప్రహసనాల దాకా అన్నిటినీ

స్పృశించారు రచయిత. అందులోని సొబగు, క్లుప్తత వ్యంగ్యంతో చక్కగా సాధించారు. నేను చదివినంతలో అనవసరపు నాటకీయత లేకుండా సూటిగా రాయడం మాలతిగారి స్పష్టమైన ముద్ర, ఈ నవల మొత్తం ఆ ముద్ర తెలుస్తుంది. అది నాకు ఒక చదువరిగా వ్యక్తిగతంగా కూడా మంచి రచనలో నచ్చే లక్షణం. సాహిత్యరంగపు తీరుతెన్నులపై చేసిన ప్రస్తావనలు కొద్దివైనా చెప్పుకోదగ్గవి.

మార్పు

నవల విస్తృతిని ఎంత బాగా వాడుకున్నారో! కథగా ఏక వాక్య పరిధిలో వున్నా ఎన్ని విషయాలలో మార్పును ప్రస్తావించారో చూసాక అబ్బురంగా అనిపించింది. స్త్రీ పురుష సంబంధాలూ మనిషి వ్యక్తిస్థాయిలో మొదలై సమాజస్థాయికి మారడమూ కుటుంబ సంబంధ బాంధవ్యాలూ, భారతీయ, అమెరికన్, భారతీయ అమెరికన్ సమాజపు స్థితిగతుల్లో పరిణామాలూ మనిషి జీవితంలో ఆధ్యాత్మికతను చూసే కోణంలో మార్పులూ సాహిత్యపు సంఘాలూ వాటి తీరుతెన్నుల గురించి విపులమైన వ్యాఖ్య చేశారు. ప్రతీ సందర్భంలో దీనిమీద వెంటనే ఒక నిర్ణయం చెప్పేయాలి అన్న ప్రలోభాలకు లోబడలేదు. ఇదే రచయిత మాగ్నమ్ ఓపస్ అనేసే పిచ్చిపని చేయను కానీ నేను చదివిన నవలల్లో ఉత్తమస్థాయికి చెందిన వాటిపక్కన తప్పక నిలిచే కథ ఈ 'మార్పు'. ఈ అంశం మీద ఇంత విపులమైన నవల రాసినందుకు మాలతిగారికి మనం తప్పక ధన్యవాదాలు చెప్పుకోవాలి.

ఇప్పుడు కొంచెం సూక్ష్మంగా చూద్దాం.

ఈ నవలలో ఒక తెలుగువాళ్ల పార్టీ వాతావరణం వర్ణించాకా ఈ మాటలు అంటారు రచయిత- 'ఒక రెండున్నర గంటల కాలంలో సగం ఊరు చూసినట్టు అనిపించింది నాకు ఆ పూట.' ఆ ఒక్క పేజీలో రాజకీయ, సామాజిక, కౌటుంబిక, వ్యక్తిగత, వేదాంత చర్చలదాకా అన్నింటి విహంగవీక్షణం అయ్యేకల్లా కథకురాలికి కలిగినంత వేసటా చదువరికీ కలుగుతుంది. ఉక్కిరిబిక్కిరయ్యే ఆ వాతావరణం కళ్లకు కడుతుంది. అంత వేగవంతమైన నడక చూపించినంత సహజంగానే చివరి పేజీలలోని మనిషికి ఏది ఆనందం, ఏది పరిపూర్ణత అన్న అతి నెమ్మదిగా చేయ వలసిన చర్చా ప్రభావవంతంగా చేస్తారు. కథలోని తెలుగు పాత్రలకే పరిమితం అవ్వకుండా అమెరికా సామాజిక వ్యవహారాల గురించి కూడా వ్యాఖ్యానం ఇస్తారు కథ నడకను బట్టి. సోషల్ సెక్యూరిటీ కల్పనలో అవకతవకలు, క్రెడిట్ స్కోర్ గోల, అప్పులవాళ్లు, పొలిటికల్ పార్టీల పంథాలు, రాజకీయ చర్చలు, పచారి కొట్ల వ్యవహారాలూ, పిలుపుల్లో కనపడీ కనపడని మర్యాదలూ, అతిథి సత్కారాలూ ఇట్లా ఎన్నో.

కథలోని ముఖ్య పాత్రల గురించి ఇట్లా చెప్పుకోవచ్చు. అరవింద విషి అధునాతన తరానికి ప్రాతినిధ్యం వహిస్తే, లీలాసుందరం ఒక తరం ముందరి

మనుషులు; వారికి ముందు ప్రభాస్‌రావూ, శివానీ. వీరు విషీ అమ్మానాన్నలు, ఇంకా అరవింద అమ్మానాన్నలు; వారికన్నా ముందు తరం అరవింద అమ్మమ్మ శ్రీదేవి, ఆవిడ స్నేహితురాలూ కథకురాలూ మాలికా అనుకుంటే అందరికన్నా ముందరి మనిషి పెద్దక్క; ఈవిడ శ్రీదేవి అక్కగారు. దాదాపు అందరూ ఎగువ మధ్యతరగతి లేదా కాస్త తక్కువలో ఉన్న మనుషులు. వీరందరినీ ముఖ్య పాత్రలుగా ఉంచి ముందర చెప్పుకున్న మానవ సంబంధాల్లోని మార్పుల గురించి, వివాహవ్యవస్థలోని మంచిచెడుల గురించి, ముఖ్యంగా మార్పు గురించి కథకురాలు మాలిక చేసే కామెంటరీగా చూడచ్చు ఈ నవలని.

అలా అని పూర్తిగా ఈ ఒక్క అంశాన్ని మాత్రమే చర్చించరు ఈ నవలలో. పూర్వకాలపు నవలల మాదిరే ప్రధాన కథ నడుపుతూ చిన్న చిన్న సబ్ ప్లాట్స్ కూడా వస్తుంటాయి. నవల విస్తృతిని చక్కగా వాడుకోగల రచయితలు అందరూ చేసే పనిలాగే. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ విషయాన్ని మాత్రమే చర్చించాలి అనుకుని రాసిన నవల కాదు. ఇంగ్లీషులో మనం అన్నట్టు evolve అవుతూ వచ్చే నవల. ఒకరోజు మాట విలువ, పదును గురించి మాట్లాడుతారు. ఇంకొకరోజు సాహిత్యంలో, నిజ జీవితంలో నవ్వులూ ఏడుపుల గురించి విపులంగా. ఇంకోరోజు సుఖదుఃఖాలని వేదాంతదృష్టితో చూసే చర్చ చేసే పిల్లవాడి సంగతి; మరోరోజు స్త్రీవాదం పుట్టుపూర్వోత్తరాలూ, ఆ స్త్రీవాదం యధాతథంగా మన సమాజానికి పనికి వస్తుందా అన్న చర్చ; మనదేశంలో స్త్రీల స్థితిగతుల్లోని మార్పు గురించి ప్రామాణిక మైన చర్చ చేస్తారు, ఆ విషయాల గురించి పరిశోధించిన వారి ప్రస్తావనలతో సహా. హిందూ సంప్రదాయంలో మనిషి జీవితంలో, ఎదుగుదలలో, చిక్కులు తీర్చు కోవడంలో కుటుంబ పాత్ర ఇంకో రోజు. దిక్కుతోచకుండా ఉన్న ఒక పెద్ద కుటుంబాన్ని తీరువచేసిన తాతగారిని అవసరాలు దాటాక కుటుంబం చూసిన చూపుతో కలిగే కష్టం మరోరోజు. ఇట్లా ఎన్నో... దాదాపు అన్ని విషయాలూ ప్రధాన కథలో చక్కగా అమిరిపోతాయి, ఏవో కొన్ని ఒక్క ఉదుటున దూకేవి ఒకట్రెండు తప్ప. ఇక 'కవి'గారి అమెరికా యాత్ర ఆఖ్యానమయితే చదివి తీరవలసిన ఘట్టం. ఇట్లాంటిదే మరొకటి సభలూ, సమావేశాలూ అందు ప్రసంగాలను గురించిన చర్చ. మాలతిగారి నిఖార్సైన శైలిలో లోతైన వ్యాఖ్యానం చేసిన ఈ ప్రసంగం ఏమాత్రం వదులుకోవలసిన సంభాషణ కాదు.

కొన్ని వాక్యాలు:

నవలలోని కొన్ని ఆణిముత్యాల్లాంటి మాటలు.

"అనుభవాలా!! మనవాళ్లు చరిత్ర నుంచి నేర్చుకున్న పాఠం అదొక్కటే కదండీ!? చరిత్ర నుంచి మనం ఏమీ నేర్చుకోము అన్నదొక్కటే...

నిజంగా చరిత్ర చూసి పాఠాలు నేర్చుకుంటే ద్వాపరయుగంలో భారత యుద్ధం ముగియగానే అంతా బాగుపడేది. తర్వాత యుద్ధాలు ఉండేవి కావు."

"నీ పరిస్థితి ఏమిటో, నీ సామర్థ్యం ఏమిటో, నీకు ఏది సుఖమో నీకు తెలిసినట్టు నాకూ తెలియదు, మరొకరికి తెలియదు. నీకే తెలియాలి."

"నువ్వు ఇంకా చిన్నదానివి. నీకు కనిపించిందే చూసి తీర్మానాలు చేసేస్తావు. ప్రతి విషయం దాకా ఎందుకు ప్రతి మాటకీ వివరణలు తెలుపు నలుపు పొడిపొడిగా నిర్ణయించేస్తావు. నాకేమో ఎంత తెలిసినా ఇంకా తెలియందేదో ఉన్నట్టే ఉంటుంది."

తరాల ఆలోచనల్లోని మార్పుకి అతి చక్కని ఉదాహరణ ఇంత తేలికగా కనిపించేలా రాసిన ఈ మాటలు.

రచయిత పరిశీలనలు

మాలతిగారి పరిశీలనలు చాలా సూక్ష్మంగా ఉంటాయి. ఉదాహరణకి ఒక సంఘటనలో చిన్నపిల్లలకి మనం చక్కలిగింతలు పెట్టి నవ్వుతున్నారు అనుకుంటాం కానీ వాళ్లకి చక్కలిగింతల్లో ఆనందం ఉందోలేదో తెలియదు కదా అంటారు. ఇంకొక ప్రస్తావనలో శ్రీదేవి తారకంతో మాట్లాడుతూ బత్తుల కామక్షమ్మగారి ప్రస్తావన, నాళం సుశీలమ్మగారి ప్రస్తావన, వీరేశలింగంగారి ప్రస్తావన తీసుకువస్తారు. ఇదే మార్పు గురించి మనవరాలు అరవిందతో మాట్లాడినప్పుడు తన బాల్యపు విశేషాలో జనాంతికంగా తను చిన్నప్పుడు విన్న విషయాలో ఉదహరిస్తారు. ఈ తేడా గమనికలోకి వచ్చినప్పుడు రచయిత నైపుణ్యం పాఠకులకు మరోసారి ముచ్చటగొలుపుతుంది.

మొత్తానికి రచయిత అభిప్రాయం ఒక్కటే, పిడుక్కీ బియ్యానికి ఒక మంత్రం కాదు. ప్రతీ ఒక్కరు పరిస్థితికీ కాలానికి తగ్గ నిర్ణయాలు వాళ్ల అనుభవమూ, వాళ్లకి ఉన్న జరుగుబాటునిబట్టి చేసుకోవలసిందే అని.

వ్యంగ్యంలో పట్టున్న రచయిత

చివరిగా, నేను వ్యక్తిగతంగా ఎక్కువ అభిమానించే అంశం వ్యంగ్యం. వ్యంగ్యం సరిగ్గా వాడగలిగిన రచయిత రాసే వాక్యాలు చదువరికి మహదానందనం కదా!! మాలతిగారు అట్లాంటి రచయిత. కొన్ని వాక్యాలు అట్లాంటివి....

"నాలో కలుపుగోరుతనం గోరంత మాత్రమే."

"నిజమేనండి!! ఈ దేశంలో చావడానికి కూడా ముందే చెప్పుకోవాలి వారాలబ్బాయిలా.. ఆ యమధర్మరాజు వచ్చినా, 'ఇప్పుడు కాదు బాబూ ఆరునెల్ల తర్వాత కనిపించు,' అనాలి."

"సినిమా మొదలై అరగంట అయింది. ఎవరకీ ఏమీ తెలియడం లేదు. తమకేమీ తెలీడంలేదు అని చెప్పడానికి ఎవరు సిద్ధంగా లేరు. ఇంకా మరో పావుగంట అయితే చెబుదురేమో!?"

"అయితే ప్రముఖులు ఎవరెవరు వచ్చారూ?"

"మీరలా అడిగితే ఎలా అండీ! వచ్చినవారందరూ ప్రముఖులే. ప్రముఖులు కాకపోతే ఎందుకు పిలుస్తారూ?"

"ఇంతకీ నువ్వేం మాట్లాడావో చెపుదూ, సభలో."

"మీరేంటి ఆవిడనలా గొడవ పెట్టేస్తారు? ఇది అసలు స్పీచుల సభ కాదండి సత్కారాలు మాత్రమే. అంచేత పెళ్లిళ్లలో సంతర్పణ వడ్డనలా ఒక్కొక్కరినే పిలిచేసి ఏదో ఒక రంగం పేరు చెప్పో చెప్పకో పత్రాలో పలకలో ఇచ్చేసి పంపేయడమే. ఫోటోల్లో మాత్రం పకడ్బందీగా పలకలు అందుకుంటున్న వేళ చిరునవ్వుతో కెమెరా వైపు చూడమని గట్టిగా చెప్తారు. అంతే."

ఇంతటితో నవలావలోకనం పూర్తయినట్లే. ఈ రెండు నవలల్లోని అనేకమైన సూక్ష్మ విషయాలు ఈ కథకురాలికే సాధ్యమైన పరిశీలనలుగా తెలుస్తుంటాయి. ముఖ్యంగా ఆ లోతైన దృష్టికోణం కోసం మాలతిగారు ఇంకా ఒక్క నవలైనా రాయాలని ఒక పాఠకురాలిగా నా కోరిక. మాలతిగారు లోకంతో తలమునకలైనట్లు కనబడతారు కానీ నిస్సంగంపట్ల ఆసక్తి. ఆసక్తి ఇక్కడ సరైన మాట కాదుకదా! నిస్సంగం మీద చూపు ఉన్న మనిషని తెలుస్తూ ఉంటుంది నాకైతే.

ఇప్పుడు మాలతిగారికి జరుగుతున్న 'మొల్ల సత్కారం' పైన వ్యంగ్య సంభాషణలో ఉదాహరించినటువంటి సత్కారం కానందున వారికి ఈ ఆత్మీయ సత్కారం, 'మార్పు'లో ఉదహరించిన ఆయట్టి ఎనిమిది ఆనందాలలో ఒకటిగా ఎంచుతూ, మరొకసారి అభినందనలు తెలియజేయస్తూ, అందరికీ నమస్కారాలతో సెలవు.





నిశ్శబ్దంగా 20 సంవత్సరాలు దాటేసిన తూలిక.నెట్

వి.బి. సౌమ్య

తెలుగు నుండి జరిగిన ఆంగ్లానువాదాల గురించి ఎవరన్నా ప్రత్యేకంగా దృష్టి పెట్టి పరిశీలిస్తే 2001లో మొదలైన తూలిక.నెట్‌ని గురించి ప్రత్యేకంగా చెప్పాలి. దాదాపు 150 తెలుగు కథలకి ఇందులో అనువాదాలు ఉన్నాయి. మాలతిగారితో పాటు మరికొందరు కూడా అనువాదాలు చేశారు. వెబ్‌సైట్ నిర్వహణ గురించి మనం వ్యాఖ్యానించొచ్చు కానీ కంటెంట్ క్వాలిటీ వెలకట్టలేనిది. నేను అప్పుడప్పుడు మా ఆఫీసు వాళ్లకి చెబుతూ ఉంటాను తెలుగు కథలు కొన్ని ఉచితంగా ఆంగ్లంలో చదువుకోవచ్చు అని. ఎంతమంది చదువుతారు? అంటే తెలియదు. నేను అనువాదం చేసినపుడు మాత్రం నా కొలీగ్స్ ఒక నలుగురు తూలికకి వచ్చి చదివి నాకు చెప్పారు. కనుక ఈ నోటి మాట ప్రచారం అప్పుడప్పుడైనా పనిచేస్తోంది అనుకోవాలి. తూలిక వెబ్‌సైట్‌లోని కథల నుండి మూడు సంకలనాలు వచ్చాయి (జైకో, కేంద్ర సాహిత్య అకాడెమి, హైదరాబాదుకి చెందిన లేఖిని సంస్థవారు వేసినది). ఇవి మాలతిగారి అనువాదాలతో వచ్చినవి.

అనువాద కథలతో పాటు అనువాదంలో ఎలాంటి సమస్యలు వస్తాయి? ఎలాంటి సందర్భాల్లో ఏంచేయాలి? అంటూ మన వరసలు, సామెతలు మొదలుకుని, మన వ్యాకరణానికి ఆంగ్లభాషలో వ్యాకరణానికి మధ్య తేడాలు

అనువాదంలో ఎలాంటి రోడ్ బ్లాక్స్ సృష్టిస్తాయి- ఇలాంటి అనేక అంశాలు స్పృశిస్తూ రాసిన వ్యాసాలూ ఉన్నాయి. ఇలాంటివి అసలు అంతర్జాలంలో తెలుగు నుండి అనువాదం చేయడం గురించి ప్రత్యేకంగా రాసిన వ్యాసాలు లేవు నాకు తెలిసినంత వరకు. కాబట్టి ఆవిధంగా చూసినా కూడా తూలిక.నెట్ ఒక ప్రత్యేకమైన వెబ్‌సైటు. తెలుగు నుండి ఆంగ్లంలోకి అనువాదం చేసే ఆసక్తి గలవారికి ఆ వ్యాసాలు చాలా ఉపయోగపడతాయని స్వానుభవంతో చెప్పగలను. జెన్నీ భట్ అన్నావిడ ఆంగ్లంలో చేసే 'వి ఆర్ ఆల్ ట్రాన్స్‌లేటర్స్' న్యూస్ లెటర్‌కి నేను పెద్ద అభిమానిని. అంత ఆధునికంగా కాకపోయినా తూలిక.నెట్‌లో కూడా కావాల్సినంత సమాచారం ఉంది వర్తమాన అనువాదకులకి.

అయితే, ఇంకో భాషవాళ్లు ఇలాంటి ఎఫర్ట్ ఒకటి పెట్టి ఉంటే మనం కూడా వాళ్లతోపాటు ఆహా ఓహో అనేవాళ్లం. తూలిక.నెట్‌కి తెలుగువారి మధ్య ఆ స్థాయిలో గొప్ప పేరు రాలేదని నా అనుకోలు. పోయిన సంవత్సరం నేను తెలుగు కథలకి ఆంగ్లానువాదాలు మొదలుపెట్టాక మొదటి కథ తూలికలో వచ్చింది. అప్పట్లో నాకు ఒక శ్రేయోభిలాషి ఇచ్చిన సలహా- అంతా బాగుంది కానీ తూలిక.నెట్‌లో ఎందుకు? ఏదన్నా పేరున్న చోటకి పంపీ అని. ఎందుకు? అంటే, 'వాళ్ల కృషిని తప్పుపట్టను, కానీ ఇట్ ఈజ్ నాట్ ఫేమస్.' కానీ మన అనుకోళ్లతో తూలికకి సంబంధం లేదు. 2009-10 ప్రాంతాలలో ఒకసారి మాలతిగారు బెంగళూరు వచ్చినపుడు నేను కూడా ఆవిడతో కలిసి కొన్నిచోట్లకి తిరిగాను. సాహిత్య అకాడెమిలాంటిది ఏదో నిర్వహించిన సభకి కూడా వెళ్లాను. మాలతిగారి కృషిని వాళ్లంతా గౌరవించారు. అలాగే మాలతి గారు గతంలో ఒక ఇంటర్వ్యూలో అన్నారు జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాల నుండి తూలిక చదివి, అక్కడ అకడమిక్స్ సంప్రదించారు అని. ఇలాగే 2019 మొదట్లో ఒకసారి వర్డ్స్ విదవుట్ బార్డర్స్ అని ఒక ప్రముఖ వెబ్‌సైట్ ఉంది. వీళ్లు ఒకసారి తూలిక అడ్మిన్ ఐడికి ఈ మెయిల్ చేశారు. తెలుగు మీద ఫోకస్ చేస్తూ శీర్షిక చేయాలి అనుకుంటున్నాము, మీరు మాతో చేరండి అని. ఇదంతా ఇంత వివరంగా నాకెలా తెలుసు అంటే అప్పట్లో తూలిక అడ్మిన్ ఐడి నాకు రీడైరెక్ట్ అయింది కొన్నాళ్లు. నేను ప్రాంప్టుగా, 'ఇది మాలతిగారి ఈమెయిలు. వారిని సంప్రదించండి. తప్పకుండా ఈ తెలుగు ఫీచర్ చేయండి,' అని చెప్పి వదిలేసా. మళ్లీ వాళ్ల వెంటో, ఇటు మాలతి గారి వెంటో పడి ఆ పని అయిందోలేదో కనుక్కోకుండా అక్కడికి అది వదిలేసి నా పని నేను చేసుకోవడం నేను తెలుగుజాతికి చేసిన ఒక పెద్ద ద్రోహం అని చాలాసార్లు అనుకుంటూ ఉంటా. కనుక తెలుగువారి గుర్తింపు అటు పెడితే, బయటవాళ్లు గుర్తించారు. ఇది ఒక మనిషి నిలబెట్టిన వెబ్‌సైట్ అని కూడా గుర్తించారు.

మనకి అనువాదం అన్నది తెలుగులో సాహిత్యం అంటూ మొదట వచ్చి నప్పటి నుంచీ ఉంది. కానీ తెలుగు నుండి ఇతర భాషలలోకి చేసే అనువాదాలు

తక్కువే అనుకుంటాను. ఇపుడు మనం తమిళ్, కన్నడ ఇట్లా మన చుట్టుపక్కల భాషల నుంచి తరుచుగా మంచి అనువాదాలు రావడం, వాటికి అవార్డులు కూడా రావడం చూస్తున్నాము. వీటి మధ్య తెలుగు కనబడదు. ఎందుకు? అని ప్రశ్నించు కుంటే మూడు రకాల సమాధానాలు కనిపించాయి నాకు. 'అసలు వేరే భాషలవాళ్ల లాగ మనకి రిచ్ లిటరేచర్ లేదు అంతే,' అన్నది ఈ మధ్య కొంతమంది రాతల్లో చూసాను. 'మనకి మంచి రచనలు ఉన్నాయి, అనువాదకులు లేరు,' ఇది నేను అనుకుంటున్నది. 'అనువాదం బాగా చేస్తే చాలదు. మనల్ని మనం సేల్ చేసుకోవాలి, ఒక అనువాదం వస్తే ఎందుకు అది వేరే భాషల వాళ్లు చదవాలో కొంచెం అర్థవంతంగా చెప్పాలి,' అని మరొక సమాధానం. ఇది కూడా నాకు సబబు గానే తోస్తుంది. తూలిక విషయంలో మరొకటి కూడా అనిపిస్తుంది- నా అభిప్రాయంలో తెలుగువారి సాహిత్యాభిమానం అజెండా ఆధారితం. కథ బాగుందా... శిల్పం బాగుందా కథనం బాగుందా- ఇవి ఒక ఎత్తు. గిల్పం... అదే మన భావజాలానికి సెట్ అవడం... అదే ముఖ్యం. ఇది అలా అనువాదానికి కూడా అంటింది. ఒక భావజాలానికి సెట్ అయ్యే కథలు మాత్రమే అనువాదానికి అర్హం అనుకునే వారిని నేను చూసాను. అసలు ఫలానా కథ ఎందుకు అనువాదం చేసావు? రచయిత 'మన'వాడు/'మన'మనిషి కాదే? అని కూడా ఆమధ్య ఒకరు అడిగారు. అదోరకం ఖర్మ మనది. కనుక, మరి మనం ఇలాంటి రంగద్దాలు తొడుక్కుని కథని చూస్తూ ఫలానా రచయితో, అనువాదకుడో మన ప్రశంసకి, గుర్తింపుకి అర్హం అనుకోకపోతే మరి వారి రచనలను ఇంకో భాష వాళ్లకి మాత్రం చదవమని ఎలా చెబుతాము? అందుకే మరి తూలిక.నెట్‌కి నిశబ్దంగా 20 ఏళ్లు గడిచాయి అన్నది. నిశబ్దాన్ని ఛేదించాలి అంటే మనం తెలుగువాళ్లుగా ఏం చేయవచ్చు? అంటే అజెండాలు పక్కనపెట్టి బిగ్ పిక్చర్ ఆలోచిస్తే అర్థం అవుతుంది. మీకు ఎవరన్నా తెలుగేతర స్నేహితులు ఉండి, వాళ్లకి సాహిత్యం మీద ఆసక్తి ఉంటే తూలిక వెబ్‌సైట్ గురించి చెప్పండి. మీకు తీరిక, ఓపిక ఉంటే మాలతిగారితో మాట్లాడుకుని వెబ్ సైట్‌ని ఇప్పటి తరానికి ఆకర్షణీయంగా ఉండడానికి ఏమన్నా చేయొచ్చేమో చూడండి. నువ్వేం చెయ్యవా? అనకండి. నేను చేయగలిగింది నేను గతంలో చేశాను. మళ్లీ తీరిక ఉన్నపుడు చేస్తానేమో. చూద్దాము.





మాలతిగారి కథల్లో జీవన మాధుర్యం

వనజ తాతినేని

నిడదవోలు మాలతిగారిని నేను చదవడం మొదలెట్టి పన్నెండేళ్లు. కల్పనా రెంటాల తూర్పు-పడమర బ్లాగ్‌లోని లంకెలద్వారా మాలతిగారి కథల గురించి చదివాను. ఆ తరువాత అడపదడపా వారి కథలను చదవడం జరిగేది. ఆ కథల్లోని క్లుప్తత, గాఢత నన్ను బాగా ఆకర్షించింది. తర్వాత కాలంలో ఫేస్‌బుక్ ద్వారా ఆమె పరిచయం అయ్యారు. మాలతిగారి కథలే కాదు వారి రోజూవారీ అభిప్రాయాల్లో కూడా భావ గాంభీర్యం లోతైన ప్రకటన నన్ను పువ్వు చుట్టూ తిరిగే తుమ్మెదలాగా మార్చింది. ముఖ్యంగా నేను వ్రాస్తున్న విధానంలో మార్పు తీసుకువచ్చింది. వీలైనంత వరకూ ఆంగ్లం వాడకుండా తెలుగు రాయడానికి ఆ పరిచయం దోహదపడింది. అందుకు వారికి కృతజ్ఞతలు.

వర్ధమాన రచయితలకు మాలతిగారి రచనలు పాఠ్యాంశాలు. ఒక సంభాషణను క్లుప్తంగా అర్థవంతంగా స్పష్టంగా యెలా చెప్పగలం అన్నది ఆమె రచనల్లో చదివి తెలుసుకుంటాం. ఆమె కథలను మొదట కథ కోసం చదువుతాను. మళ్లీ రెండవసారి కథ యెలా రాసారు అన్నదాని కోసం, అవగాహన కోసం చదువుతాను. వాక్యానికి వాక్యానికి మధ్య చెప్పని కథ గురించి ఆలోచించేదాన్ని. మాలతిగారి కథల్లో చెప్పిన దానికన్నా పాఠకుల ఊహకు, అవగాహనను వదిలిపెట్టిన అంశమే ఎక్కువ వుంటుంది. మంచుదెబ్బ, అవేద్యాలు, జేబు, ప్రాప్తం, నిజానికీ ఫెమినిజానికి మధ్య, విషప్పురుగు, జీవనమాధుర్యం లాంటి కథలు మళ్లీ మళ్లీ

చదివిన కథలు. ఆ కథలు చదివిన వెంటనే స్పందించానో లేదో గుర్తులేదు. ఇప్పుడు వేదికపై మాట్లాడటం కోసం మళ్లీ మాలతిగారి రచనలు చదివి అభిప్రాయాలను వల్లె వేయాలని నేను అనుకోవడం లేదు. ఆమె రచనాకాలం నా వయస్సు కన్నా పెద్దది. మనసైనప్పుడు తీసి చదువుకోవడమే!

సామాన్య పాఠకురాలిగా ఒక రచన చదివిన వెంటనే నా స్పందనలో కొంత ఉద్విగ్నత, ఆవేశం వుంటుంది. అది తగ్గిన తర్వాత మరలా యింకోసారి చదవడం వలన కథ గురించి ఆలోచించడం మొదలుపెడతాను. ఇక అప్పుడు నా స్పందనను, అభిప్రాయాలను చెప్పవలసిన అవసరం లేదని అనుకుంటాను లేదా బద్ధకిస్తాను. రచయితకు యెవరైనా తమ రచనలను చదివి మెచ్చుకుంటే, చర్చిస్తే, ప్రత్యేకంగా గుర్తిస్తే చాలా సంతోషం కలుగుతుంది. ఇందుకు యెవరూ అతీతులు కారని నా అభిప్రాయం.

ఆరు దశాబ్దాల పైబడిన మాలతిగారి రచనావ్యాసంగం యెలాంటిదంటే, చెట్టు యొక్క వేర్లు భూమి లోపల విస్తరిస్తూ భూమిపైన కొమ్మల రూపంలో విస్తరించి నట్లు ఆమె కూడా తన అనుభవాల గాఢతను లోలోపలికి యింకింపజేసుకుని తనదైన శైలితో హృదయ సంస్కారంతో విశ్వజనీన భావాన్ని అంతరంగంలో విస్తరించు కుంటూనే బాహ్యంగా తన భావప్రకటనతో రచనలను పాఠకుల దరికి చేర్చారు.

చాలామంది రచనలు గొప్పగా వుండొచ్చు. రచన కన్నా రచయిత గొప్పవారు అయివుండవచ్చు. రచనలు రచయిత కూడా గొప్పగా నాకనిపించింది మాలతిగారిని చూసినప్పుడు. మాలతిగారి రచనల్లో సందేశం సూచనప్రాయంగానే వుంటుంది. రచయిత బలవంతంగా పాత్రలో ప్రవేశపెట్టిన నీతిసూత్రం యేదీ కనిపించదు. పాత్రలను సహజసిద్ధంగా పాఠకుడు స్వీకరిస్తాడు. నాకు తెలిసిన సమాజం యిది, ఈ మనుషులు యిట్లా వున్నారు, వారిని నా కథల్లో నవలల్లో యిలా వారిని పరిచయం చేయాలి అన్నట్టు కాకుండానే పాత్ర ఔచిత్యం యేమిటో స్పష్టంగా రేఖా ప్రాయంగా సూచిస్తారు, కాంతలాగా కావ్యం దిశానిర్దేశం చేయాలి కదా... అన్నట్టు. అది నాకు బాగా నచ్చుతుంది.

ఎన్నెమ్మ కథల్లో సంద్రాలు పాత్ర నాకు చాలా యిష్టం. రచయిత ప్రకటించ లేని అభిప్రాయాలను నిర్మొహమాటంగా అమాయకత్వం నింపుకున్నట్టు భ్రమింప జేసే గడుసుదనంతో ప్రశ్నిస్తుంది. తీర్పును ప్రకటిస్తుంది. రచయిత మార్కు పాత్ర అలా పాఠకుల మనసుల్లో తిష్ట వేసుకోవడం రచయిత విజయంగా మనం భావించాలి.

కథల్లో దేశీయత యెంతో నిండుకుని వుంటుంది. పాత్రల మనస్తత్వాల లోగుట్టును కూడా చిన్న వాక్యాల ద్వారా పరిచయం చేసేస్తారు. రంగు తోలు, నిజానికి ఫెమినిజానికి మధ్య లాంటి డయాస్పోరా కథలు మనను ఆలోచింపజేస్తే చాతక పక్షులు, మార్పు నవలలు రెండూ జీవన వైరుధ్యాలను కూడా రికార్డ్ చేసి రెండు సంస్కృతుల మధ్య నలిగిపోయి యెప్పుడూ సందిగ్దంలో నడక సాగించే రెండు తరాల ప్రతినిధులను కూడా మనకు పరిచయం చేసారు. స్వగతం లాంటి ప్రకటనకు అవకాశం లేని అవసరమైన అర్థవంతమైన చర్చను చేసారు. నేనింకా మాలతిగారి రచనలు అన్నీ చదవలేదు.

మన తెలుగు సంకలనాల్లో మాలతిగారి కథలు అంతగా కనిపించని లోటును పత్రికలు పునఃప్రచురించి పాఠకులకు పరిచయం చేయాల్సిన అవసరం వుంది.

తూలిక బ్లాగ్ గురించి యెంత చెప్పినా తక్కువే! మాలతిగారు ఆమె రచనలతో పాటు ఆంగ్లంలోకి అనువదించిన తెలుగు కథలు, పరిచయ వ్యాసాలు అన్నీ భద్రపరిచి భావితరాలకు వొక శాశ్వత నిధిని సమకూర్చారు. అందుకు ఆమె యెంతో అభినందనీయురాలు. మాలతిగారి విశేషకృషి చూసినప్పుడు ఆమెకు తగిన సహకారం మన తెలుగు సాహిత్యపీఠాల నుండి లభించడం తక్కువని తెలిసినప్పుడు... వొక మాట అనుకున్నాను.. ఆమె బాట పక్కన మలుపులో వొంటరిగా నిలబడి కాంతులిచ్చే వీధిదీపంలాంటిదని. ఆ దీపం వెలుగుల్లో మనమందరం తెలుగును వెలిగించుకోవాలి. మసకబారకుండా కాపాడుకోవాలి.

ఎంత బాగా రాసినా తమ రచనలు గుర్తింపబడనప్పుడు రచయితలకు వైరాగ్యం వస్తుంది. అందంగా పరిమళాలు వెదజల్లే పువ్వులు, నిండుగా వర్షించే మేఘాలు వున్నచోటనే కొన్ని గడ్డిపూలు, కురవని మేఘాలు వుంటాయి.

వాటి ఉనికి వాటికీ వుంటుందిలే అని అనుకునే ఉదాసీనతకల రచయితలు వుంటారేమో! కానీ నా అభిప్రాయంలో ఆమె అలాంటి ఉదాసీన రచయిత కాదు. రాసిన ప్రతిదాన్ని ఆమె జాగ్రత్తగా భద్రపరిచారు. నిజానికి ఆమె సృజించిన సాహిత్యానికి అనువాదాలకు తగిన గుర్తింపు రాలేదనే చెప్పాలి. సాహిత్య సంఘాల ముఠాకోరు వైఖరి వల్ల మాలతిగారిని గుర్తించడానికి అభ్యంతరాలు చెప్పి, గుర్తించినా వెలుగులోకి రానీకుండా నిర్లక్ష్యం చేసారు.

అందుకు ఉదాహరణే... మునిపల్లె రాజుగారి కథల ఆంగ్ల అనువాదం ఇప్పటికి ప్రచురణలోకి రాకపోవడం. సాహిత్య అకాడమీ తెలుగు విభాగం సభ్యులు శ్రద్ధ వహిస్తే అదెంత చిన్న విషయమో కదా అనిపించింది.

సాహిత్యంలో యెవరికి లభించిన గుర్తింపు వారిదే. నాకు లభించిన గుర్తింపే నా గుర్తింపు అని వినయంగా ప్రకటించుకునే మాలతిగారికి కవయిత్రి 'మొల్ల పురస్కారం' లభించిన సంధర్భంగా వారికి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు. ఈ పురస్కారం అందించిన మొల్ల పురస్కార కమిటీ నిర్వాహకులకు అభినందనలు.

Old order must give place to the new order. And the new order can never adapt it self to the old.

'పాతవాళ్లను కొత్త తరం గౌరవిస్తుంది కానీ అనుసరించదు,' అంటాడు జీవన మాధుర్యం కథలో అల్లుడు రమణారావు. సాహిత్యం విషయంలో అది నిజం కాదేమో! ఆధునిక సాహిత్య స్రవంతిలో యిప్పుడు కనబడుతున్న క్లుప్తత, లోతులను, నవ్యతలను మాలతిగారు యెప్పుడో సాధించారని నా అభిప్రాయం.

మాలతిగారి గురించి యీ నాలుగు మాటలు చెప్పడం కూడా నేను వొక యోగ్యతాపత్రంగా భావిస్తూ... నిడదవోలు మాలతిగారికి నమస్సులతో... కల్పనా రెంటాలగారికి ధన్యవాదాలతో...





మళ్లీ మళ్లీ చదివింపచేసే కథలు

విజయ కర్రా

నిడదవోలు మాలతిగారిని మొల్ల సత్కారంతో సన్మానించిన వేదికపైన 'కథలలో మాలతిగారి వాక్యం మరి సంభాషణలు' అన్న విషయం పై నేను చెప్పిన నాలుగు మాటలు ఇక్కడ వ్రాస్తున్నాను.

సాహిత్యం చదవడం అన్నది నాకు ఎంతో ఇష్టమైన అభిరుచి. కొద్దిమంది రచయితల పరిచయాలు, సాంగత్యం ఈ మధ్యకాలంలో సోషల్ మీడియా ఇచ్చిన అవకాశం. సాహిత్యసభలలో ప్రసంగించడం అన్నది నాకు చాలా కొత్త. అందుకని మాలతిగారి మొల్ల సత్కారం సన్మానసభలో మాట్లాడమన్నప్పుడు క్లుప్తంగా నేను చెప్పగలిగే విషయాన్ని ఎంచుకున్నాను.

కథ మొదలు పెట్టగానే నన్ను ఆకట్టుకునేవి రచనా శైలి, కథ చెప్పిన తీరు. చక్కని వాక్యాన్ని నేను ఎక్కువగా ఇష్టపడతాను. ఆరకంగా నిడదవోలు మాలతిగారి రచనలు నాకు చాలా నచ్చుతాయి. మాలతిగారివి, ముళ్లపూడిగారివి, భమిడిపాటి జగన్నాథంగారివి కొన్ని కొన్ని కథలు నా మనసులో నిలిచి పోవడానికి కారణం వాళ్ల వాక్యమే. సరళంగా వుండి చాలా సహజంగా హాయిగా అనిపించే వాక్య నిర్మాణం మాలతిగారిది. ఎంతో విస్తృతం అయినవి ఆమె రచనలు- అందులో కొన్ని కథలు, కవితల నుండి నాకు నచ్చిన వాక్యాలు, ఎందుకు నచ్చాయి అన్న కారణాలతో సహా మీతో పంచుకుంటాను.

మొదటి ఉదాహరణగా కొన్ని ఆకట్టుకునే వాక్యాలు లేదా ఆలోచింపచేసే వాక్యాలు చూద్దాం.

'విపర్యయము' అన్న కవితలోది ఈ వాక్యం. 'సమాజంతో తెగతెంపులు చేసుకోవాలనుకున్న నిర్ణయం ఒక్కరోజు అనుభవంతో హతం.' ఎంత నిజం కదా! ఎన్నో ఆలోచనలు, నిర్ణయాలు గాలిలో రూపుదిద్దుకుంటూ వుండగానే పేకమేడల వలె కూలిపోవడం ప్రతి మనిషికి అనుభవమే. కానీ దాన్ని వ్యక్తీకరించడం, పదునైన వాక్యంగా వ్రాయడం మాత్రం మాలతిగారికే చెల్లు.

అలాంటిదే మరో లోతైన, పదునైన వాక్యం- 'ఏమాత్రమో మిగిలిన చివరి తల్లివేరు కూడా ఆ ఛీత్కారంతో మాడిపోయింది.' ఎంతగానో ఆలోచింపచేసే వాక్యం. మనసును కలచివేసే వాక్యం.

అందమైన వాక్యానికి ఉదాహరణగా నేనెంచుకున్నది 'మా మే స్త్రీత్వమ్' కథలోని ఈ వర్ణన. 'ఆమె ఎలా వొచ్చిందో ఎందుకు వచ్చిందో ఎవరికీ తెలియదు. ఒకానొక సుప్రభాతాన ఊరు ఆవులించి కళ్లు విప్పితే ఆమె కనిపించింది. అంతే.' మన వాక్యం పదును పెట్టుకోవాలంటే ఇలాంటివి చదివి తీరాలి కదా!

మన ఇళ్లల్లో ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాన్నిబట్టి, అలవాట్లనిబట్టి కొన్ని కొన్ని సరదా మాటలో, ఆటపట్టించే మాటలో వాళ్లకి అన్వయించడం జరుగుతుంటుంది. తాతగారు తుమ్మితే గాజుగిన్నె పగిలిపోయిందని చెప్పడంలాంటిది. అలాంటిదే ఓ పిన్ని మాట్లాడే తరహాన్ని మాలతిగారు 'ముగ్ధ' కథలో చెప్పే అనేక వాక్యాలలో ఓ వాక్యం- 'పిన్ని మాట్లాడుతుంటే సుడిగాలికి చెరుకుతోట ఫెళఫెళ్లాడినట్లుంటుంది.'

నిజానికి మాటలతో, వాక్యాలతో మాలతిగారు అలవోకగా చెడుగుడు ఆడుకుంటారు. అలాంటివి ఆమె కథలలో అడుగడుగునా ఎదురవుతాయి. మచ్చుకి కొన్ని చెపుతాను.

> *'నాకెందుకో ఆవిడ మోహం చూడాలనిపించింది. చూడలేనని పించింది.'*
>
> *'కానీ, కాంతలే కన్ను మూసి తెరిచేలోగా కాంతుల జేబులో బొమ్మ లయిపోతారని వాళ్లకి తెలియదు.'*

వినేవారికి చెప్పేవారు లోకువ అన్నది మనకి బాగా తెలిసిన సామెత. కానీ 'అసలైన విషాదం' కథలో ఇదే విషయం ఆమె తిరగేసి చెపుతారు. 'నిజానికి ఇంటర్వ్యూ చేసేవాళ్లని చూస్తే నాకు జాలేస్తుంది. మనం ఏది చెపితే అది వినాల్సిందే కదా వాళ్లు.' ఈ రకమైన అభిప్రాయంతో ఇంటర్వ్యూలకి వెళితే ఎవరికి ఎలాంటి ఒత్తిడి వుండదు కదా!

కథ ప్రారంభంలోనే స్థలం మరి సమయం చెప్పడం అన్నది ఓ మంచి లక్షణం అంటారు. మాలతిగారి 'నడుస్తున్న చరిత్ర' కథ ఇలా ప్రారంభం అవుతుంది. 'నవంబర్ ఒకటో తారీఖు అంది కేలండర్. ఆరు అంది గోడనున్న గడియారం. సాయంత్రం వేళ అది.'

మాలతిగారి జాలపంచాంగము అన్న కవితలో ఈ వాక్యాలు భలే సరదాగా వుంటాయి. జాలవారం- ఉదయం ఆరు నుండి తొమ్మిది వరకూ విశేషచూపులు. సాయంత్రము సాధారణము, వ్యాఖ్యలు అంతంతమాత్రము. (నా పోస్టులకి వ్యాఖ్యలు ఎల్లప్పుడు అంతంతమాత్రమే అనుకోండి.)

ఆఖరి శుద్ధప్రతి (గల్పిక)లో చెప్పిన ఆణిముత్యంలాంటి వాక్యం- 'అసలు తెలుగుకథ ఎలా రాయాలో తెలియాలంటే ఇంగ్లీషుకథలు చదవాలన్న మీ అభిప్రాయం ఫ్రేము కట్టి నాపడగ్గదిలో పెట్టుకున్నాను.' ఇది చదవగానే పదే పదే ఇంగ్లీష్ మరి ఇతర దేశ బాషల రచయితలని ఆకాశానికి ఎత్తేస్తూ- తెలుగు రచయితలను చిన్నబుచ్చాలని ప్రయత్నం చేసేవాళ్లు మనకి గుర్తుకొస్తారు.

మాలతిగారి కథల నుండి ఇప్పుడు కొన్ని సంభాషణలు చూద్దాం.

మాలతిగారి సంభాషణలని బట్టి మనం ఆ కథ పరిసరాలని, ఆ పాత్రల మనస్తత్వాలని, ఆహార్యాన్ని సులువుగా ఊహించుకోవచ్చు. ఉదాహరణకి 'ఆ తోటలో' కథ చదువుతుంటే ఆ డాబా ఇల్లు, వీధి గుమ్మం, వంటిల్లు దాటి, వెనుక పెరడు, అక్కడ బొప్పాయిచెట్లు, కథలో ప్రధానపాత్ర అయిన సంపెంగ చెట్టు అన్నీ కళ్ల ముందు వుంటాయి. చదివినప్పుడు నేను పుట్టి పెరిగిన ప్రదేశాలు, బంధువుల ఇళ్లు అన్నీ తిరిగి కళ్ల ముందుకి వచ్చినట్లనిపించింది. ఇక ఆ సంభాషణలు మా ఇంట్లో మేము మాట్లాడుకున్నట్లే వుంటాయి. అందుకనే నాకైతే మాలతిగారి కథలలో ఎన్నో పాత్రలు చాలా దగ్గరవాళ్లో, బాగా తెలిసినవాళ్లో అనిపిస్తారు.

కొన్ని ఉదహారణాలు చెపితే మీరు కూడా నాతో ఏకీభవిస్తారు. మన ఇళ్లలో చెల్లిని ఏడిపించే అన్నో, తమ్ముడో, మరో కజినో సర్వసాధారణం. అందుకే ఎలాంటి వాక్యాలు మనకి చిరపరిచితంగా, దగ్గరగా అనిపిస్తాయో చూడండి. 'గారాబం' కథలో ఓ అన్నయ్య మాట. 'మా అన్నయ్య నా దగ్గరకు వచ్చి, నీ సంగీతం చరమదశ నందుకుంది. ఇహ సాధన అవుసరం లేదు. ఇదిగో బిరుదు, అన్నాడు. గ్లేజు పేపర్ మీద అందంగా దిద్దిన అక్షరాలు నా కళ్లు మెరిపించాయి. 'గానకాకి' అని వుంది దానిమీద.'

చిన్నతనంలో సరదా కబుర్లు, సమయం సందర్భం లేకుండా వేసుకునే జోకులు ఎవరి వద్దయినా చెల్లేవి కానీ మా అమ్మ దగ్గర మాత్రంకాదు. ఆవిడ కళ్లెత్తి

చూస్తే చాలు నోట్లో మాట నోట్లోనే ఆగిపోయేది. మాలతిగారి 'మా తోటలో' కథలో అమ్మ అంటుంది కదా- 'ఊ - బాగుందిలే సరసం . కల్లాకపటం లేకపోతే కన్నతల్లితో సరసం ఆడమని అంది అమ్మ.' చదవగానే ఆహా అనుకున్నాను! నాకు మా అమ్మ గుర్తుకు వచ్చేసింది.

సోషల్ మీడియా అంటూ వచ్చాక మంచికో చెడుకో రచయితల మరి పాఠకుల మధ్య దూరం తగ్గిపోయింది. కొన్ని కొన్నిచోట్ల కథలకు వారి వాక్యాలు శృతి మించినట్లు వుంటే మరికొన్ని సార్లు సాహిత్యవనంలోకి కాక ఏదో యుద్ధరంగం లోకి అడుగు పెట్టినట్లు అనిపిస్తుంది. ఇలాంటి వాటిపైన మాలతిగారు చాలా చూసి వుంటారు కనుక చక్కటి వ్యంగంతో 'రాద్ధాంతం పై సిద్ధాంతం' కథలో ఇలా అంటారు- 'ముక్కోటి ఆంధ్రులలో ఏ ఒక్కడికి పోలిక లేకుండా రాయడం కష్టమే. అందుకే ఒక సిద్ధాంతం చేసుకున్నా. ఇహ మీద ఏదీ సూటిగా తేల్చక, ముంచక, మధ్యస్తంగా నాన్చాలి, అని.'

చదివేవాళ్లం, రాసేవాళ్లం మనకంటూ ఏర్పరచుకున్న ఓ ప్రత్యేక ప్రపంచంలో జీవిస్తూ వుంటాం. పరిసరాలను మరచి ఆ లోకంలో మునిగి వుండే మనం బహుశా ఇతరులకి పిచ్చివారిలా కనిపిస్తాం. అదే విషయాన్ని మాలతిగారు ఇలా హృద్యంగా చెపుతారు.

ఎందుకు రాయడం అంటే -
ఒక సుందర సురుచిరస్వప్నం
నిత్యానందం ఆత్మానందం
ఒక పిచ్చి, వ్యసనం
ఏదైనా కావొచ్చు కానీ నిరర్థకం కాదు, నిష్ఫలం కాదు.

మనసుకు నచ్చే కథలు, మళ్లీ మళ్లీ చదివింపచేసే కథలు ఇచ్చిన మాలతి గారికి అనేక ధన్యవాదాలు చెపుతూ... మొల్ల సత్కార గ్రహీతలైన వారికి మనసారా అభినందనలు తెలియజేస్తున్నాను.



మార్పుల్ని పట్టి చూపిన మాలతిగారి కథలు

శ్రీనిధి యెల్లాల

డెబ్బై వసంతాలుగా సాహితీ సౌరభాలు వెదజల్లుతూ తెలుగు సాహిత్యంలో తనదంటూ ఒక ప్రత్యేక ముద్రని వేసిన నిడదవోలు మాలతిగారికి 'మొల్ల పురస్కారం' ప్రథమంగా అందివ్వడం ఎంతో సంతోషంగా వుంది. ఈ సభని ఏర్పాటుచేసి ఇలా తెలుగు రచయిత్రులని గౌరవించాలని తలపెట్టిన కల్పనా రెంటాలగారికి అభినందనలు. మాలతిగారి రచనలను చదివి ఆనందించడమే కాకుండా ఆవిడకి జరిగిన 'మొల్ల సత్కారసభ'లో పాల్గొనడం నాకు ఎంతో ఆనందంగానూ గర్వకారణం గానూ ఉంది.

మాలతిగారి రచనల్లో నుండి నాకు నచ్చిన కొన్ని కథలను ఈ కార్యక్రమంలో చెప్పాలని అనుకుంటున్నాను. మాలతిగారి కథలు, చదివి ఆనందించేవారికే కాకుండా కథలు వ్రాద్దాం అనుకునేవారికి కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. ఆవిడ జీవితంలోని వివిధ దశల్లో వచ్చిన కథలు అప్పటి దేశ కాల పరిస్థితులని, మనుషుల్లోను వ్యవహారాల్లోనూ వచ్చిన మార్పును పట్టి చూపిస్తాయి. ఆవిడ కథల్లో వాక్య నిర్మాణం, చక్కని భాషా, తెలుగు నుడికారం కథ చెప్పే విధానంతో కలిసి చదివేవారికి ఒక చక్కని అనుభూతిని ఇస్తాయి. నాకు ముఖ్యంగా ఆవిడ కథల్లో ఉండే సరళమైన భాష ఎంతో ఇష్టం. అలాగే ఆవిడ చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా చెప్పే తీరు, అందులోని వ్యంగ్యం హాస్యస్ఫోరకంగా ఉండటమే కాకుండా చెప్పవలసిన విషయాన్ని ఖచ్చితంగా గుచ్చి మరీ చూపిస్తాయి. సందర్భోచితంగా

వచ్చే సామెతలు, జాతీయాలు కూడా మాలతిగారి కథల్లో ప్రత్యేకంగా గమనించ వచ్చు. తేటతెలుగు నుడికారం ఆవిడ కథల్లోని ప్రత్యేకత. అందులో నాకు నచ్చిన కథలు-

'కథల అత్తయ్యగారు' కథలో మాలతిగారి చిన్నతనం, అప్పటి మనుషుల మధ్య అనుబంధాలు చక్కగా చూపించారు. సరళమైన భాషతో 'చిలకల కొలికి చిన్నదానా బొమ్మలు బువ్వలు తిందురటే,' అనేటువంటి చక్కని నుడికారాలతో ఆనాటి తెలుగు లోగిళ్లలోకి తీసుకుని వెళ్తుంది ఈ కథ. మాలతిగారి కథల్లో వచ్చే కొన్ని పిట్టకథలు తెలుగుభాష పట్ల కొత్త ఇష్టాన్ని, ఉత్సాహాన్ని రేకెత్తిస్తాయి అనడంలో సందేహం లేదు.

నాకు నచ్చిన మాలతిగారి కథల్లో ఇంకొకటి 'జేబు.' బడిలో చదువుకునే పరిమళ అనే అమ్మాయికి పెన్సిలు, రబ్బరు దాచుకోడానికి ఒక జేబు ఎందుకు కుట్టించుకోకూడదు? అని కలిగిన సందేహం నుండి పుట్టిన కథ. ఈ కథలో నేపథ్యం, నిగూఢంగా దాగిన వ్యంగ్యం, చివరిగా పెద్దయ్యాక మాస్టారుకి, పరిమళకి మధ్య జరిగే సంభాషణ హృదయాన్ని హత్తుకుంటాయి.

'సిద్ధాంతాలు-రాద్ధాంతాలు' అనే కథ కూడా చాలా బాగుంటుంది. మాలతి గారి కథలు కూడా పెద్దగా రాద్ధాంతం చెయ్యకుండానే చెప్పవలసిన సిద్ధాంతాలని సున్నితంగా స్పష్టంగా సూటిగా చెప్తాయి. ఈ కోవలోకి చేరే కథే 'ఉత్తమ ఇల్లాలు.' ఇందులోని పాత్ర ఎన్నో ఏళ్లుగా పాతుకుపోయిన భావజాలాలని మార్చడానికి విఫల ప్రయత్నాలేమీ చేయదు. అందుకుగాను కొత్త తరాన్ని అటువంటి జాడ్యాలకు దూరంగా వాటిని కనిపెట్టే నేర్పుని తెలుసుకునేలా తయారుచేస్తుంది. ఇదొక అద్భుతమైన కథ, కాలదోషం పట్టని కథ.

అలాగే 'మా తోటలో', 'వకుళాదేవి డైరీ', 'మంచుదెబ్బ', 'చిరుచక్రం' లాంటి కథలు అప్పటికాలంలో వున్న సమస్యలను, నేపథ్యాలను, తెలుగు లోగిళ్లను మనకు కళ్లకి కట్టినట్టు చూపుతాయి. భాష ఒక జాతి ప్రజల సాంప్రదాయ వ్యవహారాలను, సంస్కృతిని, జీవనశైలిని తెలిపే సాధనం అయితే, మాలతిగారి కథలు ఆ సాధనాన్ని అత్యంత నేర్పుతో ఉపయోగించి కథలను సృష్టించి తెలుగు ప్రజల జీవనశైలిని సజీవంగా మనకి చూపిస్తాయి.

ఆపైన మాలతిగారు తన జీవన ప్రయాణంలో అమెరికాకి రావడంతో ఇక్కడి తెలుగువారి జీవితాలు అలాగే ఇక్కడి దేశ ప్రజల జీవన విధానాలు, ప్రవాసులపై వాటి ప్రభావాలని కూడా చక్కగా తన కథల్లో పొందుపరిచారు. 'శివుడాజ్ఞ'. 'నీకోసం', 'పెద్దతనం' వంటి కథల్లో ప్రవాస భారతీయ జీవన విధానాల పోకడలను మనం

గమనించవచ్చు. మారుతున్న విలువలు అనేవి తరాలవారీగా వస్తున్న మనుషుల ఆలోచనల మార్పు వల్ల తప్ప దేశాలవారీగా మనుషులంతా ఒక్కటే అని చెప్పే నిడదవోలు మాలతిగారి కథలు మనసుకు హత్తుకుని మన గురించి మనం ఆలోచించుకునేలా చేస్తాయి.

రాబోయే తరాల వారికోసం కూడా తన రచనావ్యాసంగం సమస్తాన్ని తన బ్లాగ్ 'తెలుగు తూలిక'లో పదిలపరిచిన మాలతిగారి కృషి అభినందనీయం. తెలుగు కథలు చదవాలి, రాయాలి అనుకునే కొత్త తరానికి నిడదవోలు మాలతి కథలు ఎంతో సహాయం చేస్తాయి అనడం అతిశయోక్తి కాదు. చక్కని వాక్య నిర్మాణం, శైలి, శిల్పాలతోపాటు మనదైన తెలుగు నేపథ్యం అంతర్లీనంగా కథ మొత్తంగా మెరిసే రచయిత ఆలోచన ఒక చక్కని అనుభూతిని పాఠకులకి అందిస్తాయి.

మాలతిగారి కథలు చదవడాన్ని నేను ఎంతో ఆనందిస్తాను. ఆవిడకి దక్కిన ఈ 'మొల్ల పురస్కారానికి' మరొక్కసారి అభినందనలు తెలుపుతున్నాను.





విమర్శ వ్యాసాలలో మాలతి విశేషకృషి

సిహెచ్. సుశీల

70 ఏళ్లకు పైగా కథలు, గల్పికలు, అనువాదాలు, విమర్శ వ్యాసాలు రాస్తూ, తన జ్ఞాపకాలను 'ఎన్నెమ్మ కతలు'గా నాలుగు సంపుటాలు తెచ్చి, 'తెలుగు తూలిక' బ్లాగ్‌లో భద్రపరుస్తూ, తనకు తోచినట్టు, న్యాయమనిపించే విషయాలను సూటిగా వ్యక్తపరుస్తూ, ఒకచో వ్యంగ్యమనే సున్నితమైన తూలికతో తడుతూ రాసుకుపోయే సీనియర్ రచయిత్రి నిడదవోలు మాలతిగారికి 'మొల్ల' సత్కారం అందిస్తున్న సందర్భంగా హృదయపూర్వక అభినందనలు.

మాలతి గారు రచించిన విమర్శ వ్యాసాలలో ఏడుగురు కవయిత్రులు, రచయిత్రులు గురించి రాసినవి నేను విశ్లేషించదలుచుకొన్నాను.

1. తరిగొండ వెంగమాంబ
2. కనుపర్తి వరలక్ష్మమ్మ
3. ఊటుకూరు లక్ష్మీకాన్తమ్మ
4. తెన్నేటి హేమలత
5. నాయని కృష్ణకుమారి
6. శివరాజు సుబ్బలక్ష్మి
7. ద్వివేదుల విశాలాక్షి

తరిగొండ వెంగమాంబ

వెంగమాంబ తను జీవించిన కాలంలో ఒక విప్లవమనే చెప్పాలి. 'కష్టాలు జీవితంలో భాగం. వాటిని అధిగమించి, తమ జీవితాన్ని స్ఫూర్తిదాయకంగా ఫలవంతంగా మలుచుకోవటంలోనే వ్యక్తిత్వాలు రుజువు అవుతాయి,' అన్నది నిడదవోలు మాలతిగారి స్థిరమైన అభిప్రాయం. ఆ కోణంలోనే తరిగొండ వెంగమాంబ జీవితం, సాహిత్యం ఆమెని ఆకర్షించి వుంటాయి. 18వ శతాబ్దంలో కడప జిల్లాలో జన్మించిన వెంగమాంబ జీవిత కథ అందరికీ తెలిసిందే.

వెంగమాంబ దాదాపు 20 గ్రంథాలు రచించారు. తొలి రచన నృసింహ పురాణం అయినా, వెంకటాచల మహత్యం సుప్రసిద్ధమైన రచన. కావ్యం, నాటకం, ద్విపద, యక్షగానం, శతకం వంటి వివిధ ప్రక్రియలలో రచనలు చేసిన వెంగమాంబను గురించి చెప్తూ మాలతిగారు, 'బాహ్యాడంబరాలు వేరు, నైతిక విలువలు వేరు. ఆ భేదాన్ని కొన్ని వేల సంవత్సరాలుగా ఎత్తిచూపుతున్నాయి మన కథలు,' అంటారు.

కనుపర్తి వరలక్ష్మమ్మ

సంఘసేవా తత్పరురాలు, రచయిత్రి, స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న కనుపర్తి వరలక్ష్మమ్మగారి జీవితం, రచనలు గురించి చెబుతూ, 'ఆమె సామాజిక విలువలు, వ్యక్తిత్వము తన రచనల్లో వ్యక్తమవుతాయి,' అంటారు మాలతి. వరలక్ష్మమ్మగారి తొలి నవల 'వసుమతి' కల్పిత కథ కాదు. తన తల్లితో ఒక దీనురాలు చెప్పుకున్న హృదయ విదారక గాథ. తన 14 ఏట విన్న ఆ కథని 18వ ఏట రాశారు వరలక్ష్మమ్మ. కానీ 29వ ఏట మాత్రమే ప్రచురించగలిగారు. 'వరలక్ష్యమ్మగారి కథనరీతి, సందర్భానుసారం కథలో పొందుపరిచిన సాంఘిక పరిస్థితులు, వాటిపై ఆమె వ్యాఖ్యానాలు తనను ఆకట్టుకున్నాయి,' అంటారు మాలతి.

'కథ ఎట్లా ఉండాలె' అనే చిన్న కథ భార్యాభర్తల మధ్య సంభాషణగా నడుస్తుంది. ఆ సంభాషణలో, 'కథ ఎలా ఉండాలో చెప్పటమేకాక, విమర్శకులు వస్తునిష్టలో కాక వ్యక్తిగత స్నేహాలు ప్రాతిపదికగా ఇస్తినమ్మ పుచ్చుకొంటినమ్మా వాయనం అన్న పద్ధతిలో సమీక్షలు రాసి ప్రచురిస్తున్నారు,' అన్న వ్యాఖ్యానం ఉంది. దాదాపు 60 ఏళ్ల క్రితం ఆమె ఆ విమర్శకుల ధోరణి వెక్కిరించడం తనకు నచ్చిందనీ, ఈనాటికీ అన్వయించుకోవచ్చు అంటారు మాలతి. కథకి ఉండాల్సిన కొలమానాలు- కుతూహలం రేకెత్తించే ప్రారంభం, అద్భుతమైన ముగింపు వంటివి లేకపోవచ్చు కానీ, ఇది కథే అని తీర్మానించారు మాలతి. కుటీర లక్ష్మి, విశ్వామిత్ర

కథలను కూడా స్పృశిస్తూ, 'వరలక్ష్మమ్మగారి అచ్చ తెలుగు నుడికారం, పదకేళి తనను ఆకర్షించింది,' అంటారు.

ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ

'సాహితీ రుద్రమ' అని దేవులపల్లి రామానుజరావుగారిచే కొనియాడబడిన ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారి గురించి చెబుతూ, 'రుద్రమ కత్తి ఝళిపించినట్లు లక్ష్మీకాంతమ్మగారు కలం ఝళిపించారు,' అంటారు మాలతి.

దాదాపు 6 దశాబ్దాల పాటు సాహిత్యకృషి చేసి, వందలకొద్దీ సమావేశాల్లో పాల్గొని, సెనేట్ సభ్యత్వాలు, అధ్యక్ష పదవులు చేపట్టి, అనేక సాంఘిక సేవా కార్య క్రమాలు నిర్వహించి ఆధునిక తెలుగు రచయిత్రులలో కనకాభిషేకం, గజారోహణం వంటి ఘన సత్కారాలు పొందినది లక్ష్మీకాన్తమ్మగారు ఒక్కరే అంటారు మాలతి.

'ఆంధ్ర కవయిత్రులు'లో 264 మంది రచయిత్రులను ఎంతో పరిశోధన చేసి సాధికారకంగా గ్రంథస్తం చేసిన ఘనత లక్ష్మీకాన్తమ్మగారిదే. కానీ రెండవ ముద్రణనాటికి ఖర్చులకు వెరచి, 86 మందికి కుదించటం విచారించదగ్గ విషయం. సాహిత్య అకాడమీల వంటి సంస్థలు ఇది గుర్తించి స్త్రీ రచనల వివరాలకు ప్రాధాన్య మిచ్చి ఈ సంపూర్ణ గ్రంథ ప్రచురణకి ఏర్పాటుచేస్తే బాగుంటుందన్న మాలతిగారి సూచన నెరవేరితే తెలుగు సాహిత్యలోకానికి ఎంతో మేలు జరుగుతుంది.

లక్ష్మీకాన్తమ్మగారి ఊహాజనిత నాటకం 'సరస్వతీ సామ్రాజ్య వైభవం' అద్భుతం అనే సందర్భంలో మాలతిగారు ఆమెతో పరిచయం తనకు 1968, 69లలో ఆంధ్ర రచయిత్రుల సభలో జరిగిందని సంతోషంగా తెలిపారు.

తెన్నేటి హేమలత

విలక్షణమైన జీవితం, భావజాలంతో కూడి 'లత' అనే రెండక్షరాల పొట్టి పేరుతో ప్రాచుర్యం పొందిన 'జానకీ రమా కృష్ణవేణీ హేమలత' ఆ రోజుల్లో రచనా వ్యాసంగం ద్వారా చెప్పుకోదగ్గ ఆదాయం కలిగిన కొద్దిమంది రచయిత్రులలో ఒకరు.

లత అనగానే మొదట గుర్తుకు వచ్చేది మోహనవంశీ. చాలా చిన్నతనంలోనే ప్రారంభమైన తాత్త్వికచింతన, అంతరంగ సంక్షోభం, అలౌకిక ప్రేమకోసం ఆమె పడిన తపన మోహనవంశీలో చూడవచ్చు అంటారు మాలతి. 'అందులో కొన్ని వాక్యాలు కలగాపులగంగా కనిపించి పాఠకుడిని గందరగోళపరుస్తాయి. వాక్యాలు అసంపూర్ణం. వ్యాకరణం అయోమయం. అదొక చైతన్యస్రవంతిలా సాగిపోతుంది. దాన్ని మనం ఆమె మనసులో కలిగిన అలజడిగా అంతఃక్షోభగా అర్థం చేసుకోవాలి,' అంటారు. రచయితని అర్థం చేసుకునే సహృదయురాలు మాలతి.

ఆమె రచనల్లో విశృంఖలత్వం ఆమె మనోవేదనలోంచి పుట్టింది. ఆపైన పండితులు, పాఠకులు చేసిన బాధ్యతలేని వ్యాఖ్యలతో విసిగి, లోకంమీద తిరుగుబాటు ప్రకటించినట్టు కనిపిస్తుంది అన్న మాలతిగారి వ్యాఖ్య యదార్థమే. మగవాళ్లు బాధ్యతలు విస్మరించి గాలిలో విశృంఖలంగా తేలిపోయే గాలిబుడగ లాంటి వారనీ, వారి వల్ల స్త్రీ జీవితాలు నీటి బుడగల్లా చితికిపోతాయని లత అంటారు 'గాలి పడగలు నీటి బుడగలు' నవలలో. 'లతకి చలానికి సామ్యం చూపటం సాధారణమైపోయింది ఆ రోజుల్లోనే. కానీ లత నవలల్లో వస్తు వైవిధ్యం, జన సామాన్యాన్ని ఇతోధికంగా ఆకట్టుకోవటానికి కారణం ఆ నవలల్లోని వాస్తవికత. సహజంగానే మనకు కుళ్లును చూడటం నచ్చదు. సంఘంలో ఇంత కుళ్లు ఉందని ఒప్పుకోవడానికి మనసొప్పదు. ఈ ధోరణి సౌందర్యారాధకులలో మరీ ఎక్కువ. ఆశ్చర్యం ఏమిటంటే కుళ్లును కడిగే మాట పక్కన ఉంచి ఆ రాచపుండుని బహిరంగంగానే ఆరేసిన రచయిత్రి మీద విరుచుకుపడ్డారు విమర్శకులు,' అంటారు మాలతి.

లత రచనల్లోని అసాధారణమైన భావుకతను, వేదనను, తాత్వికతను, ఆలోచనలను, అనుభూతులను సంపూర్ణంగానే అవగాహన చేసుకున్నారు మాలతి లోని రచయిత్రి. 1958 నుండి 63 వరకు ఆంధ్రప్రభ వారపత్రికలో ధారావాహికంగా వచ్చిన లత 'ఊహాగానం' వ్యాసాల్లోని వ్యంగ్యం, హాస్యం, సంఘంలో అనేక లోపాల మీద చురకత్తులులాంటి విసుర్లతోపాటు ఆమె పాండిత్య ప్రకర్ష కూడా గుర్తించారు మాలతి. బ్రహ్మ తనని తయారుచేసేటప్పుడు ఏదో పొరపాటు చేసి ఉంటాడు అని చెప్పుకున్న లత- తనను పాఠకులు మర్చిపోతారన్న భయంలేదు, అంటారు. దానికి అనుగుణంగానే 1997లో లత మరణవార్త విని అమెరికాలో నివసిస్తున్న జెకె మోహన రావుగారు రచ్చబండ వేదికలో రాసిన రైట్ అప్ తో ఈ వ్యాసం ముగించారు మాలతి.

నాయని కృష్ణకుమారి

నాయని కృష్ణకుమారిగారి పరిశోధన జానపద వాఙ్మయం. కానీ పూర్వం పండితుల దృష్టిలో జానపద సాహిత్యం అంటే కేవలం పామరులు ఎవరికి తోచినట్టు వారు పాడుకొనే పాటలు, చెప్పుకునే కథలు అనే భావం ఉండేది. జానపద సాహిత్యాన్ని విశ్లేషించే విధానంలో నూతన పద్ధతులు ప్రవేశపెట్టిన ఘనత కృష్ణకుమారిగారిది అంటారు మాలతి. ఆఫీసులోనూ, లైబ్రరీలోనూ కూర్చొని పుస్తకాలు చదివి జానపద సాహిత్యాన్ని అవగాహన చేసుకోవడం కుదరదు. జనపదాలకు వెళ్లి ఆ కథలు చెప్పే వారితోను, పాటలు పాడే వారితోను మాట్లాడాలి. దీనికి ఎంతో ఓపిక కావాలి. జనపదులతో మాట్లాడుతున్నప్పుడు వారికి అర్థమయ్యే భాషలో

మాట్లాడాలి. వారు చెప్పింది సావధానంగా విని, నిశితంగా పరిశీలించి, ఒక అవగాహన ఏర్పరచుకోవాలి. విశ్లేషించే విధానములో కొన్ని ప్రత్యేక సూత్రాలు పాటించాలి. అలా తాను స్వయంగా అనేక పల్లెలకు వెళ్లి లెక్కలేనన్ని స్త్రీల పాటలను, కథలను సేకరించారు. టేప్ రికార్డులు వంటి పరికరాలు లేని రోజుల్లో, ప్రయాణ సౌకర్యాలు అంతంత మాత్రమే అయిన ఆ రోజుల్లో ఆమె ఎంత సమాచారం సేకరించారో చూస్తే ఆమె నిష్ఠ ఎంత పరిష్టమైనదో తెలుస్తుంది మనకు అంటారు మాలతి.

కృష్ణకుమారిగారి కవిత్వంలోను, విమర్శలోను సాధుత్వాన్ని దర్శించారు మాలతి. 'కాశ్మీర దీపకళిక' అనే యాత్రారచనలోని వర్ణనలను ఈ వ్యాసములో వివరించారు మాలతి. విశాఖపట్నం తన నెచ్చలి అంటూ కృష్ణకుమారి రాసిన కవితను ఉటంకించారు. కృష్ణకుమారి స్నేహితురాలు కాలాతీత వ్యక్తులు రచయిత్రి డాక్టర్ శ్రీదేవి మరణించినప్పుడు 1962లో 'ఏం చెప్పను నేస్తం' అని రాసిన కవిత గురించి కూడా మాట్లాడారు మాలతి.

కృష్ణకుమారిగారి విద్యాభ్యాసం, ఉద్యోగ ప్రస్థానం, వ్యక్తిత్వాన్ని ఈ వ్యాసంలో వివరించారు మాలతి.

శివరాజు సుబ్బలక్ష్మి

2009 ఆగస్టు 23న ఇండియా వచ్చినప్పుడు మాలతిగారు తాను ఎంతో అభిమానించే కథా రచయిత్రి శివరాజు సుబ్బలక్ష్మిగారిని వారింట్లో బెంగళూరులో కలిశారు. 84 ఏళ్ల వయసులోనూ చలాకీగా ఇంట్లో తిరుగుతున్న ఆమె చురుకుతనానికి ఆశ్చర్యపోవటమే కాక తను ఎప్పుడో రాసిన కథల వెనుక నేపథ్యాన్ని ఆవిడ చక చక చెప్తుంటే మరింత అబ్బురపడ్డారట. చిన్న ఇంటర్వ్యూలాగా సాహిత్యపరంగా కొన్ని ప్రశ్నలు వేశారు కూడా. కానీ ఆమె తన పుస్తకాలు భద్రపరచలేదట. బుచ్చిబాబు గారి చివరకు మిగిలేది నవల కన్నా సుబ్బలక్ష్మి గారి కథలు బాగుంటాయని కొందరు అంటారు అంటూ ఆమె నవ్వేసారట. ఆమె మొదటగా రాసిన 'నీలం గేటు అయ్యగారు'లోని పనిమనిషి గురించి చెప్తూ మనం పనివాళ్లని ఏదో అనుకుంటాం కానీ వాళ్లు చాలా విషయాలు గమనిస్తారు అనటం- మాలతిగారికి నచ్చింది. అలాగే 'మగత జీవి చివరిచూపు', 'మనోవ్యాధికి మందు ఉంది', 'ఒడ్డుకు చేరిన ఒంటి కెరటం', 'శివరాజు సుబ్బలక్ష్మి కథలు'; 'అదృష్టరేఖ' నవలను ప్రస్తావించారు మాలతి. ఇప్పటిలా లాప్‌టాప్, టైపింగ్ లేని రోజుల్లో పేపర్స్ మీద కలంతో రాయటం చూసి తాను అంతేకదా అని ముచ్చటపడ్డారు మాలతి. దంపతులిద్దరూ రచయితలు అయినప్పుడు రకరకాల వ్యాఖ్యానాలు వింటుంటాం. భర్త మూలంగానే భార్య

రచనలు ఆదరణ పొందుతున్నాయనీ, అసలు భర్తే రాసి భార్య పేరుమీద ప్రచురిస్తున్నారని అనటం సర్వసాధారణం. ఆ వాదనని ఖండించడానికి ప్రయత్నించటం నీడతో యుద్ధం చేయటమే. కనుకనే, 'నేను వర్ణనలను మానేశాను. ఎందుకంటే ఆయనను చూసి కాపీ కొట్టాను అంటారని,' అని సుబ్బలక్ష్మిగారు అంటుంటే మళ్లీ నవ్వేసారట. నిజానికి ఆమె కథనంలో స్వతఃసిద్ధమైన భావుకత పుష్కలంగా ఉంది అనటం మాలతికారి నిశిత పరిశీలనకు నిదర్శనం.

రచయిత్రి, చిత్రకారిణి, అసామాన్య గృహిణి అయిన శివరాజు సుబ్బలక్ష్మి గారితో ఓ పూటలో సగంసేపు గడపటం ఏనాటికి మరిచిపోలేని అనుభవం అంటారు మాలతి తృప్తిగా.

ద్వివేదుల విశాలాక్షి

లత ఊహగానంలాగా, మాలతిచందూర్ ప్రశ్నలు-జవాబులులాగా, సులోచనారాణి రాజశేఖరంలాగా విశాలాక్షిగారికి ఒక ప్రత్యేకమైన మార్క్‌లేదు అంటారు మాలతి. విశాలాక్షిగారి ఏ కథకి ఆ కథగా ఏ నవలకి ఆ నవలలాగా ప్రత్యేకమైనవే. కథావస్తువు, చదివించే శైలి విశాలాక్షికి కీర్తిని తెచ్చిపెట్టాయి. తన శైలి, విజయనగరం మాండలికం, సంభాషణల్లో, కథనంలో ఆమె అచ్చ తెలుగు నుడికారం కలిసి ఒక విలక్షణమైన అందాన్ని సమకూర్చాయి అన్నది మాలతిగారి అభిప్రాయం.

మాలతిగారు 'తూలిక' మొదలుపెట్టినప్పుడు విశాలాక్షిగారి కథలు అనువాదం చేయాలనుకున్నా కుదరలేదు. 'వైకుంఠపాళీ' నవల మీద సమీక్ష మాత్రం రాశారు. తర్వాత ఇండియా వచ్చినప్పుడు విశాఖపట్నం వెళ్లి విశాలాక్షిగారిని కలిశారు. ఆమె తన పుస్తకాలు అన్నిటిని సర్వహక్కుభుక్తంగా విశాఖ పౌర గ్రంథాలయానికి రాసి ఇచ్చేసారట. దాంతో మాలతిగారు భమిడిపాటి రామగోపాలంగారితో, వరహాల చెట్టిగారితో మాట్లాడి అంగీకారం తీసుకున్నారు. మనం మొదటే చెప్పుకున్నట్లుగా నేటి విమర్శలు ఇస్తినమ్మ-పుచ్చుకొంటినమ్మ వాయనం... అన్నట్లు కాకుండా మాలతి గారు తనకు నచ్చిన విషయాన్ని ఎంత ఇష్టంగా చెప్తారో, నచ్చని విషయాన్ని అంత స్పష్టంగా చెబుతారు. 'వైకుంఠపాళీ'లో వృద్ధ భార్యాభర్తల సంభాషణ ఎందుకో సందర్భోచితంగా లేదు అన్నారు నిర్ద్వంద్వంగా. 'మారిన విలువలు' నవలలో జానకి అర్ధరాత్రి ఒంటరిగా రైల్వే స్టేషన్‌కి వెళ్లటం ఆ రోజుల్లో వాస్తవంగా జరిగే సంఘటనేనా అన్న విషయం దీర్ఘంగా చర్చిస్తారు మాలతి. 'గ్రహణం విడిచింది' నవలలో భారతి పాత్రను విశ్లేషించి పాఠకులలో ఆలోచనలను రేకెత్తించారు.

విశాలాక్షి కథల్లో సహజత్వాన్ని, సమాజంలో జరుగుతున్న విషయాల్ని చర్చించిన విధానం బాగా నచ్చి అనువాదం చేసినా ప్రచురించే అవకాశం లేకపోయింది అంటారు మాలతి.

మాలతిగారు రచించినవి అనేక వ్యాసాలు ఉన్నా ఈ ఏడుగురు స్త్రీలనే నేను స్వీకరించడానికి కారణం- 1. స్త్రీ ప్రాధాన్యత, 2. మాలతిగారు కొంత ఎక్కువ శ్రద్ధ, ఇష్టం పెట్టి రాశారు అనిపించింది. పైగా మాలతిగారు స్వీకరించిన ఈ కవయిత్రులు, రచయితలు విలక్షణమైన వ్యక్తిత్వం, రచనాశక్తి గలవారు. అందుకే మాలతిగారు రాశారు. అందుకే నేను స్వీకరించాను.

మాలతిగారి కథల శైలి ఎంత సున్నితంగా ఉంటుందో ఈ విమర్శ వ్యాసాల శైలి కూడా అంత సున్నితంగా ఉంది. అదే సమయంలో సూటిగా నిష్కర్షగా చెప్తారు.

'మొల్ల సత్కారం' అందుకుంటున్న ఈ సందర్భంగా నిడదవోలు మాలతి గారికి హృదయపూర్వక అభినందనలు.

ఈ అవకాశం నాకు కలిగించిన నిర్వాహకురాలు కల్పనా రెంటాలగారికి ధన్యవాదాలు.





లైబ్రరీ సైన్స్ విద్యార్థులు చదవాల్సిన వ్యాసాలివి

అయినవోలు ఉషాదేవి

నిడదవోలు మాలతిగారు సృజనాత్మక రచయితగా, అనువాదకులుగా, విమర్శకులుగా, దాదాపు రెండు తరాలకు పైగా తెలుగు పాఠకులకు సుపరిచితులు. ప్రధానంగా నా వృత్తి భాషాశాస్త్రం అయినా చిన్ననాటి నుండీ నాకున్న తెలుగు సాహిత్యాభిరుచి వల్ల నేను ఒక పద్ధతిగా కాక, కలగాపులగంగా తెలుగు ప్రాచీన సాహిత్యం మొదలుకొని అర్వాచీనం వరకూ దాదాపు అన్ని ప్రక్రియల సంబంధమైన రచనలూ కొన్ని కొన్ని చదివానని చెప్పటం స్వోత్కర్ష కోసం కాదు, సాహిత్యంలో నాకు చిన్ననాటి నుంచి అభిరుచి ఉందని చెప్పడం కోసమే. అయినా మాలతిగారి కథలు నేను చదివింది చాలా తక్కువ. ఇటీవల అమెరికాలో పరిచయం అయిన మాలతిగారి website thulika.netలో అందుబాటులోకి వచ్చిన ఆమె రాసిన అనేక కథలలో కొన్ని, ఆమె రాసిన రెండే రెండు నవలలు- చాతకపక్షులు, మార్పు చదివాను. వీటితోపాటు ఆమె స్వయంగా చేసిన ఆంగ్ల అనువాదం, అనువాదం పై ఇంగ్లీష్‌లో రాసిన వ్యాసం ఇట్లా కొన్ని కొన్ని చదివాను. ఆ సందర్భంలోనే నాలుగు నెలల క్రితం ఆమె తూలిక.నెట్‌లో 'Topics in Library Science and other articles' అనే విభాగం కింద ఉన్న గ్రంథాలయాల సంబంధిత నాలుగు ముఖ్యమైన వ్యాసాలు కూడా చదివాను.

నేను అమెరికాలో ఉన్న సమయంలో మాలతిగారికి రెండు ఉన్నత పురస్కారాలు అందాయి. రెండూ అంతర్జాల పద్ధతిలో కావడం వల్ల వాటిలో పాల్గొనే, వినే అవకాశం దొరికింది. ఒకటి కోడూరి ప్రభాకరరెడ్డిగారు ఏర్పాటుచేసిన సిరికోన వేదికగా ఇచ్చింది; రెండోది కల్పనారెంటాలగారు తాము ప్రాచీన కవయిత్రి మొల్ల పేరిట ఏర్పరచిన పురస్కారానికి మొట్టమొదటగా మాలతిగారిని ఎంపికచేసి ఇచ్చిన 'మొల్ల పురస్కారం.' ఈ పురస్కారం సందర్భంగా ఆహ్వానించిన కొందరు సాహితీ వేత్తలతో మాలతిగారి కథలు, నవలలు, అనువాదాలు మొదలైన వాటిపై ఒక విద్యాత్మక సదస్సు వలె ప్రసంగాల కార్యక్రమం నిర్వహించారు. అందులో శ్రోతగా పాల్గొన్న నాకు వాళ్లెవ్వరూ మాలతిగారి గ్రంథాలయ వ్యాసాలు గురించి పరామర్శించకపోవటంతో అవి నేను అప్పటికే చదివి ఉండడంవల్ల వాటి గురించి రాద్దామని నాకు ఏర్పడిన అభిప్రాయం మాలతిగారికి చెప్పాను. సాధారణంగా రాయకుండానే ముందుగా చెప్పటం నా లక్షణంకాదు. కానీ కొంత నోట్స్ రాసి పెట్టుకుని ఉండడం వల్ల తొందరగానే రాసి పంపగలనన్న భావనతో చెప్పేసాను. కానీ హైదరాబాదు తిరిగి వచ్చాక అనుకున్న ప్రకారం వ్యాసం పూర్తి చెయ్యలేకపోయా.

ఈ నేపథ్యం ఎందుకంటే ఎంతో అకడమిక్‌గా జరిగిన ఆ సదస్సుతో అనుసంధానం అవ్వాల్సిన ఈ రచనలు ఆ సదస్సులో లేని వెలితి ఒకటి, కాగా వాటి ప్రాసంగికత నేటికీ ఉందని నాకు అనిపించటం రెండవది. కనీసం వాటిని చదివిన నేనైనా నా స్పందన లేదా సమీక్ష రాయాలి అనుకుంటూనే ఇంత ఆలస్యం చేశానన్న విచారం వల్ల.

ఇంతకీ ఈ 'Topics in Library Science' అనే విభాగంలోని వ్యాసాలు ఆమె సృజన సాహిత్యానికి పూర్తిగా భిన్నంగా శాస్త్రీయ వ్యాసాలు కావటం నాలో బాగా ఆసక్తిని రేపింది.

ఈ వ్యాసాలు 1967-72 మధ్య ఇంగ్లీష్ లో రాసినవీ, ముద్రితమైనవీ. ఇవన్నీ మాలతిగారు అమెరికా వెళ్లకముందు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో లైబ్రేరియన్ (అసిస్టెంటు) గా పనిచేస్తున్న రోజుల్లో రాసినవి. విశ్వవిద్యాలయాలలో పనిచేసే గ్రంథాలయ విద్యాత్మక సిబ్బంది కూడా విశ్వవిద్యాలయ ఇతర శాఖల్లోని బోధనా సిబ్బందికి సరిసమానులే అయినా చాలా విషయాలలో ఇతర అధ్యాపకుల తో సమానంగా వాళ్లను పరిగణించేవాళ్లు కాదు.

ఈ Topics in Library Scienceలో ఉన్న ప్రధాన గ్రంథాలయ సంబంధ వ్యాసాలు నాలుగు. అవి-

1. The problem of building library collection (1969)
2. The home library (1969)
3. Library Education - A point of view
4. Indian Librarianship 1972

వీటిలో ఆమె గ్రంథాలయ వ్యవస్థపై, విశ్వ విద్యాలయాలలో పరిస్థితులపై, తెలుగునాట గ్రంథాలయ ఉద్యమాలపై, ఆనాటి ప్రముఖ గ్రంథాలయ ఉద్యమ కారులపై, ప్రప్రథమ గ్రంథాలయాల ఏర్పాటు, నిర్వహణ వంటి అనేక విషయాలపై తన నిష్పాక్షిక, నిర్ద్వంద్వ ఆలోచనలూ, అభిప్రాయాలూ ఆరోజుల్లోనే వ్యక్తం చేశారు. వివిధ గ్రంథాల అవసరం రీత్యా పుస్తకాల సేకరణ విశ్వవిద్యాలయాలలో మూడు విధాలుగా (కొనడం వల్ల, బహుమానాల ద్వారా, లేదా గ్రంథాలయాల పరస్పర వినిమయాల ద్వారా) జరుగుతుందనీ, కానీ కొనడంలో మాత్రమే లైబ్రేరియన్‌కు బాధ్యత ఉంటుందని వివరిస్తూ, దానితో ముడిపడి ఉండే ఆర్థిక ఇబ్బందులు, ఆయా విశ్వవిద్యాలయాలలో ఉన్న కోర్సులపై, వాటిలోని వివిధ specializations పై గ్రంథాలయ అధికారికి (లైబ్రేరియన్) సరియైన అవగాహన ఉంటేనే అవసరమైన పుస్తకాలు / పాఠ్యపుస్తకాలను కొనడం వీలవుతుందన్న విషయం ఆమె సూటిగా నిర్ద్వంద్వంగా చెప్పారు. వివిధ గ్రంథాల లభ్యత / అలభ్యత, వివిధ సబ్జెక్టులకు సరియైన రచయితలు దొరకడం/దొరకకపోవడం, ప్రచురణకర్తలతో, ఆ ప్రచురణ పునర్ముద్రణతోనూ కలిగే సాధక బాధకాల వంటి అనేక విషయాలను చర్చించారు. గ్రంథ పట్టికలు, క్లుప్తంగా గ్రంథ వివరాలు ఇచ్చే Bulletinల అవసరం స్పష్టం చేశారు. అలాగే కొనుగోలు కోసం ప్రచురణకర్తలు ఇచ్చే డిస్కౌంట్లు (తగ్గింపులు) ప్రస్తావిస్తూ మార్గరెట్ సాల్‌ను ఉదాహరించారు. పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు మాత్రమే కాకుండా పరిశోధక విద్యార్థులకు అవసరమయ్యే periodicals, journals, seminar/ conference proceedings వంటి అనేక లైబ్రరీ అవసరాలను ఆమె ఎంతో చక్కగా వివరించారు. ఈ అంశాలన్నీ ఇప్పటికీ గ్రంథాలయ విద్యార్థులకు అవసరమయ్యేవే.

కేవలం సమస్యలు మాత్రమే ఎత్తిచూపడం కాక వాటికి పరిష్కారాలను సూచించడంలోనూ ఆమె కృతకృత్యులయ్యారు.

ఒక లైబ్రేరియన్ తను పనిచేసే విశ్వవిద్యాలయం కోసం ఎన్ని కోణాలలో ఆలోచించాలో అన్ని కోణాలను 1969లోనే ఆమె ఈ వ్యాసంలో వివరించడం ఒక సీరియస్ విద్యావేత్త (academecian) మాత్రమే చేయగలరని ఈ వ్యాసం నిరూపిస్తుంది.

ఈ వ్యాసం ILA Bulletinలో 1969లో ముద్రితమయింది (పుటలు: 43-49).

'The Home Library' (1969) అనే వ్యాసంలో ఇంటింటా స్వంత గ్రంథాలయం అన్న తెలుగువారి నినాదంలో ఉన్న స్వంత ఇంటి లైబ్రరీ ఏర్పరుచుకోవడమన్న భావన ఆధునిక కాలంలో 'ఇంట్లో డ్రాయింగ్ రూం'లో భాగంగా రూపకల్పన చేయబడిందన్నారు. జ్ఞానాన్ని మౌఖికంగా తరతరాలుగా అందించే సంప్రదాయ భారతదేశంలో ఇది కొత్త ఆలోచన అని చెప్తూ, 18వ శతాబ్దపు బ్రిటిష్ పాలన ప్రభావంతో ఏర్పడ్డ ఇతర అలవాట్ల వలెనే ఇది కూడా వచ్చి చేరింది అన్నారు. జ్ఞానసముపార్జన అక్షరాస్యతతోపాటు కలిగే పఠనశక్తి వల్ల పెరుగుతుందనీ అందు కోసం ఇంటింటా స్వంత గ్రంథాలయం ఉండాలని ఏర్పడ్డ ఈ కొత్త ఆలోచన అచ్చు యంత్రాల వల్లనే వ్యాపించింది. అదీకాక, అందరికీ విద్య అందాలనే, అందించాలనే ప్రభుత్వాల సంకల్పం దీనికి మరింత దోహదం చేసింది. ఆ విధంగా తెలుగునాట ఇంటింటా స్వంత గ్రంథాలయం అన్న ఆసక్తి పెరిగింది.

కలకత్తాలోని నేషనల్ లైబ్రరీలో ఉన్న ఆశుతోష్ గ్రంథ సంచయమే వైయక్తిక, స్వంత గ్రంథాలయానికి ప్రారంభంలో మంచి కలెక్షన్స్‌గా చెప్పవచ్చునన్నారు.

ఈ సందర్భంగా ఆమె స్వాతంత్ర్యం వచ్చాక భారతదేశంలో అక్షరాస్యత 28%గా నమోదైనప్పటికి నిజంగా చదవ గలవారిని లెక్కవేస్తే ఆ శాతం తగ్గవచ్చని ఆమె గుర్తించారు. అంటే ఏ కాలంలోనైనా గణాంక పట్టికలోని వివరాల కన్నా అసలు వివరాలు తక్కువగా ఉండే అవకాశం ఉందనే ఆమె గమనింపు ఇక్కడ మనం గుర్తించాల్సిన అంశం.

అయితే ఈ స్వంత లైబ్రరీపట్ల ఆసక్తి ఉన్నా, చాలామంది (1) ఇళ్లలో స్థలం లేక కానీ, (2) కొనగల ఆర్థిక స్తోమత లేక కానీ, (3) దేశభాషలలో చదవదగ్గ గ్రంథాల కొరత వల్లగానీ, లేదా (4) ఏవి కొనాలో సరియైన అవగాహన కలిగించేవారు దొరకక కానీ, (5) చదివే ఆసక్తి లేకపోవడం వల్లగానీ- ఈ స్వంత ఇంటి గ్రంథాలయం సరిగ్గా కొనసాగలేదు అని గుర్తించారు. సరిగ్గా ఈ కారణాలే ఇప్పటికీ ఎక్కువగా అనువర్తిస్తాయి.

కేవలం బడి పుస్తకాలవంటివి కాక స్ఫూర్తినివ్వగల జీవితచరిత్రలు, సాహిత్య రచనలు, లలితకళలను వివరించే పుస్తకాలు ఇంటి గ్రంథాలయాల్లో ఉండాల్సిన పుస్తకాలుగా ఆమె అభిప్రాయపడ్డారు. మొత్తం మీద జ్ఞానాభివృద్ధికీ పఠనం ద్వారా సమాజాన్ని అర్థం చేసుకోగల గ్రంథ సంపాదనను ఆమె ఈ వ్యాసంలో సూచించారు. అంతే కాకుండా మరికొన్ని ప్రత్యేక సూచనలూ చేశారు. వాటిలో పిల్లల కోసం

పుస్తకాలు, పుస్తకాల ధరలపై పన్ను రాయితీ వంటివి కొన్ని ముఖ్యమైనవి. చివరగా ఎంత చిన్నదైనాసరే, ప్రతీ ఇంట్లో గ్రంథాలయం తప్పనిసరిగా ఉండాలని నొక్కి చెప్పారు. అలాంటి వారికోసం ఇందులో ఉన్న సలహాలూ, సూచనలూ ఆరోజుల్లోనూ ఇప్పటికీ కూడా పనికి వచ్చాయి. అలాంటి వారికోసం ఇందులో ఉన్న సలహాలూ, సూచనలూ ఆ రోజుల్లోనూ పనికి వచ్చాయి, ఇప్పటికీ పనికి వస్తాయి.

మూడవ వ్యాసం 'Library Education- A Point of View'లో లైబ్రేరియన్ ఉద్యోగాల కోసం వివిధ విద్యాసంస్థలకు అందించాల్సిన విద్యాత్మక గ్రంథాల కొరతలను మాత్రమేకాక, లైబ్రేరియన్లను చిన్నచూపు చూడటం, వారికి ఇతర విద్యా రంగాలలోని వారికివలె కాకుండా తక్కువ వేతనాలు ఇవ్వడం వంటి విషయాలను ప్రస్తావించారు. అలాగే ఈ కోర్సు చదివినవారికి ఉండే ఉద్యోగ అవకాశాలను చర్చిస్తూ, లైబ్రేరియన్ ఉద్యోగాల కోసం శిక్షణ ఇవ్వడం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె రాసిన ఈ కింది వాక్యం చాలా అర్థవంతమైనది. 'Just as study of one language is necessary to serve as a medium of communication, the study of library science should have made a common subject to introduce the student to the world of books.' ఈ ఉపమానం బహుశా ఆమెకు మాత్రమే తట్టినట్లు గుర్తించవచ్చు. అంటే అంత లోతుగా ఆలోచించారని తెలుస్తోంది. విద్యావ్యవస్థలో విద్యార్థులకు కలిగించాల్సిన పుస్తక వినియోగ అవగాహన కోసం చక్కటి సూచనలు ఇచ్చారు (ఉదా: do not dog ear pages - పుటలను ఒక పక్క అంచుకు మడత వేయకండి వంటివి).

అలాగే విద్యార్థులకు పుస్తకాల కేటలాగు ఉపయోగించడం, వాటిని నలగకుండా చూసుకోవడం, లైబ్రరీ కౌంటర్లలో ప్రవర్తనాతీరు మొదలైన అనేక విషయాల గురించి ఇంటర్మీడియేట్ స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కలిగించే అంశం వారి సిలబస్‌లో ఉండాలన్నారు. ఈ కోర్సును ఐచ్ఛిక అంశంగా ఇంటర్ , బి.ఏ. స్థాయిల్లో పెట్టాలని ప్రతిపాదించారు. కానీ దురదృష్టవశాత్తూ ఇవేవీ ఇప్పటికీ అమల్లోకి రాలేదు. పరిస్థితులు ఇంకా దయనీయంగా మారిపోయాయని తెలుగు రాష్ట్రాల పాఠశాల, విశ్వవిద్యాలయాల గురించి ఏమాత్రం అవగాహన ఉన్న వారికైనా అర్థం అవుతుంది. (University New, Vol. X(8) August 1972. Pp. 16-17).

ఇక చివరి వ్యాసం 'Library movemet in Andhra Pradesh.' ఇది 1972లో ముద్రితమయిన Indian Librarianship (Essays in honour of S.R. Bhatia) అనే

Sat Paul Goyalగారి సంపాదకత్వంలో వెలువడిన గ్రంథంలో ప్రచురింపబడింది (Pp. 58-61). బ్రిటిష్ పాలనలో ప్రారంభమయిన ఇతర సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాలతో అనుసంధానమై గ్రంథాలయ ఉద్యమం కూడా భారతదేశంలోనూ, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ ప్రారంభమయిందన్నారు. దేశంలోని బాంబే, పంజాబ్ వంటి ఇతర రాష్ట్రాలలో వలె కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇది ప్రజా ఉద్యమం అని తెలిపారు. సమకాలీన వీరేశలింగం పంతులుగారి సంఘ సంస్కరణల ఉద్యమం వలె, గిడుగు రామమూర్తి పంతులు వ్యవహార భాషా ఉద్యమం వలెనే ముద్రణా యంత్రాల ప్రారంభంతో ఈ ఉద్యమమూ మొదలయిందని చెప్పవచ్చునన్నారు.

ఈ వ్యాసంలో తెలుగు పుస్తకాల ప్రచురణ 1775లో ప్రారంభమై, 1852 నాటికి ఎనిమిది ప్రింటింగ్ ప్రెస్‌లు మొదలయ్యాయి అంటూ 20వ శతాబ్దం ప్రారంభంలో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఆంధ్రపత్రికను ప్రారంభించారు అంటూ వ్యాసం ప్రారంభించిన మాలతిగారు విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి, వేగుచుక్క గ్రంథమాల వంటివి తెలుగు పాఠకులకు వరాలవలె రూపొందాయి అని అన్నారు. అప్పటినుండి తెలుగు ప్రాంతాలలో అనేక పట్టణాలలో ఎన్నో గ్రంథాలయాలు స్థాపించడం జరిగిందని ప్రతి విషయాన్ని వివరంగా పేర్కొన్నారు. అంటే ఏయే వ్యక్తులు, ఏయే సంస్థలు గ్రంథాలయాల ఏర్పాట్లకు కృషి చేశారో వివరించారు. ఆనాటి చారిత్రక వివరాలు తెలుసుకోవాలంటే తూలికలో ఈ వ్యాసం పూర్తిగా చదవాల్సిందే.

హైదరాబాదులో ఆ రోజుల్లో ఉన్న లైబ్రరీ అసోసియేషన్ 1914లో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించిందని, A.P. లైబ్రరీ అసోసియేషన్ 1920లో రాత్రి పాఠశాల ప్రారంభించిందని, కొండా వెంకటప్పయ్య పంతులు కృషితో రాష్ట్రంలో లైబ్రరీల అభివృద్ధికి అప్పటి ప్రభుత్వం 20,000 రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు. అలాగే ఎక్కడెక్కడ గ్రంథాలయాలు స్థాపించడం జరిగిందో వివరించారు. తెలుగు వారి కోసం జరిగిన గ్రంథాలయ స్థాపనకు సంబంధించిన కృషి గురించి ఈ వ్యాసం చాలా అందిస్తుంది. ఆనాటి ఎందరో మహానుభావుల కృషితో తెలుగునాట అంత మాత్రమైనా గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. కానీ ఈనాడు అనేక లైబ్రరీలు ఆదరణ, పోషణ లేక దయనీయమైన పరిస్థితులలో ఉన్నాయి. ఉన్నవాటికే సంరక్షణ లేనప్పుడు కొత్తవి ఆశించడం కష్టం.

1966 నుండి 1972/73 వరకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అకడమిక్‌గా లైబ్రేరియన్‌గా పనిచేసిన నిడదవోలు మాలతిగారు తన ఉద్యోగ జీవితంలో ఒక అంకితభావంతో చేసిన కృషి ఈ వ్యాసాలలో మనకు కనిపిస్తుంది. 1967లో ప్రచురితమైన 'Men of Library Science & Libraries in India' (1967. సం. Raj K. Khosla) గ్రంథంలో తనకంటూ స్థానం సంపాదించుకున్న లైబ్రేరియన్ మాలతిగారు ఈ రంగం నుంచి దూరమవడం తెలుగువారి దురదృష్టమని ఈ వ్యాసాలు చదివితే మనకు అర్థం అవుతుంది. ఆమె ఈ రంగాన్ని ఎంత సీరియస్‌గా తీసుకున్నారో ఈ నాలుగు వ్యాసాలు నిరూపిస్తాయి.

ఈ వ్యాసాలు లైబ్రరీ సైన్స్ పాఠ్య ప్రణాళికల్లో పరామర్శ (రిఫరెన్స్)గా చేర్చారో లేదో తెలియదు. కానీ లైబ్రరీ సైన్స్ చదివే ప్రతి విద్యార్థి, ఇతర రంగాలలోని ఇతర పరిశోధక విద్యార్థులు తప్పక చదవవలసిన వ్యాసాలివి. అంతేకాదు, తెలుగు గ్రంథాలయ ప్రారంభ వికాసాలు తెలుసుకోగోరే ప్రతి తెలుగు పాఠకులకూ ఇవి అవశ్యం చదవదగ్గ వ్యాసాలు.

సుమారు అయిదు దశాబ్దాల క్రితం రాసిన ఈ వ్యాసాలు ఇప్పటికీ రిఫరెన్స్‌గా పనికివచ్చేలా రాసిన మాలతిగారు అభినందనీయులు.





అంతర్జాల వేదికలో నిడదవోలు మాలతి కృషి

రాజేశ్వరి దివాకర్ల

నిడదవోలు మాలతిగారికి మొల్ల పురస్కారం సాహిత్యచరిత్రలో విశేషమైన సందర్భం. ఆనాటి ప్రథమాంధ్ర కవయిత్రి, ఈనాటి ఆధునిక రచయిత్రి పరస్పరం ఇచ్చి పుచ్చుకున్న సత్కార గౌరవంగా ఈ వేదిక తెలుగువారందరికి సంతోషాన్ని కలిగించింది.

నిడదవోలు మాలతిగారు ఏడు దశకాలుగా కావించిన రచనాకృషి ప్రతిభావంతమైనది.

తమ పేర్లలో 'మ' అక్షరాన్ని ముందుగా కలిగిన రచయిత్రులిద్దరూ తెలుగు సాహిత్యం అంతటిని 'మమ' అనే ముద్రలో ఆత్మీయం చేసుకున్నారు. మొల్ల ప్రథమ కావ్య రచయిత్రి. మాలతిగారు సాంకేతిక విద్యా పరిణత్వం కలిగి దేశవిదేశాలలో 'తూలిక' లేఖినితో అంతర్జాల అక్షర పరంపరలకు ఆది భిత్తికను నిలిపిన మాననీయ విదుషి. మూలత: మొల్ల, మాలతిగార్లు ఇద్దరూ సంపాదించుకొన్నది స్వయం చాలిత మేధా వికాసస్ఫూర్తి.

వాల్మీకి మహర్షి రాసిన రామాయణాన్ని కవయిత్రి మొల్ల సంక్షేపించింది. మూలానికి సమతుల్య గౌరవాన్ని సంపాదించుకుంది. మాలతిగారు ఆంగ్ల తెలుగు భాషలు రెంటిలో నిష్ణాతులు. వారి బ్లాగులు సుప్రసిద్ధాలు. వారి రచనలన్నీ ఈ

కాపీలుగా అందుబాటులో ఉన్నాయి. దాదాపుగా ఆధునికులందరికీ ఉపలబ్ధ మౌతున్న మాలతిగారి రచనలు అపూర్వ కవయిత్రి మొల్లను విశ్వావ్యంతం పరిచయం కావించాయని చెప్పవచ్చు. ఈ విధంగా సమకాల రచయిత్రి, శతాబ్దుల క్రిందటి అసమాన కవయిత్రికి, తమతోబాటుగ అధునాతన సాహిత్యచరిత్రల సంపుటంలో చిరకీర్తిని కలిగించే స్వర్ణపుటను తెరచి ఉంచారు.

సిరికోన సాహితీ అకాడమీవారు ప్రతి యేటా విశిష్ట రచయిత్రికి గౌరవ పురస్సరంగా ఇచ్చే సత్కారాన్ని నిడదవోలు మాలతిగారు గత సంవత్సరం 22 సెప్టెంబరు 2022న అందుకున్నారు. పురస్కారాన్ని కోమల సాహితీ వల్లభులు డా. కోడూరు ప్రభాకరరెడ్డిగారు తమ సతీమణి కోడూరు పార్వతి స్మారకంగా ఏర్పరచారు.

ఈ సందర్భంగా 'సిరికోన సాహితీ అకాడమి' గురించి రెండు వాక్యాలు తెలుసుకుని తీరాలి. ఈ వేదిక అయిదు సంవత్సరాల క్రితం 'వాక్‌స్థలి' వాట్స్ ఆప్ సమూహంగాఏర్పడింది. ఈ వాక్‌స్థలి సృజనాత్మక సాహిత్యాంశాలకు, సాహిత్య చర్చలకుగాను ఉద్దేశింపబడింది. సిరికోన సిలికాన్ వేలీకి ప్రత్యామ్నాయంగా అమెరికా, భారతదేశాల సాహితీవేత్తల వాక్కలయికలకు వారధిగా ప్రణాళికాబద్ధమైన ప్రయోజనాన్ని కలిగినటువంటిది. ఈ సంస్థ వ్యవస్థాపకులు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీ నారాయణగారు.

సిరికోన వాక్‌స్థలి సమూహ సభ్యులందరూ లబ్ధప్రతిష్టులు. వీరందరూ పరస్పరం తమ స్వీయరచనలనూ, అభిప్రాయాలను, తెలుపుకుంటారు. యువ రచనలను ప్రోత్సహిస్తారు. ప్రతి యేడాది ప్రతిష్టాత్మకమైన పురస్కారాలను ఇచ్చి వరిష్టులను గౌరవిస్తారు.

నిడదవోలు మాలతిగారిని సిరికోన సాహితీ అకాడమీవారు విశిష్ట రచయిత్రిగా సత్కరించిన సభలో 'నిడదవోలు మాలతి రచనాసౌరభాలు' గ్రంథ ఆవిష్కరణ సిరికోన సత్కారానికి ద్విగుణీకృత సమాదరణను కలిగించింది. మాలతి గారి రచనా సౌరభాలు గ్రంథాన్ని శ్రీమతి శీలా సుభద్రగారు రచించారు. ఈ గ్రంథ ఆవిష్కరణను శ్రీమతి పి. సత్యవతిగారు కావించారు. ఈ సభలో మాలతిగారి రచనలను 1960వ సంవత్సరం నుండి చదువుతూ వచ్చిన అభిమానులు వారి రచనలలోని ప్రత్యేకతను, విశేష గుణాలను గురించి ప్రసంగించారు. జూమ్ మాధ్యమంగా జరిగిన ఈ సభ విశ్వవేదికగా పరిణమించింది. మాలతిగారి రచనా సౌరభాల పరిమళం విశ్వమంతా వ్యాపించింది. మాలతిగారి రచనా ఉద్దేశ్యాల నన్నింటినీ సమగ్రంగా తెలిపిన ఈ సభ వారిని మహిళలందరి సాధనకు ప్రతినిధిగా 'విశ్వమహిళ'గా ప్రతిబింబించింది.

మాలతిగారి రచనలన్నీ సహజమైన సహజధోరణిలో అలవోకగా సాగుతున్నట్లుగా అనిపిస్తూనే తటాలున ఒక ఆలోచనను కలిగిస్తాయి. తెలుగు సాహిత్య సంస్కృతిని ప్రపంచానికి వెల్లడి చేయాలన్న సంకల్పం వారి ఆంగ్ల భాషాపాండిత్యాన్ని సార్థకం చేసింది. తెలుగు కథా రచయితలందరికీ మాలతిగారి రచనలు మార్గదర్శనం కావిస్తాయి. వ్యాసరచనలు విమర్శకులకు కరదీపికలవుతాయి. అనువాదాలు భాషా వినిమయ సూత్రాలకు తోవ చూపుతాయి. పరిశోధనా విద్యార్థులకు సారాంశ సంగ్రహణా పద్ధతిని బోధిస్తాయి. భావితరాల తెలుగు భాషా అభ్యుదయానికి, ప్రపంచీకరణ మాథ్యమంలో తెలుగువారి వాఙ్మయ ప్రాచుర్యానికి మాలతిగారి రచనలు తాత్వికమైన ఆధారాలుగా తరతరాల గ్రంథాలయాలలో స్థిరమైన పట్టికలో చేరిపోతాయి.

మాలతిగారి రచనలనన్నింటినీ చదివి వాటిని అనుసరిస్తున్న వారికి వారి రచనా ఉద్దేశాలూ, మనోగతమైన అభిప్రాయాలు, స్పష్టంగా తెలిసిపోతాయి. కథా ఇతివృత్తాలలో ఆత్మీయత కాలపరిధికి వారధిని కట్టి వారి మనస్సాక్షిని ఋజువు చేస్తుంది. వాక్యరచనలోని సహజత్వం అతి సామాన్య విషయాన్ని, టూకీగా చెబుతున్నట్టే చెప్పి మెదడులో గాఢంగా నాటుతుంది.

సరే... మాలతిగారి రచనావ్యాసంగాన్ని గురించి సంగ్రహించి చెప్పాలంటే ఒకేసారి తీగెలను వంచి శీర్షాన ఉన్న మల్లెను అందుకోవాలని చేసిన ప్రయత్నమే అనక తప్పదు.

అందుకని సిరికోన వాక్‌స్థలిలో విశ్వమహిళ మాలతిగారు అప్పటప్పటికి వెలిబుచ్చిన కొన్ని భావాలను, స్పందనలను, కవితాత్మక రచనలను, సంగ్రహించడం భావ్యమనిపించింది. ఆయా సందర్భాలకు తగిన నేపథ్య రచనలను పునరవలోకించగల అవకాశం కలిగింది.

సిరికోన కోడూరు పార్వతి స్మారక పురస్కార సందర్భంలో మాలతిగారు జాతి సంస్కృతికి భాష ప్రాతిపదిక అన్న విషయాన్ని గురించి చర్చించారు. స్త్రీలు తమ రచనలలో తాము చూసినవీ, అనుభవించినవీ రాసారని చెప్పారు.

స్ఫూర్తిమంతమైన స్త్రీ పాత్రలు సృష్టించడానికి స్త్రీవాదం అని పేరు పెట్టుకోనక్కర్లేదు అన్న వారి అభిప్రాయం బలమైనది. 'నా దృష్టిలో ఆత్మాభిమానం గల ఏ వ్యక్తి అయినా కోరేది జాలీ, సానుభూతీ కాదు. ఆ సమయంలో ఆ పరిస్థితిలో తనకున్న వనరులు ఎలా ఉపయోగించుకుందో అర్థం చేసుకోవడమే కోరేది. నా పాత్రలన్నీ అలాటి పాత్రలు,' అని వారి కథాపాత్రలను గురించి నిర్దుష్టంగా చెప్తారు.

తమను తాము గుర్తించుకోడం, ప్రధానమని వ్యక్తిత్వ నిరూపణకు కావలసిన ప్రధాన లక్షణాన్ని, తమ టపాలో నిజాయితీగా తెలిపారు.

'కొత్తగా పోయేదేమీ లేదని గ్రహించేక నిజము పలుకుట బహు తేలిక,' అంటూ తాత్వికమైన ప్రవచనాన్ని తేలికగా చెప్పి స్పందనను కలిగిస్తారు.

'కథలన్నీ రచయిత ఆత్మకథలు కావు,' అంటారు. అది నిజమే కాని విషయ నిరూపణలోని ఉన్నతి రచయితను మనకు సన్నిహితం కావిస్తుంది.

వారన్న ఈ మాటను గురించి ఆలోచిస్తే రచయిత కథలోని పాత్రకాదు, కానీ రచనా తాత్పర్యానికి విభిన్నుడు కాదు. ఒక రచయితను ఆరాధ్యంగా కావించుకోడం పాత్రలనుబట్టి కాదు, రచనా సారాంశాన్ని బట్టి. మాలతిగారు రాసిన మామిడిపిందెల పట్టుచీర రచయిత ఆత్మకథ కాదు. ఈ నీతి వారిని మనకు దగ్గర చేస్తుంది.

''నేను రాసినదాన్నిబట్టి నా స్థాయి కానీ నా వయసునుబట్టి కాకూడదు. నేనిక్కడికి సరదాకే వస్తాను. ఎవరినీ హేళన చేసే ఉద్దేశం లేదు,' అంటూనే హాస్య స్ఫోరకంగా సార్థకమైన వ్యాఖ్యలను కావిస్తారు. అందరితో కలసి ఉండాలనే ఆశయంతోపాటు తమ ఆలోచనల పరిధిని విస్తృతం చేస్తారు.

దేవుడుగారికి ఒక ఉత్తరం రాసారు. 'మన సంస్కృతిలో భగవంతుడిని మానవ మాత్రుడుగానే భావిస్తాం. భద్రాచల రామదాసు కీర్తనలు, అన్నమాచార్య కీర్తనలు చూస్తే, వాటిలో మానవస్వభావాలు చాలా కనిపిస్తాయి. అలా అనుకోడంవల్లే భగవంతుని సఖుడుగా గుర్తించడంవల్ల మనసు విప్పి బాధలన్నీ నిర్భయంగా చెప్పుకో గలుగుతాం.' దేవుడంటే మనిషికి గల భయాన్ని తొలగించి దైవాన్ని స్నేహితుని కావిస్తారు.

భాషా విషయాన్ని గూర్చి ప్రస్తావిస్తూ, 'నేను ఇంగ్లీషు నేర్చుకోకూడదని చెప్పడం లేదండి. కంప్యూటరుకీ, ఐఫోనుకీ సృష్టించిన కొత్త పేర్లు వాడమని కూడా చెప్పడం లేదు. నేనంటున్నది మనకి ఉన్న అతి సామాన్యపదాలని ఎందుకు వదిలేసు కోవాలి,' అని వివరణను పొడిగించక విషయాన్ని నిర్దుష్టం కావిస్తారు.

'భ్రమ కల్పించడం తేలిక,' అంటూ నిత్యజీవితంలోని సంభ్రమ విభ్రమాలకు ఒక సరదా సంఘటనను జోడిస్తారు.

రావిశాస్త్రిగారిని నాకు తెలుసు అంటాననుకోండి.

ఎలా తెలుసు?

ఆయనా మేం ఒకే వీధిలో ఉండేవాళ్లం. ఆయన ఆ చివరా, మేం ఈచివరా.

అవునా?

ఆయన తల్లీ మా అమ్మా కలిసేవారేమో నాకు తెలీదు. నా ఊహ మాత్రమే, కలుసుకుని ఉండకపోతారా అని.

నీకు బాగా పరిచయం అన్నమాట.

బాగా పరిచయం లేదు.

మరి తెలుసన్నావు?

ఆయన రోజూ మా యింటి ముందునించి రిక్షాలో కోర్టుకెళ్లేవారు. నేను చూసేను.

అంతే కథ. టూకీగా మనిషి ప్రవర్తనలోని భిన్న పార్శ్వాన్ని తడిమి చూసి లౌకిక జ్ఞానానికి కిటికీ తలుపును తెరుస్తారు.

ఒకే పేరున్న ఇద్దరు రచయితలలో ఒకరిని మరొకరుగా అపోహపడడాన్ని గురించి ఆంగ్లంలో చక్కని కవితను రాసారు. కన్నడ రచయిత్రి మాలతీరావుకు 2007లో అకాడమీ పురస్కారం వచ్చినప్పుడు మాలతిగారిని అభినందించారట కొందరు. అప్పుడు-

MALATHI WHO?
Shakespeare raised The compelling question
What is in a name?
So I thought too, until now...
In the first place!
A move I make
A philosophy I believe in
A principle I choose to live by
Sums me up and sets me apart

మానవీయత, ఆత్మీయత, ప్రత్యేకత, తమదైన ఆలోచన, అనుభవమూ ఉట్టిపడే కవితా పంక్తులను రాసారు. చదివి పులకితులం అవుతాము.

కలలు అర్థరహితమా? అని ప్రశ్నించుకుని

చింతన

సాంత్వన

పొంతన ... అని తేలిపోయే కలలకు, బహుశా పరిసరాలతో సమన్వయం కావించి నైరూప్యానికి రూపకల్పన కావిస్తారు.

మాలతిగారు 2022 సంవత్సరం చివరి తారీఖున తమనూ తమ గతాన్ని, నెమరు వేసుకున్నారు. వారు సిరికోన సాహితీ అకాడమీ వాక్‌స్థలికి ఒక విజ్ఞాపనను కావించారు. అందులో తమ రచనాప్రస్థానాన్ని సమగ్రంగా ఉద్ఘాటించిన పుస్తకాన్ని రాసిన ప్రముఖ రచయిత్రీ చిత్రకారిణీ, శ్రీమతి శీలా సుభద్రాదేవిగారికి ధన్యవాదాలను అందించారు. సిరికోన అందించిన సత్కారం ప్రత్యేకమైనదని పేర్కొన్నారు.

‘‘ఈ సత్కారం ఎందుకు ప్రత్యేకమో చెప్తాను. ఈ సభలో కొందరు సభ్యులు నా రచనల గురించి 1960వ దశకంలోనే నేను తిరుపతిలో ఉన్న రోజుల నుండీ ఎరిగినవారు. మీ కథలు అప్పుడే మాకు తెలుసు అన్నమాట వినడంలో ఎంత సంతృప్తి!

‘రెండోది, ఆ సభలో వక్తలందరూ కూడా నా రచనలు చాలాకాలంగా చదువు తున్నవారు. ఆ విషయం సభలో చెప్పినవారూను. నాకు కావలిసింది అదే- నా జీవితంలో అవకతవకలు మాట్లాడేవారు కాక, నా సాహిత్యం గురించి ప్రస్తావించే వారు. అలాటివారు ఈరోజుల్లో ఉన్నారని నాకు ఈ సభ మూలంగా నమ్మకంగా తెలిసింది,’’ అని సంతసం వ్యక్తం చేసారు.

‘‘2017-2022 మధ్య రాసినవి మరో సంకలనానికి తగినన్ని కథలూ వ్యాసాలూ పిచ్చాపాటి కబుర్లూ ఉన్నాయి,’’ అని ముఖ్యమైన సంగతిని వెల్లడించారు.

మాలతిగారు ఈ లేఖలో ఒక సృజనాత్మక రచయిత్రి అంతరంగాన్ని ఆవిష్కరించారు. రచయిత ఆశించేది ఆమె రాసిన వస్తు విషయ చర్చ, అటువంటి సాహిత్యచర్చ జరిగినందుకు సంతృప్తిని వెల్లడించారు.

తమలో తాము చెప్పుకుపోతున్నట్లుగా యథాలాపధోరణిలో సాగిన ఈ ప్రసంగాన్ని విజ్ఞులు కొనియాడారు. వారి మాటలు మనసుకు దగ్గరగా ఉన్నాయని అన్నారు. ‘చాలా సాదాగా కనిపిస్తూనే శక్తిమంతంగా సాగిన నెరేషన్ మీది,’ అన్న మాట మాలతిగారి రచనలన్నింటిలో కానవచ్చే మేలి గుణం.

సూక్ష్మ పరిశీలన, తార్కికత, అరమరికలు లేని సంవాదనాశీలత మాలతిగారి విశేష తత్వం. తానేమిటో తెలుసుకున్న వ్యక్తిగత దర్శనం వారి అహంకారాన్ని అలంకారంగా చేసిన మూల రహస్యం. మాలతిగారు ఆనాటి మొల్లకు సాటి, మేటి. ఈనాటి కలాలన్నింటికి, రచనా మాధ్యమంలో కల్పనలను విడిచి, మిథ్యా జాలాల నల్లక నిజాలను చెప్పాలని గణక తంత్రులను మీటిన మహా మనస్విని.





అచ్చమైన అమెరికా కథారచయిత్రి నిడదవోలు మాలతి

కల్పనారెంటాల

దాదాపు ఇరవై ఏళ్ల కిందటి మాట. నిడదవోలు మాలతిగారిని కలవాలని ఆతృత, ఆరాటం. ఆమె గురించి తెలియక ముందు ఆమె గురించి తెలిసింది ఓ కథ మాత్రమే. నిజానికి ఆ కథ ఆమెకు మంచి పేరు తెచ్చి పెట్టిందో లేదో తెలియదు కానీ ఆమెను ఇప్పటికీ ఆ కథ పేరుతో అనేకమంది అపార్థం చేసుకుంటూ ఉంటారనన్నది మాత్రం నిజం.

నాకు ఆ నిజం ఆమెతో పరిచయం అయ్యాక తెలిసింది.

తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా డయాస్పోరా సాహిత్యంలో నిడదవోలు మాలతిగారి పేరు విననివారు ఎవరైనా ఉంటారనుకోను. పదకొండు కథా సంకలనాలు, రెండు నవలలు, అయిదు వ్యాససంపుటాలు, ఇంకా కవితలు, నాటికలు, బ్లాగు పోస్టులు, ఇంకా అనేకం రాసిన రచయిత్రి. ఇక ఇంగ్లీష్‌లో ఆమె కృషికి తూలిక వెబ్ సైట్ మరో కలికితురాయి. తెలుగుభాష కనుమరుగవుతోందని, ఇక ఈ భాష బతకదని మొసలి కన్నీరు కారుస్తూ ఆమె కూర్చోలేదు. తెలుగు సాహిత్యంలో మేలైన వాటిని ఎంపికచేసి ఇంగ్లీష్‌లోకి అనువాదం చేసి, నిస్వార్ధంగా అంతర్జాతీయ వేదిక మీద తెలుగు సాహిత్యాన్ని కూర్చోబెట్టినవారు ఎవరైనా వున్నారంటే అందులో ప్రథమంగా చెప్పుకోవాల్సింది నిడదవోలు మాలతిని మాత్రమే.

ఈ మాట కుండబద్దలు కొట్టినంత గట్టిగా చెప్పటానికి నాకు చాలా కారణాలు కనిపిస్తున్నాయి.

తెలుగు సాహిత్యాన్ని అనువాదం చేసి గణుతికెక్కిన మహామహులు లేరని అనటం లేదు. అయితే ఆ పని చేయటం వెనుక వున్న కారణాలు, తెచ్చుకున్న కీర్తి, అందుకున్న ఘన సత్కారాలు వేరు. అలాంటివి ఏవీ లేకుండా, ప్రతిఫలాపేక్ష లేకుండా, కేవలం తెలుగు మీది అభిమానంతో, ప్రేమతో తాను చేయగలిగింది చేసి ఇప్పటికీ తెర చాటున వుండిపోయింది మాత్రం మాలతి ఒక్కర్తే.

తెలుగు సాహిత్యానికి మాలతి చేసిన కృషి గురించి పరిశోధన గ్రంథాలు రాసేంత సమాచారం వున్నప్పుడు, నేను కేవలం చిన్న వ్యాసంలో కుదించి రాయటం కష్టమే. మాలతి సమగ్ర సాహిత్యకృషి మీద శీలా సుభద్రాదేవి ఒక పుస్తకమే రాశారు. మరికొందరు పరిశోధన చేశారు. కాబట్టి లోతైన విమర్శ చేయకుండా స్థాలీపులాకంగా చెప్పే ప్రయత్నం చేస్తా.

మాలతిగారు కథలతో తమ సాహిత్య ప్రస్థానం మొదలుపెట్టారు. నవల, అనువాదం, సాహిత్యవిమర్శ లాంటి వాటిల్లో తర్వాతర్వాత విశేష కృషి చేసినా, నిడదవోలు మాలతి అనగానే ఆమె రాసిన వందల కథల్లో ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన ఏదో ఒక కథ గుర్తుకు వస్తుంది.

కథామాలతి-1 లో మొత్తం 15 కథలున్నాయి.

మాలతిగారి కథల్లో యే కథ కూడా మరో కథలా ఉండదు. పేర్లు మాత్రం ఎక్కువ సీతాపతి, గౌరీపతి, దానయ్య, చిన్నయ్య, చిట్టీ, సీత, సావిత్రి అంటూ కథలు సాగుతాయి. పేర్లు అలా ఉన్నాయి కదా కథలు కూడా పాత చింతకాయలాగా ఉంటాయేమో అనుకోనక్కర లేదు. నిజానికి పాత చింతకాయ పచ్చడి అంటే తెలుగు వారికి ప్రాణం. అనారోగ్యం నుంచి కోలుకుంటున్నప్పుడు పాత చింతకాయ పచ్చడి మంచి ఔషధంలాగా పనిచేస్తుంది. మాలతి కథలు కూడా అంతే. ఆశ్చర్యం ఏమి టంటే, మాలతి ఈ కథా సంకలనాన్ని 2011లో కూర్చారు. ఇందులో మొదటి కథ 'కొనే మనిషి' ఆంధ్రప్రభ వారపత్రికలో 1976లో ప్రచురితమైంది. మొత్తం 15 కథల్లో 10, 11 కథలు డయాస్పోరా కథలు. తొలి తెలుగు డయాస్పోరా కథ 1964లో వచ్చిందని ప్రస్తుతం మనకు లభ్యమవుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. మాలతి మొదటి కథ ఎప్పుడు ప్రచురితమైంది? కానీ డయాస్పోరా కథలను తెలుగు పత్రికల్లో ప్రచురించి తెలుగువారికి పరిచయం చేసిన మొదటి రచయిత్రి నిడదవోలు మాలతి మాత్రమే అని ఇప్పటివరకు నా దగ్గరున్న సమాచారంబట్టి తెలుస్తోంది. ఒకవేళ ఆమె మొదటి రచయిత్రి కాకపోయినా, అరవయ్యవ దశకం నుంచి అక్కడా, 70 వ దశకం నుంచి ఇక్కడా (ఉత్తర అమెరికాలో), అక్కడా కూడా విడవకుండా కథలు విస్తృతంగా రాసిన మొదటి డయాస్పోరా రచయిత్రి ఆమె మాత్రమే.

ఒక్కో కథ గురించి వివరంగా చర్చించవచ్చు కానీ ఆ పని చేసే సమయం, సామర్థ్యం నాకు లేదని వొప్పుకుంటూ మాలతి కథల్లోని థీమ్‌ని నా పరిమిత పరిధిలో చర్చించే ప్రయత్నం చేస్తా.

ఈ కథలు ఇండియాలో వున్నప్పుడు కొన్నీ, ఇక్కడకు వచ్చాక మరిన్ని చదివా. అయితే ఈ వ్యాసం కోసం మళ్లీ చదువుతున్నప్పుడు ఆమె ఎంత వైవిధ్యమైన కథలు రాశారో మరోసారి అర్థమైంది. ముఖ్యంగా డయాస్పోరా కథను ఆమె ఎంత సున్నితంగా, ఎంత లోతుగా పట్టుకున్నారో కొన్ని కథల ద్వారా బాగా అర్థమవుతుంది. ఉదాహరణకు కథామాలతి మొదటి సంకలనంలోని మొదటి కథ.

1976లోనే మాలతి రాసిన 'కొనే మనిషి' అందుకు మంచి ఉదాహరణ.

అమెరికన్ ఇంగ్లీష్‌లో మంచి ఇడియమ్ (జాతీయం) 'buy it', 'I don't buy it' అంటూ మంచి స్లాంగ్‌లో వాడేస్తూ ఉంటాము ఇక్కడి భాషకు అలవాటు పడ్డాక. ఆ జాతీయం ద్వారా అమెరికన్ సమాజంలోని ఓ అంశాన్ని తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ముడి వేస్తూ రాసిన కథ ఇది.


చిన్నప్పటి నుంచీ పెంచి, పెద్ద చేసి చదువు చెప్పించిన అప్పను, మేనల్లుడినీ కూడా అమెరికాకు రప్పించటం వెనుక తమ్ముడికి ఉన్న అసలు ఉద్దేశ్యాన్ని ఆమె 'కొనే మనిషి' ద్వారా చూపించారు. మాలతి కథల్లో ఎక్కువ భాగం మనస్తత్వ విచారణే అనిపిస్తుంది నా మటుకు నాకు. మనిషి వ్యక్తిత్వాన్ని, విలువలను, వారి ఆలోచనలను చక్కగా అంచనా వేసి చిన్న కథల ద్వారా తెలుగువారి జీవితాలు ప్రవాసంలోను, ఇండియాలోనూ కాలానుగతంగా ఎలా మారుతూ వస్తున్నాయో 'కొనే మనిషి' లాంటి కథల్లో వ్యక్తం చేశారు.

నాకు బాగా నచ్చిన కథ 'జేబు.' స్త్రీకి ప్రత్యేక వ్యక్తిత్వం, ఆర్థిక స్వాతంత్ర్యం వుండాలి లాంటి వాదనలు ఏమీ చేయకుండా, ఓ ఆడపిల్ల గౌనుకి జేబు ఎందుకు అవసరమైందో చాలా సున్నితంగా రాసిన ఈ కథ అనేకమంది కథాప్రేమికులకు ఇష్టమైన కథ.

ఈ ఒక్క సంకలనంలోని 15 కథలు పదిహేను రకాల పరిస్థితులకు సంబంధించినవి. అమెరికా వచ్చి స్థిరపడ్డాక, నోస్టాల్జియా రాస్తున్నారన్న అపప్రధను ప్రశ్నిస్తాయి మాలతి కథలు. ఆమె కథలు చదివితే కనీసం కొందరు రచయితలు 70వ దశకం నుంచీ ఇప్పటిదాకా కూడా రెండు సంస్కృతుల మధ్య వైరుధ్యాన్ని పైపైన కాకుండా లోతుగా చెప్పారని ఒప్పుకోవాలి. అలా అని మాలతిగారిని నేను కేవలం ప్రవాస రచయిత్రి అని ముద్ర వేయటం లేదు. ఆ సంస్కృతిలో భాగమైన రచయిత్రి కలం నుంచి వచ్చిన అచ్చమైన అమెరికా కథలు ఆమెవి అని మాత్రమే చెప్తున్నా.



మాలతిగారి సాహిత్యకృషి


















మాలతిగారి సాహిత్యకృషి



















మాలతిగారి సాహిత్యకృషి














Molla Satkara Grahita


Nidadavolu Malathi Sahityavalokanam



సంస్కృత రామాయాణాన్ని జాను తెలుగులో ధైర్యంగా రాసిన రచయిత్రి మొల్ల. మొల్ల ఎలాంటి విమర్శలను ఎదుర్కొని ఈ రచనను చేసి ఉంటుందో సులభంగానే ఊహించవచ్చు. అందుకు మొల్లను మనం గుర్తుంచుకోవాలి. ఎప్పటికప్పుడు గుర్తు తెచ్చుకోవాలి.



మొల్ల సత్కార తొలి గ్రహీత నిడదవోలు మాలతి. ఆమె కలం నుంచీ ఏడు కథా మాలతీయాలు, నాలుగు ఎన్నెమ్మ కథా సంకలనాలు, నాలుగు వ్యాస సంకలనాలు, రెండు నవలలు: చాతక పక్షులు, మార్పు- ఇంకా అనేక అనువాదాలు, తూలిక ఇంగ్లీష్, తెలుగు వెబ్‌సైట్లు ఆమె సాహిత్య కృషికి తార్కాణం.



మొల్ల సత్కారం అంటే, రచయిత్రుల విశేషకృషి గురించి మాట్లాడుకునే ఒక సందర్భం. ఆ సత్కారానికి నిడదవోలు మాలతి కంటే అర్హులు మరొకరు లేరు.



అలనాటి మొల్ల నుంచి నేటి నిడదవోలు మాలతి గారి దాకా ఎందరో రచయిత్రులు. వారి సాహిత్య కృషిని గురించి చర్చించుకోవటానికి ఇదొక శుభ సందర్భం.

కల్పనారెంటాల